fb/prajasakti, www.prajasakti.com

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 38 | విజయవాడ, గురువారం 8 ఫిబ్రవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

కపట నాటకం

పార్లమెంట్‌లో టిడిపి, బిజెపి హైడ్రామా

విభజన హామీల ఊసెత్తని ప్రధాని

నిరసన తెలపని టిడిపి ఎంపీలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విభజన హామీలపై పోరాడుతున్నామని చెబుతున్న టిడిపి బిజెపితో కలిసి ఆడుతున్న హైడ్రామా బుధవారం నాడు పరాకాష్టకు చేరుకుంది. యధావిధిగా బుధవారం పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాగానే టీడీపీ ఎంపీలు ఆందోళన మొదలుపెట్టారు. లోక్‌సభలో వెల్‌లోకి వెళ్లి ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. కానీ రాష్ట్రపతి ప్రసంగంపై ప్రధాని మాట్లాడడానికి లేవగానే టిడిపి ఎంపీలు నిరసన విరమించారు. ప్రధాని ప్రసంగానికి బల్లలు చరిచారు. ప్రధాని ఏపీ గురించి ప్రస్తావించారు. ఎన్టీయార్ టిడిపి ఎందుకు పెట్టారో చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అన్యాయంగా విభజన చేసిందంటూ మాట్లాడారు. కానీ విభజన హామీలపై ఒక్క ముక్క మాట్లాడలేదు. ఆంధ్రా ప్రజల ఆకాంక్షలకు విలువివ్వలేదు. పార్లమెంట్‌లో ఎంపీలు చేస్తున్న ఆందోళనను పట్టించుకోలేదు. కానీ ఈ సమయంలో కూడా టిడిపి ఎంపీలు కుర్చీల్లోంచి కదలలేదు. కీలక సమయంలో ప్రధానికి నిరసన తెలపలేదు. ఇదే సమయంలో సిపిఎం, కాంగ్రెస్, ఐయుఎంఎల్, ఆరెస్పీ సభ్యులు వెల్‌లోకి వెళ్లి ప్రధాని ప్రసంగం సాగినంతసేపు నిరసన తెలిపారు. ఎన్సీపి, ఆప్, ఆర్జేడీ, ఎంఐఎం, ఎస్పీ సభ్యులు తమ స్థానాల్లోనే నిల్చొని నిరసన తెలిపారు. టీడీపీ ఎంపీలు మాత్రం కూర్చొనే ఉన్నారు. దీంతో విభజన హామీలపై టిడిపి, బిజెపి కలిసి ఆడుతున్న కపటనాటకం బయట్టబయలైంది.

కాంగ్రెస్‌దే పాపం

ఎపి విభజనపై ప్రధాని మోడీ




ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై బుధవారం పార్లమెంట్ ఉభయ సభల్లో మాట్లాడిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. తన ప్రసంగం సాంతం కాంగ్రెస్ చేసిన అన్యాయం.. ఆంధ్రప్రదేశ్‌ను ఎలా విభజించింది అన్న విషయాలను మాత్రమే ప్రస్తావించారు. కాంగ్రెస్ తలుపులు మూసి రాష్ట్ర విభజన చేసిందంటూ తీవ్ర స్వరంలో మాట్లాడిన ఆయన ప్రస్తుతం బడ్జెట్‌లో ఏపికి కేటాయింపులపై మాత్రం మూగబోయారు. వాజ్‌పేయి హయాంలో మూడు రాష్ట్రాలు విభజిస్తే ఎలాంటి వివాదాలు రాలేదని.. కాంగ్రెస్ పార్టీ ఒక్క రాష్ట్రాన్ని విభజిస్తే నాలుగేళ్లుగా విభజన సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయని ప్రధాని అన్నారు. అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌ను కాంగ్రెస్ విభజించిన తీరు వల్లే ఇన్నేళ్లయినా సమస్యలు అలాగే ఉన్నాయన్నారు."తెలంగాణ ప్రజల మనోభావాలకు అనుగుణంగా ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు మేం మద్దతు

మిగతా 9లో

కొనసాగిన ఆందోళనలు

- లోక్‌సభ నుంచి వైసిపి ఎంపిల వాకౌట్
- రాజ్యసభ నుంచి కెవిపి సస్పెన్షన్



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విభజన హామీలు అమలు చేయాలని బుధవారం కూడా టిడిపి, వెసిపి, కాంగ్రెస్ ఎంపిలు పార్లమెంట్‌లో నిరసన తెలిపారు. అయితే ప్రధాని మోడీ ప్రసంగానికి ముందే టిడిపి ఎంపిలు తమ ఆందోళనను విరమించారు. అప్పటికే కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత కుమార్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రధాన మంత్రి ప్రసంగం సమయంలో ఆందోళన విరమించి, ప్రసంగం అనంతరం మళ్లీ ఆందోళన చేసుకోవచ్చని ఒప్పందం జరిగింది. ఒప్పందం అంశాన్ని కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్, అనంత కుమార్‌లు సుజనా చౌదరికి తెలిపారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా కేంద్ర మంత్రి సుజనా చౌదరికి ఫోన్ చేసి ఆందోళన విరమించాలని కోరారు. వెంటనే సుజనా

మిగతా 9లో

నేడు బంద్

- మద్దతు ప్రకటించిన వైసిపి, జనసేన, కాంగ్రెస్
- టిడిపి ప్లకార్డులతో నిరసన
- పాఠశాలలకు సెలవు ప్రకటించిన ప్రభుత్వం
- ఆర్‌టిసి బస్సులు నిలిపివేత
- విద్యా సంస్థల స్వచ్ఛంద సెలవు
- కలిసొస్తున్న వాణిజ్య, వ్యాపార వర్గాలు
- కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయ, జర్నలిస్టు సంఘాల సంపూర్ణ మద్దతు



విశాఖలో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష, ఉద్యోగ సంఘాల నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా నేడు బంద్ జరగనుంది. వామపక్షాలు ఇచ్చిన బంద్ పిలుపు అన్ని రాజకీయ పక్షాలతోపాటు, ప్రజా, వర్తక, వాణిజ్య సంఘాలూ, పెన్షనర్లు, ఉపాధ్యాయులు, టాక్స్‌పేయర్స్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రధాన ప్రతిపక్షం వైఎస్‌ఆర్ కాంగ్రెస్, కాంగ్రెస్, జనసేన పార్టీలు కూడా మద్దతు తెలిపాయి. పార్లమెంటులో ఎంపిలు చేస్తున్న నిరసనకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల, నియోజకవర్గ కేంద్రాల్లో 'పార్లమెంటులో మీరు పోరాడండి, మీ వెనుక మేమున్నాం' అనే నినాదంతో కూడిన ప్లకార్డులు ప్రదర్శిస్తున్నట్లు ప్రకటించింది. అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్, ప్రైవేటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటిస్తూ విద్యాశాఖ మెమో జారీచేసింది. ఆర్‌టిసి బస్సులన్నీ నిలిపేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. బంద్‌కు మద్దతుగా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి గురువారం తన పాదయాత్రను నిలిపేస్తున్నట్లు

మిగతా 9లో



తైవాన్ పర్యాటక కేంద్రంలో భూకంపం

ఐదుగురి మృతి, 60 మందికి పైగా గల్లంతు

9





చిత్తూరు జిల్లా వెంకట్రామాపురంలో టిడిపి ఎంఎల్‌సి గాలి ముద్దుకృష్ణమ నాయుడు పార్థివదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

నేడు ముద్దుకృష్ణమ అంత్యక్రియలు

- సహచరుడిని కోల్పోయా : చంద్రబాబు నివాళి
- శోకసంద్రంలో వెంకట్రామాపురం

ప్రజాశక్తి - తిరుపతి ప్రతినిధి

టిడిపి ఎంఎల్‌సి గాలి ముద్దుక్రిష్ణమనాయుడు డెంగ్యూ జ్వరంతో హైదరాబాద్ కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందారు. వివిధ రాజకీయ పార్టీ నేతల సందర్శనార్థం హైదరాబాద్‌లో ఆయన భౌతికకాయాన్ని బుధవారం మధ్యాహ్నం వరకు ఉంచారు. అనంతరం విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి మధ్యాహ్నం 1.25కు తీసుకొచ్చారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో రామచంద్రాపురం మండలం వెంకట్రామాపురానికి తీసుకొచ్చారు. అప్పటికే ఆ గ్రామంలో జిల్లా నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు చేరుకున్నారు. ఆయన పార్థివదేహం అక్కడికి చేరుకోనేసరికి గ్రామమంతా

మిగతా 9లో

రహస్యమెందుకు?

'రాఫెల్'పై విపక్షాల నిలదీత



న్యూఢిల్లీ : రాఫెల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ ఒప్పందం వివరాలను పార్లమెంట్‌లో బహిర్గతం చేయకపోవడంపై కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నాయి. ఒప్పందంపై ప్రభుత్వం నిశ్శబ్దంగా ఉంటుందంటే అందులో అవినీతి ఉన్నట్లేనని ఆరోపిస్తున్నాయి. మరో వైపు రాఫెల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ ఒప్పందం వివరాలను పార్లమెంట్‌లో బహిర్గతం చేయకపోవడంపై కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. రాఫెల్ కొనుగోలు ఒప్పందంలో భారీ కుంభకోణం చోటు చేసుకుందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది.రాఫెల్ యుద్ధ విమానాల ధరలను ఎందుకు బయటపెట్టడం లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బుధవారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. ఈ ఒప్పందంపై ప్రధాని మోడీ నిశ్శబ్దంగా ఉంటున్నారంటే ఏదో రహస్యం ఉందని రాహుల్ విమర్శించారు. నిజానికి గత ఏడాది గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల నుంచి రాఫెల్ ఒప్పందం గురించి కేంద్రంపై రాహుల్ విమర్శిస్తున్నారు. ప్రధాని మోడీ వ్యక్తిగత బాధ్యతతో ఈ ఒప్పందం కుదుర్చుకోవడానికి దోహదం చేశారని రాహుల్ ఆరోపిస్తున్నారు. గత యుపిఎ ప్రభుత్వంలోని ఒక్క రాఫెల్ విమానాన్ని రూ.526 కోట్లుకు కొనుగోలు చేసేందుకు చర్చలు జరిగాయని, అయితే ప్రస్తుత మోడీ ప్రభుత్వం ఒక్క విమానాన్ని రూ. 1,570 కోట్లుకు కొనుగోలు చేసినట్లు తెలుస్తుందని రాహుల్ ఆరోపిస్తున్నారు. మోడీ పారిస్‌కు వెళ్లాక ఒప్పందం కుదిరిందని ఆరోపిస్తున్నారు. ఈ వారంలో కూడా రాహుల్ ఇదే విమర్శలు చేశారు. దేశ భద్రతను, ప్రయోజనాలను మోడీ ప్రభుత్వం పణంగా పెడుతోందని రాహుల్ విమర్శించారు.

ఒప్పందాన్ని బయటపెట్టాలి

సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్

(ఇండియా న్యూస్ నెట్‌వర్క్ న్యూఢిల్లీ)

రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందంపై రక్షణ శాఖా మంత్రి పార్లమెంట్‌లో చేసిన ప్రకటన ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని సిపిఎం పొలిట్‌బ్యూరో పేర్కొంది. తిరిగి ఒప్పందం కుదర్చుకున్న నాటి నుండి యుద్ధ విమానాలకు గత ఒప్పందంలో పేర్కొన్న ధర కన్నా అధిక ధరకు కొనుగోలు చేశారంటూ ఆరోపణలు వచ్చాయని గుర్తు చేసింది. రెండు దేశాల ప్రభుత్వాల మధ్య చేసుకున్న ఒప్పందం బయటకు చెప్పలేని సమాచారమంటూ రక్షణ మంత్రి పేర్కొనడం అంగీకారం కాదని, వేల కోట్ల రూపాయలతో చేసుకున్న రక్షణ ఒప్పందాన్ని రహస్యంగా ఉంచకూడదని పేర్కొంది. దేశ సార్వభౌమాధికార సంస్థ అయిన పార్లమెంట్‌కు తెలపకుండా సమాచారాన్ని ఎందుకు దాచి పెడుతున్నారని ప్రశ్నించింది. జాతీయ ఖజనాపై అన్యాయమైన భారాన్ని మోపుతుందని విమర్శలు వస్తున్న అంశంపై, అదే విధంగా రక్షణ రంగం, రక్షణ రంగ ఉత్పత్తులు చేసే ప్రభుత్వ రంగ సంస్థలకు నష్టం చేకూర్చే అంశంపై పార్లమెంట్‌కు సమాచారాన్ని నిరాకరించడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. ప్రభుత్వం పాదదర్శకతను పాటిస్తూ రాఫెల్ యుద్ధ విమానాలకు చెందిన వివరాలన్నింటినీ పార్లమెంట్‌కు, ప్రజలకు తెలియజెప్పాలని సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది.



సిపిఎం తెలంగాణ కార్యదర్శిగా తమ్మినేని

- రెండోసారి ఏకగ్రీవ ఎన్నిక
- 13 మందితో రాష్ట్ర కార్యదర్శివర్గం
- 60 మందితో రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా తమ్మినేని వీరభద్రం ఎన్నికయ్యారు. మార్చి 2015లో జరిగిన పార్టీ రాష్ట్ర మొదటి సభల్లో తమ్మినేనిని కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండో మహాసభల్లో మరోసారి ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నల్లగొండ పట్టణంలో జరుగుతున్న సిపిఎం తెలంగాణ రాష్ట్ర రెండో మహాసభల్లో చివరిరోజైన బుధవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. 13 మందితో రాష్ట్ర కార్యదర్శివర్గం, 60 మందితో నూతన రాష్ట్ర కమిటీని ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

తమ్మినేని వీరభద్రం, ఎస్ వీరయ్య, చెరుపల్లి సీతారాములు, జి నాగయ్య, చుక్క రాములు, నంద్యాల

మిగతా 9లో

విలువలతో కూడిన సమాజానికి కృషి



గుంటూరు జిల్లా మంగళగిరిలో అమృత విశ్వవిద్యాపీఠం శిలాఫలకం ఆవిష్కరణలో సిఎం చంద్రబాబు, మంత్రులు నారాయణ, కామినేని శ్రీనివాస్ తదితరులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

స్వలాభాపేక్ష లేకుండా విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సిఎం చంద్రబాబు అన్నారు. రాజధాని పరిధిలోని మంగళగిరి మండలం కురగల్లులో అమృత విశ్వవిద్యాపీఠానికి ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ రానున్న కాలంలో అమరావతి నగరం మెడికల్ హబ్‌గా మారడంతో పాటు మెడికల్ టూరిజంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. 1987 నుండి అమ్మ అమృతానందమయ ట్రస్టు దేశ, విదేశాల్లో పలు సామాజిక కార్యక్రమాలు చేస్తూ పేదలకు అండగా ఉందని, ఈ ట్రస్టు ఆధ్వర్యంలో ఇక్కడ విశ్వవిద్యాలయం ఏర్పాటు ద్వారా ఉత్తమ పౌరులను తయారు చేయడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే వీరు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్, వైద్య కళాశాలల ద్వారా విలువలతో కూడిన విద్యను అందిస్తున్నారన్నారు. రాజధాని ప్రాంతంలో భవిష్యత్తులో 35 లక్షల మంది జీవిస్తారని, ఈ క్రమంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. మౌలిక వసతులకు రూ.34 వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. అమరావతి రాజధాని 9 నగరాలు, 27 టౌన్‌షిప్స్‌గా ఏర్పాటు కానుందన్నారు. కాలుష్య నివారణకు ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 1600 కిలోమీటర్ల సైకిల్ రహదార్లతో పాటు ఎలక్ట్రికల్ సైకిళ్లను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని వివరించారు. ఈ ప్రాంతానికి 14 వైద్య

మిగతా 9లో



సిపిఎం 25వ రాష్ట్ర మహాసభలకు ఆతిథ్యమిస్తున్న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం ప్రకాశం చౌక్‌లో ఏర్పాటు చేసిన అరుణ తోరణాలు

7

11న పవన్‌తో ఉండవల్లి భేటీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం కార్పొరేషన్

ప్రత్యేక హోదాపై తనకు రాజకీయంగా సహకరించాలని హీరో పవన్ కల్యాణ్ చేసిన అభ్యర్థనకు రాజమహేంద్రవరం మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్ సమ్మతించారు. రాజమహేంద్రవరంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భేటీ కోసం పవన్‌కల్యాణ్ స్వయంగా రాజమహేంద్రవరంలో కలుస్తానని ఫోన్ చేశారన్నారు. భద్రతా కారణాల వల్ల తానే హైదరాబాద్ వెళ్లి ఈ నెల 11న కలుస్తానని ఆయనతో తెలిపానన్నారు. జెఎసిలో సభ్యునిగా చేర్చాలని పవన్‌ను కోరానన్నారు. రాజకీయాలకు దూరంగా ఉంటూనే రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా సహకరిస్తానని ఆయనతో స్పష్టం చేశానని పేర్కొన్నారు. జెఎసి ఏర్పాటు రాజకీయ పార్టీలతోనా? లేక ఇతర నాయకులతోనా? అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదన్నారు.



మద్దతు వామపక్షాలు చేపట్టనున్న రాష్ట్ర బంద్‌కు మద్దతు ప్రకటిస్తున్న జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్

జెఎసి ఏర్పాటు చేస్తాం : పవన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విభజన హామీలు సాధించేందుకు జెఎసి ఏర్పాటును ఏర్పాటు చేసే యోచన ఉందని జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ వెల్లడించారు. విభజన హామీల అమలుకు పార్టీలకు అతీతంగా జెఎసి ఏర్పాటు చేయాల్సిన అవసరముందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇందుకోసం ఉండవల్లి అరుణ్‌కుమార్, జయప్రకాశ్ నారాయణ తదితర మేధావులను త్వరలో కలువబోతున్నట్లు చెప్పారు. ప్లకార్డులు.. స్లోగన్స్‌తో సమస్యలు పరిష్కారం కావని, ఎపి సమస్యల పరిష్కారానికి సరికొత్త వ్యూహం, ఆలోచనా విధానం కావాలని, అందుకు జెఎసి ఏర్పాటు ఒక్కటే పరిష్కారమని భావిస్తున్నామన్నారు. వామపక్షాల బంద్‌కు తమ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తూ బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర పరిపాలన కార్యాలయంలో ఆయన పలు అంశాలపై మీడియాతో మాట్లాడారు. విభజన హామీలు సాధించే విషయంలో అధికార తెలుగుదేశం పార్టీపై ప్రజలకు నమ్మకం పోతోందన్నారు. ఎపికి జరుగుతున్న అన్యాయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండింటికీ సమాన భాగస్వామ్యం ఉందని స్పష్టం చేశారు. రెండు పార్టీలు మాటల గారడీ చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. మోడీ ద్వారా రాష్ట్రానికి న్యాయం జరుగుతుందని నమ్మి సంయమనాన్ని పాటించానన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినవి బిజెపి పక్కనపెట్టిందన్నారు. తొలి రెండేళ్లు ఎంతో సంయమనం పాటించానన్నారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలు ఇంతవరకూ అమలు కాలేదని ప్రజల్లో ఆగ్రహం ఉందని, ప్రత్యేక హెూదా కోసం అన్ని పార్టీలూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. విభజన హామీలు అమలు కావడం లేదని చంద్రబాబు నాయుడు, విభజన చట్టం ప్రకారం అన్నీ ఇచ్చేశామని బిజెపి నేతలు చెబుతూ ప్రజలను గందరగోళానికి గురిచేశారని విమర్శించారు. రాష్ట్ర విభజన తరువాత ఏ వనరులు లేని రాష్ట్రాన్ని అనుభవజ్ఞులని చంద్రబాబు చేతిలో పెడితే...చివరికి అవినీతి రాష్ట్రంగా మార్చిన తీరు అత్యంత బాధాకరమని వ్యాఖ్యానించారు.

పెరుగుతున్న తేమ

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రం మొత్తం మీద తేమ శాతం క్రమేపీ పెరుగుతుందని, దీని ఫలితంగా రాష్ట్రంలోని పలు చోట్ల స్వల్ప మేఘావృత్తం (లో క్లౌడ్స్) ఏర్పడుతుందని విశాఖపట్నం వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. చలి నుంచి నెమ్మదిగా వాతావరణం వేడిలోకి మారుతుందని తెలిపారు. ఫలితంగా రాష్ట్రంలో ఎక్కడైనా ఒకటి, రెండు చోట్ల తేలికపాటి జల్లులు పడే అవకాశాలున్నాయని తెలిపారు.

ప్రజ్ఞ

సమాధానాలు 7లో

1. ప్రపంచంలోనే శక్తివంతమైన రాకెట్ 'ఫాల్కన్ హెవీ'ని ప్రయోగించింది?
2. దేశంలో తొలిసారిగా ట్రాన్స్‌జెండర్ వెల్ఫేర్ బోర్డును ఎక్కడ ప్రారంభించారు?
3. 88వ మహామస్తకభిషేక ఉత్సవాలు ఎక్కడ ప్రారంభమయ్యాయి?
4. ప్రపంచంలో అత్యంత రద్దీ అయిన సింగిల్ రన్‌వే విమానాశ్రయం?
5. రివర్ ట్యాక్సీ సేవలను ఎక్కడ ప్రారంభించారు?

స్కావెంజర్ల కోసం నోడల్ అధికారులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని నేటికీ సాధారణ పారిశుధ్య కార్మికులు (మాన్యువల్ స్కావెంజర్స్) ఉంటే వారిని గుర్తించేందుకు రాష్ట్ర, జిల్లాల స్థాయిలో నోడల్ అధికారులను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఎస్ రావత్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర నోడల్ అధికారిగా సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం రామారావు, జిల్లాల్లో అనంతపురానికి అక్కడి జెసి పికె రమామణి, ప్రకాశం జిల్లాకు ఆజిల్లా జేసి డి మార్కెండేయులు, కృష్ణాలో కృష్ణా జెసి-2 పి బాబు రావును, అలాగే తూర్పుగోదావరికి అక్కడి జేసీ-2 రాధాకృష్ణ మూర్తిని, విశాఖకు అక్కడి జేసీ-2 ఎ సిరిని నోడల్ అధికారులుగా నియమించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

ఎపిఇఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణలో బాబూరావు



ఇఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ ఉత్పత్తి వ్యయం భారీగా తగ్గిన నేపథ్యంలో విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని సిపిఎం డిమాండ్ చేసింది. డిస్కంల ప్రతిపాదనలపై విజయవాడలోని ఎస్ఇ కార్యాలయంలో ఎపిఇఆర్సీ బుధవారం నిర్వహించిన బహిరంగ విచారణలో ఛార్జీల తగ్గింపు, ఇతర అంశాలపై సిపిఎం నాయకులు తమ వాదన వినిపించారు. ఏటా విద్యుత్ ఛార్జీల పేరిట ప్రత్యేక్షంగా, పరోక్షంగా వినియోగదారులపై భారం వేయడానికి నిరసనగా సిపిఎం నాయకులు నినాదాలు చేస్తూ ఇఆర్సీకి నిరసన తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు ఇఆర్సీ చైర్మన్ జస్టిస్ భవానీప్రసాద్‌కు వాదన వినిపిస్తూ విద్యుత్ ఛార్జీలు పెంచమని చెప్పడం కాదు, తగ్గిస్తామని చెప్పాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రైవేటు కంపెనీలతో దీర్ఘకాలిక ఒప్పందాలను పున:సమీక్షించాలన్నారు. విద్యుత్ సంస్థల ఆర్థిక లోటు రూ.7,982 కోట్లు ఉందని, దీనిని ప్రభుత్వం భరించాలని, లేనిపక్షంలో ఎన్నికల అనంతరం ట్రూఅప్ ఛార్జీల పేరుతో వినియోగదారులపై భారం వేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల్లో వీధి దీపాలు, తాగునీటి సరఫరా వంటి సర్వీసులకు వాణిజ్య తరహా నుంచి మినహాయింపు ఇచ్చి ఛార్జీలు తగ్గించాలని కోరారు. ఈ సంస్థల బకాయిలు ప్రభుత్వమే చెల్లించాలన్నారు. ప్రభుత్వ రంగంలో ఉన్న విద్యుత్ ఉత్పత్తిని తక్కువగా చూపించి, ప్రైవేటు సంస్థల నుంచి కొనుగోలు చేసేందుకు డిస్కంలు నివేదికల్లో అంకెల గారడీ చేస్తున్నాయని విమర్శించారు. వ్యవసాయ సబ్సీడీని పూర్తిగా ప్రభుత్వమే భరించాలన్నారు. తీప్పంద కాలపరిమితి పూర్తయిన ల్యాంకో, స్పెక్ట్రమ్ వంటి ప్రైవేటు విద్యుత్ సంస్థల నుంచి కొనుగోళ్ళను డిస్కంలు కొనసాగిస్తున్నాయని, ఈ విధానాన్ని విస్మరించాలన్నారు. సౌర, పవన విద్యుత్ ధరలు తగ్గినందున విద్యుత్ కొనుగొళ్ల ఒప్పందాలు సమీక్షించాలని, పారదర్శకంగా, బహిరంగంగా పోటీ పద్ధతిలో ప్రస్తుతం ఉన్న ధరలకు అనుగుణంగా కొనుగోళ్లు జరపాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల విద్యుత్ బకాయిలు రద్దు చేయడంతోపాటు నెలకు 100 యూనిట్‌లు ఉచితంగా ఇవ్వాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ల కొరత సమస్య పరిష్కరించాలన్నారు. ట్రూ అప్ ఛార్జీలను ఇఆర్సీ సమీక్షించి వినియోగదారుల ముందుంచాలన్నారు. విద్యుత్ సంస్థల్లో పని చేసే కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. విటిపిఎస్ నుంచి ఉత్పత్తయ్యే కాలుష్యం వల్ల ఆ ప్రాంతంలో ప్రజలు ఆస్థమా, క్యాన్సర్, మహిళలు గైనిక్ సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు హామీ అమలుకు నోచుకోలేదన్నారు.

పరిహారం ఇవ్వకుండా భూములు తీసుకుంటున్నారు..
ఎపి రైతు సంఘం

టవర్‌లైన్ల నిర్మాణానికి పరిహారం చెల్లించకుండా రైతుల భూములు తీసుకుంటున్నారని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.కేశవరావు తెలిపారు. వైసిపి నాయకులు మల్లాది విష్ణు తమ వాదన వినిపిస్తూ 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం చెల్లించాలన్నారు. లైన్ల నిర్మాణంలో, కారిడార్ ఏర్పాటులో రైతులపై బెదిరింపులు మానుకోవాలన్నారు. ఇఆర్సీ చైర్మన్ భవానీప్రసాద్ మాట్లాడుతూ అన్ని డిమాండ్లను పరిగణలోకి తీసుకుని పరిశీలిస్తామన్నారు. ట్రూప్ ఛార్జీలు ప్రభుత్వం భరించే విధంగా గతంలో చర్యలు తీసుకున్నామని గడిచిన రెండేళ్ళ ప్రతిపాదనలు అందిన అనంతరం సమీక్షించి ప్రభుత్వానికి లేఖ రాస్తామన్నారు. వినియోగదారులపై భారం పడకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ప్రజాభిప్రాయ సేకరణలో ఇఆర్సీ సభ్యులు పి.రఘు, రామ్‌మోహన్, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, ఎపిస్పీడీసీఎల్ సిఎండి ఎం.ఎం నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌బాబు

సిపిఎస్ రద్దు డిమాండ్‌తో 10న రాష్ట్ర వ్యాప్తంగా మహాధర్నా

ఉద్యోగ సంఘాల జెఎసి ఛైర్మన్ అశోక్‌బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన బాట పట్టక తప్పదని ఉద్యోగ సంఘాల జెఎసి ఛైర్మన్ పి అశోక్‌బాబు పేర్కొన్నారు. విజయవాడలోని ఎపి ఎన్‌జిఒ హోమ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తామన్నారు. సిపిఎస్ రద్దు కోరుతూ ఈ నెల 10వ తేదీ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల వద్ద ఉద్యోగులందూ మహాధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లోనూ ఇన్‌కం టాక్స్ శ్లాబ్ రేట్లు పెంచకపోగా ఉద్యోగులపై అదనపు భారం వేశారని అశోక్‌బాబు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో కీలకమైన పోలవరం, అమరావతి రాజధాని, రైల్వే జోన్, ఇతర ప్రాజెక్టులకు నిధులు కేటాయించపోవడం తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. ఎన్‌జిఒ నేతలు సిఎం దాస్, బండి శ్రీనివాసరావు, ఎన్ చంద్రశేఖర్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

గడువులోనే రాజధాని రహదార్లు పూర్తి చేస్తాం: మంత్రి నారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమరావతి అభివృద్ధి సంస్థ (ఎడిసి) చేపట్టిన రహదార్లు నిర్దేశిత గడువులో పూర్తి చేస్తామని పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. మందడం నుంచి వెలగపూడి, మల్కాపురం, మోదుగుల్లంకపాలెం, ఐనవోలు తదితర గ్రామాల్లో 29 కిలో మీటర్ల మేర రహదార్లను ఎడిసి సిఎండి లక్ష్మీ పార్థసారథి, అధికారులతో కలిసి బుధవారం మంత్రి పరిశీలించారు. వంతెనల నిర్మాణాల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 34 రహదార్లను నిర్మిస్తున్నామని, అందులో 24 రోడ్లను జులై లోపు పూర్తి చేస్తామన్నారు. కేంద్ర, ఇతర సర్వీసు ఉద్యోగులకు 3,840 క్వార్టర్స్‌ను డిసెంబర్ నాటికి అందుబాటులోకి తెస్తామన్నారు.

విద్యుత్తు పిపిఎల నిబంధనలు కట్టుదిట్టంగా అమలు చేయండి

మంత్రి కళా ఆదేశాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్తు శాఖ పరిధిలోని ఎపి ట్రాన్స్‌కో, డిస్కమ్‌ల పరిధిలో విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల నియమ, నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని విద్యుత్ శాఖ మంత్రి కిమిడి కళా వెంకట్రావు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో బుధవారం అధికారులతో సమీక్షలో మంత్రి మాట్లాడుతూ విద్యుత్తు పిపిఎలకు అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఢిల్లీ), ఎపిఇఆర్సీ, హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో విచారణలో ఉన్న కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సంస్థలకు ఆదాయం వచ్చే కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భవిష్యత్తులో టెండర్ల నియమావళిని రూపొందించే సమయంలో ప్రాజెక్టు నిర్మాణం, పూర్తి చేసే సమయాన్ని పొందు పరచాలని, నిర్ణీత సమయంలో సంబంధిత కంపెనీ పనులు పూర్తి చేయకుండా కాల వ్యవధి పొడిగిస్తే ఆ ఆసమయంలో పిపిఎలో పేర్కొన్న విద్యుత్ కొనుగోలు ధర కంటే మార్కెట్‌లో విద్యుత్ ధర తక్కువగా ఉంటే ఆ రేటు మాత్రమే చెల్లించేలా నిబంధన చేర్చాలని సూచించారు. విద్యుత్ కొనుగోలులో ధరలు తగ్గించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ రంగంలో దేశానికే రాష్ట్రం అన్ని విభాగాల్లో మార్గదర్శకంగా ఉందని ప్రశంసించారు. ఇంధన శాఖ సలహాదారు కె.రంఘనాథం, ఎపి ట్రాన్స్‌కో జెఎండి దినేష్ పరుచూడి, న్యాయ సలహాదారు శివరావు, సిఈ ఐపిసి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై కఠిన చర్యలు

ఎక్సైజ్ సమీక్షలో సిఎస్ ఆదేశాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎక్కడా బెల్ట్ షాపుల మాటే వినపడకూడదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ హెచ్చరించారు. సచివాలయంలో బుధవారం ఎక్సైజ్ శాఖ అధికారులతో ఆయన సమీక్షిస్తూ ప్రభుత్వ హెచ్చరికలు పెడ చెవిన పెట్టి బెల్ట్ షాపుల వారికి మద్యం సరఫరా చేసే దుకాణ యజమానులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అవసరమైతే లైసెన్సులు రద్దు చేయాలన్నారు. బెల్ట్ షాపుల నిరోధానికి తీసుకుంటున్న చర్యలను ఎక్సైజ్ శాఖ ముఖ్యకార్యదర్శి డి సాంబశివరావు సిఎస్‌కు వివరించారు. గతేడాది జులై 18న జరిగిన మంత్రి మండలి సమావేశంలో బెల్ట్ షాపులను మూసేయాలని నిర్ణయించిన నాటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 8,827 కేసులు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. మొత్తం 9,192 మందిని అరెస్ట్ చేయడంతో పాటు 331 వాహనాలను సీజ్ చేశామన్నారు. బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేసిన 265 షాపులను మూసేయించామన్నారు. పరిష్కార వేదిక 1100 ద్వారా అందిన 7,649 ఫిర్యాదుల్లో 7,641 సమస్యలకు పరిష్కారం చూపినట్లు తెలిపారు.

సిబ్బందిపై చర్యలు..

అనంతరం సిఎస్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ బెల్ట్ షాపుల నిర్వహణలో ఎక్సైజ్ సిబ్బంది పాత్ర ఉంటే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవినీతి సిబ్బందిని విధుల నుంచి తొలగించాలన్నారు. సీజ్ చేసిన వాహనాలను ప్రతి మూడు నెలలకొకసారి వేలం నిర్వహించాలన్నారు. పూర్తిస్థాయిలో బెల్ట్ షాపులను నిర్మూలించాల న్నారు. అక్రమ సరఫరా దారులపై కేసులు నమోదు చేయాలని చెప్పారు. ఛార్జిషీట్లు దాఖలు చేసి నేరగాళ్లకు శిక్ష పడేట్లు చూడాలన్నారు. బెల్ట్ షాపులకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలని పెద్ద ఎత్తున ప్రచారం కూడా చేయాలని సూచించారు. సమీక్షలో డిజిపి మాలకొండయ్య, ఎక్సైజ్ శాఖ ప్రత్యేక కమిషనర్ లక్ష్మీ నరసింహం, డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కె వెంకటేశ్వర రావు, అదనపు డిజి హరీష్‌కుమార్ గుప్తా పాల్గొన్నారు.

అప్పులిస్తున్నాం.. డిపాజిట్లు చేయండి

ప్రభుత్వానికి బ్యాంకర్ల డిమాండ్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వానికి ధారాళంగా అప్పులిస్తున్న బ్యాంకులు, ఇప్పుడు డిపాజిట్లపై డిమాండ్ ప్రారంభిస్తున్నాయి. ఇంతగా అప్పులిస్తున్న తాము కూడా ఎదిగేందుకు వివిధ ప్రభుత్వ శాఖల నిధులను తమ బ్యాంకుల్లో డిపాజిట్ చేయించేందుకు చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లు కోరుతున్నారు. ఇటీవల కొన్ని బ్యాంకుల డిమాండ్లు ఆర్థిక శాఖకు, అప్పులు తీసుకుంటున్న ఆయా ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులకు చేరుతున్నట్లు తెలిసింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నేరుగా అప్పులు చేయకుండా వివిధ సంస్థలకు రుణాలు ఇప్పించేందుకు ప్రయత్నిస్తోంది. దీనివల్ల ఎఫ్‌ఆర్‌బిఎం పరిమితిని దాటకుండా జాగ్రత్తలు పడవచ్చునని ఆర్థిక శాఖ చెబుతోంది. అందువల్ల వివిధ కార్పొరేషన్లకు బ్యాంకుల ద్వారా భారీగా రుణాలు ఇప్పించేందుకు చర్యలు చేపట్టింది. ఒక్కో బ్యాంకు నుంచి ఐదువేల కోట్లకు పైగా రుణాలు ఇప్పించిన పరిస్థితి కూడా ఉంది. తాజాగా ఆయా బ్యాంకులు తమ బ్యాంకుల్లో డిపాజిట్లు చేయాలన్న కొత్త డిమాండ్‌ను తెరపైకి తీసుకువస్తున్నాయి. రాష్ట్రంలోని క్రిడా, రైతు సాధికారిత సంస్థ, ఎపిటిడ్కో, ఎపిఎంఎస్ ఐడిసి, మెప్మా, జిల్లాల్లో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్పొరేషన్లు, గృహనిర్మాణ సంస్థ, ఉద్యాన శాఖ, మహిళా శిశు సంక్షేమశాఖ, స్త్రీనిధి కార్పొరేషన్, సెర్ప్, ఎపిఐఐసి వంటి అనేక సంస్థలు రుణాలు తీసుకున్న జాబితాలో ఉన్నాయి. వాటి ఖాతాలను తమ బ్యాంకుల్లో ఏర్పాటు చేయాలని బ్యాంకుల నుంచి డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ఆర్థిక అధికారులు కూడా ఏయే బ్యాంకుల నుంచి ఏయే సంస్థలకు ఎంత రుణం తీసుకున్నారు, ఆయా బ్యాంకుల్లో ఉన్న డిపాజిట్ల పరిస్థితి ఏమిటన్న కోణంలో వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. అనంతరం కొత్త ఖాతాలపై నిర్ణయం తీసుకోవాలని యోచిస్తున్నట్లు తెలిసింది.

కాలుష్య కారక పరిశ్రమలను ఉపేక్షించం

మంత్రి శిద్ధా రాఘవరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కాలుష్య కారక పరిశ్రమలను ఉపేక్షించేది లేదని, వాటి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శిద్ధా రాఘవరావు హెచ్చరించారు. సచివాలయంలో బుధవారం పొల్యుషన్ కంట్రోల్ బోర్డ్ చైర్మన్ బిఎస్ఎస్ ప్రసాద్‌తో కలిసి మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. డిసెంబర్‌లో జరిగిన పొల్యుషన్ కంట్రోల్ బోర్డు సమావేశంలో ఇచ్చిన ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 866 పరిశ్రమలను తనిఖీలు చేసినట్టు పిసిబి చైర్మన్ ప్రసాద్ మంత్రికి వివరించారు. సుమారు 405 పరిశ్రమలు పిసిబి నిబంధనల పాటించడం లేదని, వాటికి నోటీసులు జారీ చేశామని తెలిపారు. మరో 29 పరిశ్రమల మూసివేతకు ఆదేశాలు జారీ చేసినట్టు మంత్రికి తెలిపారు.

హోటల్‌లోకి దూసుకెళ్లిన ట్రాలీ

ముగ్గురు మృతి, మరొకరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-తొండంగి(తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లా తొండంగి మండలం బెండపూడి వద్ద ఓ ట్రాలీ బుధవారం అదుపుతప్పి ఆగి ఉన్న ఆటోను ఢీకొని హోటల్‌లోకి దూసుకెళ్లడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మరో వ్యక్తి తీవ్రగాయాలతో కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తొండంగి మండలం బెండపూడి తారకరామ కాలనీలో వీరబ్బాయి పూరిపాకలో హోటల్ నిర్వహించుకుంటున్నారు. బుధవారం ఉదయం పది గంటల సమయంలో హోటల్‌లో బెండపూడికి చెందిన రిక్షా కార్మికుడు తుమ్మపల్లి సత్తిబాబు, భూసాల సాయి, జార్జి బాబు, కత్తిపూడికి చెందిన సారిక చంద్రశేఖర్ టిఫిన్ చేస్తున్నారు. ఈ సమయంలో కత్తిపూడి వైపు వస్తున్న ట్రాలీ అదుపుతప్పి నిలిపిఉన్న ఖాళీ ఆటోను ఢీకొని హోటల్‌లోకి దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో సత్తిబాబు (40) అక్కడికక్కడే మృతి చెందాడు. సాయి, చంద్రశేఖర్, జార్జి బాబు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు వెంటనే 108లో కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో భూసాల సాయి (17), సారిక చంద్రశేఖర్ (25) చనిపోయారు. జార్జి బాబు పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. తొండంగి ఎస్ఐ బి.కృష్ణమాచారి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ప్రత్యేకం

ప్రమాదపుటంచున ఆర్థిక రంగం

- ప్రస్తుత ఓవర్‌డ్రాఫ్ట్ 1563 కోట్లు
- జాగ్రత్తపడమని ఆర్‌బిఐ హెచ్చరిక

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇంకా ఓవర్‌డ్రాఫ్ట్ (ఓడీ) లోనే కొనసాగుతోంది. గతంలో ఎప్పుడో ఒకసారి కనిపించే ఓడీ నేడు ఎప్పుడుపడితే అప్పుడు కనిపిస్తోంది. దీనిపై రిజర్వ్ బ్యాంకు కూడా ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తోంది. తాజాగా రూ. 1563 కోట్ల వరకు ఓడీ ఉన్నట్లు గుర్తించారు. గత కొద్ది నెలలుగా రాష్ట్ర ఖజానా తరచూ ఓడీలో పడిపోతుండడం ఆర్థికంగా ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. తాజా గణాంకాల ప్రకారం గత రెండో తేదీన ఓడీకి వెళ్లారు. అంతకు ముందు నెల కూడా భారీగా ఉన్న ఓడీ కొద్దికొద్దిగా తగ్గుతూ వస్తుందనుకుంటున్న పరిస్థితుల్లో తాజాగా మళ్లీ ఓడీకి వెళ్లడంతో ఆర్థిక ఆందోళనా ప్రారంభమవుతోంది. ప్రస్తుత త్రైమాసికంలో 13 రోజులు ఓడీలో ఉండడం గమనార్హం. ఈ త్రైమాసికం జనవరిలోనే ప్రారంభంకాగా, కేవలం 33 రోజుల్లోనే 13 రోజులు ఓడీలో ఉండడం విశేషం. ఇది కూడా ఆందోళన కలిగించేదిగానే కనిపిస్తోంది. రిజర్వ్ బ్యాంకు మార్గదర్శకాల మేరకు కొన్ని నిబంధనలు పాటించక పోతే రాష్ట్రానికి రావాల్సిన నిధులను కూడా నిలిపి వేస్తారు. ఓడీలో 14 రోజులపాటు నిరంతరంగా ఉండకూడదు. ఐదు వరుస పనిది నాలపాటు సాధారణ వేస్ అండ్ మీన్స్ దాట కూడదు. ఒకే త్రైమాసికంలో 36 రోజలపాటు వేస్ అండ్ మీన్స్‌కు వెళ్లకూడదు. ఈ నిబంధనలను దాటితే రావాల్సిన నిధులను రిజర్వ్‌బ్యాంకు ఆపివేయవచ్చు. ఇప్పట వరకు వరుసగా నాలుగు పనిది నాల్లో రాష్ట్రం ఓడీకి వెళ్లినట్లు చెబుతున్నారు. అలాగే 13 రోజులు ఓడీలోనే ఉన్నారు. పరిమితిగా ఉన్న 36 రోజుల నిబంధనకు ఇంకా రెండు నెలలు సమ యం మాత్రమే ఉంది. అంటే 13 రోజులుపోను ఇంకా 23 రోజులుంది. సాధారణ వేస్ అండ్ మీన్స్ పరిమితి వంద శాతానికి ఐదు వరుస పనిదినాలకే ఉండగా, ఇప్పటికే మూడు పనిదినాలు గడిచిపోయింది. అందువల్ల అప్రమత్త ంగా ఉండాలని రిజర్వ్‌బ్యాంకు హెచ్చరికలు జారీ చేస్తోంది. ఈ పరిస్థితిని చక్కది ద్దుకోకపోతే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింత ఇబ్బంది కరంగా మారక తప్పదని ఆర్థిక శాఖ ఉన్నతాధికారు లంటున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం కేవలం రెండు నెలల్లో ముగుస్తున్న తరుణంలో కొత్తగా అప్పులు చేయకతప్పదనీ అంటున్నారు. లేని పక్షంలో మళ్లీ వేస్ అండ్ మీన్స్‌కు, ఓడీకి వెళ్లకతప్పదని చెబుతున్నారు. ఓడీకే వెళితే నిధుల విడుదలపై రిజర్వ్‌బ్యాంకు ఆంక్షలు విధించే ప్రమాదం పొంచి ఉందని ఆర్థిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు.



సంక్షిప్తం

రేపు విట్ క్రీడా సాంస్కృతిక ఉత్సవం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి విటోపియా-2018 పేరుతో విట్-ఎపి కళాశాలలో శుక్రవారం జాతీయ స్థాయి క్రీడా సాంస్కృతిక ఉత్సవం నిర్వహించనున్నట్లు విట్‌ఎపి వైస్ ప్రెసిడెంట్ శేఖర్ విశ్వనాథన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను ఆపండి : సిఎస్

రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలతోపాటు గ్రానైట్ అక్రమ రవాణాను అడ్డుకోవాలని ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఆదేశించారు. సచివాలయంలో బుధవారం ఆయన గనులు, భూగర్భ శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు లబ్ధి కలుగజేయడంతోపాటు ఇసుక అక్రమ రవాణను అడ్డుకోవడానికి ప్రభుత్వం ఇసుక పాలసీ తీసుకొచ్చిందన్నారు. అయినా రాష్ట్రంలో ఇంకా ఇసుక అక్రమ రవాణా ఎక్కువగా జరుగుతోందన్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

విభజన నష్టాలకు బాబే బాధ్యులు : వైసిపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయానికి, నష్టాలకు చంద్రబాబు నాయుడే బాధ్యుడని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కన్నబాబు ఆరోపించారు. నాలుగేళ్లుగా కేంద్రంలో భాగస్వామిగా ఉంటూ రాష్ట్రానికి రావాల్సిన నిధులు రాబట్టడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన ప్రభుత్వ చేతకానితనం వల్లే రాష్ట్రానికి నిధులు రావడం లేదని అన్నారు. రాష్ట్రం నష్టపోవడానికి చంద్రబాబు నాయుడే కారణమని, నమ్మి ఓట్లేసిన పాపానికి ప్రజలు పూర్తిగా నష్టపోయారని అన్నారు.



విజయవాడలో టెట్ నమూనా పరీక్షా పత్రాన్ని ఆవిష్కరిస్తున్న కెఎస్.లక్ష్మణరావు

మోడల్ టెట్‌కు ఆదరణ

డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.సూర్యారావు

ప్రజాశక్తి - విజయవాడ

ప్రభుత్వం నిర్వహిస్తున్న టెట్‌పై పూర్తి అవగాహన కల్పించేందుకు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన మోడల్ టెట్‌కు అభ్యర్థుల నుంచి మంచి ఆధారణ లభించిందని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.సూర్యారావు తెలిపారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా 80 సెంటర్లలో 15,650 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారన్నారు. విజయవాడలో పేపర్ కన్వీనర్‌గా ఉండి తయారుచేసిన మాజీ ఎంఎల్‌సి, ప్రముఖ విద్యావేత్త కెఎస్.లక్ష్మణరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిఎస్‌సి టెట్ నోటిఫికేషన్ కోసం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో ఆందోళన చేశారని, రాష్ట్రవ్యాప్త జాతాలు నిర్వహించినట్లు గుర్తు చేశారు. టెట్ వాయిదా కోసం పోరాటాం చేశారని చెప్పారు. నిరంతరం అభ్యర్థుల శ్రేయస్సు కోసం పనిచేస్తూనే వారిని టెట్ సంపూర్ణ సన్నద్ధం కోసం ఈ మోడల్ టెట్ నిర్వహించిన యువజన సంఘానికి అభినందనలు తెలిపారు. రానున్న కాలంలో నిరుద్యోగులను ఉద్యోగాలు సాధించేదిశగా ప్రోత్సహించేందుకు మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. పేపర్-1 ఎస్‌జిటి అభ్యర్థులకు, పేపర్-2 స్కూల్ అసిస్టెంట్ల కోసం ఇచ్చే ప్రశ్నల విధానం బాగుందని అభ్యర్థులు చెప్పారన్నారు. ఈ పేపర్‌కు వివిధ జిల్లాల్లో ఓపెనింగ్‌కు జిల్లా పోలీసు అధికారులు, డిఇఒలు, వివిధ కోచింగ్ సెంటర్ల యాజమాన్యాలు పేపర్లను విడుదల చేసి ఈ పరీక్షను కొనసాగించారు.


రాష్ట్రంలో షెడ్యూల్ కులాల సంక్షేమంపై అధ్యయనం చేయటానికి శాసనసభ కమిటీ పర్యటిస్తుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ షెడ్యూల్ కులాల సంక్షేమ శాసనసభా కమిటీ ఛైర్మన్ తెనాలి శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక సిపిఒ సమావేశ మందిరంలో బుధవారం శాసనసభ కమిటీ షెడ్యూల్ కులాల వివిధ సంఘాల నుండి, వ్యక్తిగతంగా శాసనసభ కమిటీ ఛైర్మన్, సభ్యులు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిటీ ఛైర్మన్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్‌సిలకు కేటాయించిన ఉద్యోగ నియామకాలలో రోస్టర్‌ను అనుసరిస్తున్నారా, లేదా అనే విషయమై కమిటీ పర్యవేక్షిస్తుందన్నారు.

- ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పంట చేతికందే వేళ..

ధరల పతనం

- జొన్న, సజ్జల ధరలు 40 శాతం తగ్గింపు
- కంది క్వింటా ధర రూ.9 వేల నుంచి రూ.4వేలకు
- శనగలూ రూ.9 వేలనుంచి రూ.4వేలకు తగ్గుదల
- మార్కెటింగుశాఖ ప్రేక్షకపాత్ర..



ప్రజాశక్తి - ఒంగోలుప్రతినిధి

కరవు కాటకాలను అధిగమించి ఎంతో కొంత ఏదో ఒక పంటను పండించిన రైతు మార్కెట్‌లో నిలువు దోపిడికి గురవుతున్నాడు. ఆరుగాలం కష్టపడినా ఫలితం దక్కడం లేదు. పెట్టుబడులు కూడా తిరిగి రాకపోగా నష్టాలే మిగులుతున్నాయి. దీనంతటికీ కారణం పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడమే. ఇపుడు అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయి. పన్నుల పేరుతో ప్రభుత్వాలకు కోట్లాది రూపాయలు ఆదాయం చేకూరుతోంది. రైతులు మాత్రం నష్టాల పాలవుతున్నారు. పంటను కొన్న వ్యాపారులు కోట్లు గడిస్తున్నారు. అందుకు వారికి.. పాలకులు సహకరిస్తున్నారు. ఇపుడు రబీ పంటలు చేతికి వచ్చాయి. అమ్ముకునే సమయానికి అన్ని పంటల ధరలూ దిగజారాయి. సాగు సమయంలో ఉన్న ధరలు ఇపుడు లేవు. విత్తనాలకు పెట్టిన ధరలోనూ ఇపుడు సగం లేదు.

మద్దతు ధరలు అమలుకాని జొన్న, సజ్జ

జిల్లాలో పశ్చిమ ప్రాంతంలో సాంప్రదాయంగా జొన్న, సజ్జ సాగు చేస్తారు. మార్కాపురం, కంభం, బేస్తవారిపేట కొమరోలు గిద్దలూరు, అర్ధవీడు, ఇంకా పెద్దారవీడు తదితర మండలాల్లో బావులు బోర్లు కింద సజ్జ వేస్తారు. జొన్న వర్షాధారం పంటగా వేస్తారు. ఖరీఫ్‌తోపాటు రబీలోనూ ఈ రెండు పైర్లు ఎక్కువగా సాగవుతాయి. ఇపుడు వీటికి మద్దతు ధరలు లేవు. జొన్న ఎకరానికి 10 క్వింటాళ్లు పండాయి. మద్దతు ధర రూ.1,700 ఉంది. గతంలో వీటిని క్వింటాలు రూ.2 వేలకుపైగా అమ్మారు. డిమాండు ఉంది. ఇపుడు క్వింటా రూ.1,250లకు అడుగుతున్నారు. కారణం వ్యాపారుల మాయాజాలం. రైతులు క్వింటాలుకు 500 వరకూ నష్టపోతు న్నారు. ఎకరానికి 5వేల వరకూ కేవలం ధరల వల్ల నష్టపోతున్నారు. ఈ నష్టాన్ని సాగు మొత్తానికి పరిగణలోకి తీసుకుంటే కోట్లలోనే ఉంటుంది. సజ్జ పరిస్థితీ అలాగే ఉంది. క్వింటాలు మద్దతు ధర రూ.1,7 00 ఉంది. ఎకరానికి 10 క్వింటాళ్ల వరకూ పండాయి. ఇపుడు క్వింటాలుకు రూ.1,100లకు కొన్నారు. ఈపాటికే సగానికిపైగా రైతులు అమ్మేసుకున్నారు. గతేడాది క్వింటాలు రూ.1,450 దాకా కొన్నారు. దీనికి మద్దతు ధర అమలు కావడం లేదు. పశ్చిమప్రాంతంతోపాటు కొమరవోలు, పొదిలి. కనిగిరి, మర్రిపూడి మండలాల్లో సజ్జ ఎక్కువగా పండింది. వర్షాల్లేకపోయినా బోర్ల కింద సాగు చేపట్టారు. దిగుబడి కొంత ఆశాజనకంగా ఉన్నా ధర పతనం నష్టం కలిగించింది.

శనగల ధర మరీ దారుణం

శనగ ఇపుడిపుడే దిగుబడి వస్తోంది. కొన్ని ప్రాంతాల్లో నూర్పిడి వస్తోంది. ఆలస్యంగా సాగు చేసిన మండలాల్లో మరో వారంలో నూర్పిడికి సిద్ధమవుతోంది. వీటి ధరలు సరిగ్గా ఇపుడే పతనమయ్యాయి. పశ్చిమ ప్రాంతంలో ఈపాటికే మార్కెట్‌లోకి వచ్చేశాయి. వ్యాపారులు నేరుగా రైతుల వద్దకు వెళ్లి కొంటున్నారు. క్వింటా రూ.3,900లకు అడుగు తున్నారు. రైతులు అమ్ముకోకుండా నిల్వ చేసుకుంటున్నారు. సాగు సమయంలో క్వింటాలు శనగలు రూ.9వేల వరకూ ఉన్నాయి. ఇపుడు సగానికి పడి పోయింది. కారణం నిల్వలున్నాయంటున్నారు. పైగా విదేశాలనుంచి దిగుమతుల ప్రభావముంది. వ్యాపారులు సిండికేట్ అయ్యి ధరలను నియంత్రిస్తున్నారు. తూర్పు ప్రాంతంలోనూ పూర్తిగా నూర్పిడికి వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో చూడాలి. ప్రస్తుతానికి శనగల ధరలు పతనం రైతులను కలవరపెడుతోంది.

'కంది'పోయిన రైతులు

కందిపై రైతులు పెట్టుకున్న ఆశలు నీరుగారాయి. జిల్లాలో 85 వేల హెక్టార్లలో కంది సాగు చేశారు. వర్షాలేక ఎక్కువగా కందికే నష్టం జరిగింది. కనిగిరి, కొనకొనమిట్ల మండలాల్లో చేలను మేకలు గొర్రెలకు వదిలేశారు. పండిన చోట దిగుబడి కూడా సగానికి తగ్గింది. వ్యవసాయ అధికారులు 35 వేల ఎకరాల్లో కంది దెబ్బతిన్నట్లు అంచనా వేశారు. ఇపుడు పంట చేతికి వస్తే ధరలు దారుణంగా ఉన్నాయి. రెండేళ్ల క్రితం క్వింటాలు కందులు రూ.10వేలు వరకూ అమ్మాయి. ఇపుడు క్వింటాలు రూ.4 వేల నుంచి రూ.4,500లకు అడుగుతున్నారు.

పేకాట స్థావరంపై దాడి

క్రికెట్ బెట్టింగ్ డాన్ అరెస్టు

ప్రజాశక్తి - నెల్లూరు సిటీ

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రూరల్ మండల పరిధిలో మంగళవారం రాత్రి పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. క్రికెట్ బెట్టింగ్ డాన్ కృష్ణసింగ్ సహా 21 మందిని అరెస్ట్ చేశారు. రూరల్ మండలం కందుకూరు గ్రామ పరిధిలో ఎపి ఫారెస్ట్ కార్పొరేషన్‌కు చెందిన జామాయిల్ తోట వద్ద వారు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.20,15,778, 20 సెల్‌ఫోన్లు, మూడు కార్లు, 11 బైకులు, వాచ్‌లు, కర్రలు, రాడ్లు, కత్తులను స్వాధీనం చేసుకున్నారు. డిఎస్‌పి రాఘవరావు ఆధ్వర్యాన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఈ దాడి చేసింది.

రసంలో బల్లి !

ఎయు హాస్టల్ విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి- మద్దిలపాలెం, విశాఖ

రసంలో బల్లి పడిందని ఆంధ్ర యూనివర్సిటీ సైన్స్ కళాశాల హాస్టల్ విద్యార్థులు బుధవారం మధ్యాహ్నం ఎయు ప్రధాన ద్వారం వద్ద ధర్నా నిర్వహించారు. వేలకు వేలు మెస్ ఛార్జీలు తీసుకొని నాసిరకం భోజనం పెడుతున్నారని పెద్దఎత్తున నినాదాలు చేశారు. విద్యార్థుల ఆందోళన విషయాన్ని తెలుసుకున్న సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి.వినోదరావు, వార్డెన్ కె.నరేష్‌బాబు అక్కడకి చేరుకున్నారు. చీఫ్ వార్డెన్‌తో మాట్లాడి భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. విద్యార్థుల ఆందోళనకు ఎస్‌ఎఫ్ఐ, వైఎస్ఆర్, పిడిఎస్‌ఒ విద్యార్థి సంఘాలు మద్దతు తెలిపారు.

తూతూ మంత్రంగా 'తూర్పు' జెడ్‌పి సమావేశం

చర్చ లేకుండానే బడ్జెట్‌కు ఆమోదం

కలెక్టర్ రాలేదని బాయ్‌కాట్ చేసిన అధికారపార్టీ సభ్యులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లా జెడ్‌పి వార్షిక బడ్జెట్ సమావేశం తూతూమంత్రంగా సాగింది. ఎలాంటి చర్చ లేకుండానే బడ్జెట్‌ను ఆమోదించినట్టు జెడ్‌పి ఛైర్మన్ ప్రకటించడంపై వైసిపి సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్‌ను ఆమోదించినట్టు ఛైర్మన్ ప్రకటించగానే కలెక్టర్ సమావేశానికి హాజరుకాలేదనే కారణంతో పాలక సభ్యులు బాయ్‌కాట్ చేశారు. జెడ్‌పి సర్వసభ్య సమావేశం ఛైర్మన్ జ్యోతుల నవీన్‌కుమార్ అధ్యక్షతన బుధవారం జరిగింది. బడ్జెట్ అంచనాను జెడ్‌పి సిఇఒ ఆర్.గోవిందరావు చదివి వినిపించారు. బడ్జెట్‌పై మాట్లాడాలని ఛైర్మన్ సభ్యులకు సూచించారు. ప్రతిపక్ష నేత సాకా ప్రసన్నకుమార్ మాట్లాడుతుండగా అధికారపార్టీ సభ్యులు నాగిడి నాగేశ్వర రావు అడ్డుతగులుతూ బడ్జెట్‌ను ఆమోదిస్తున్నామని తెలిపారు. ఈ కీలకమైన సమావేశానికి కలెక్టర్ రాకపోవడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. మూడు సమావేశాలకూ కలెక్టర్ హాజరుకాకపోవడం సభను కించపరచడమేనని అన్నారు. దీనికి నిరసనగా బాయ్‌కాట్ చేస్తున్నామని ప్రకటించారు. అధికార పార్టీ ఎంఎల్‌ఎ పెందుర్తి వెంకటేష్ సభలోని సభ్యులను బయటకు వచ్చేయాలని చెప్పి తీసుకెళ్లిపోయారు. కొత్తపేట ఎంఎల్‌ఎ చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడారు. బడ్జెట్‌పై ప్రతిపక్ష నాయకుడిని మాట్లాడనివ్వకుండా దొడ్డిదారిన బడ్జెట్‌ను ఆమోదించుకోవాలని ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. చట్టప్రకారం ఈ సమావేశం చెల్లదని అన్నారు. ఛైర్మన్ నవీన్‌కుమార్ సమాధానం ఇస్తూ మెజార్టీ సభ్యుల ఆమోదంతో బడ్జెట్ ఆమోదం పొందిందని చెప్పి సమావేశాన్ని ముగించారు.

భీమవరంలో ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సిపిఎం 25వ రాష్ట్ర మహాసభల సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహిస్తున్న ఫెస్ట్ 2018లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రజాశక్తి బుక్ హౌస్‌ను స్థానిక మున్సిపల్ కమిషనర్ నాగ నరసింహారావు బుధవారం ప్రారంభించారు. స్థానిక నటరాజ్ థియేటర్ పక్కన ప్రజాశక్తి బుక్‌హౌస్ ఏర్పాటు చేశారు. ఇటీవల నూతనంగా ముద్రించిన పలు పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ మహాసభలను చరిత్రలో గుర్తుండిపోయేలా నిర్వహిస్తున్నామన్నారు. భీమవరం ఫెస్ట్‌లో భాగంగా అనేక కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పుస్తక ప్రదర్శన, ఫొటో ఎగ్జిబిషన్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చరిత్ర, సైన్స్, ఉద్యమాలు, పోరాటాలు వంటి వాటి ఫొటోలను ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనకు ఉంచామని తెలిపారు.

పెంపుడు కుక్కల్లో వ్యాధుల నిర్ధారణకు పరిశోధనలు

ప్రజాశక్తి-గన్నవరం (కృష్ణా)

పెంపుడు కుక్కల్లో వచ్చే కొత్తరకాల వ్యాధుల నిర్ధారణకు జరుగుతున్న ఆధునిక పరిశోధనల ఫలితాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు పశు వైద్యులు కృషి చేయాలని భారతదేశపు పెంపుడు కుక్కల ఆరోగ్య సంరక్షణ నిపుణుల సంస్థ గౌరవ సభ్యులు ప్రొఫెసర్ పికె.ఉప్పల్ పిలుపునిచ్చారు. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలోని ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్టులో శ్రీ వెంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో గన్నవరం ఎన్‌టిఆర్ వెటర్నరీ కళాశాల పశువైద్య చికిత్స విభాగం నేతృత్వంలో 'పెంపుడు కుక్కల ఆరోగ్యం, వ్యాధి నిర్ధారణ, నివారణ పరిశోధనలు, అత్యాధునిక పద్ధతులు'పై మూడు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ స్థాయి సదస్సును ఉప్పల్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మనుషులకు పెంపుడు కుక్కలతో అనుబంధం బాగా పెరగుతోందని చెప్పారు. కుక్కల్లో వచ్చే వాధ్యుల పట్ల పోషకులు జాగ్రత్తగా ఉండాలన్నారు. మనుషుల్లో మాదిరిగానే వాటిలోనూ అనేక కొత్త రకాలు జబ్బులు వస్తున్నాయని, అందుకు గల కారణాలను పరిశోధనల ద్వారా తెలుసుకుని నివారణకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

ప్రత్యేకం

'జన్మభూమి' కళాకారులకు రూ.కోటి బకాయి

25 రోజులైనా విడుదలకాని నిధులు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

గత నెల 2వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన 'జన్మభూమి-మన ఊరు' సభల్లో కళారూపాలు ప్రదర్శించిన కళాకారులకు సుమారు కోటి రూపాయల వరకూ బకాయి పెట్టింది. జనాన్ని ప్రభుత్వం వైపు ఆకర్షించే దిశగా ఊరూరా కళా జాతాలను ఏర్పాటు చేసింది. ఇందుకోసం వేలాది మంది కళాకారులను రాష్ట్రవ్యాప్తంగా ఉపయోగించుకుంది. వీరికి ఇస్తామన్న ప్రోత్సాహక నిధులు నేటికీ చెల్లించలేదు. గతంలో జరిగిన జన్మభూమి కార్యక్రమాల్లో జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారుల ద్వారా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవారు. ఈ ఏడాది అందుకు భిన్నంగా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలల ఆధ్వర్యాన కళా బృందాలకు అవకాశమిచ్చారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు విజయనగరం మహారాజ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యాన అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున, జిల్లా కేంద్రాల్లో అదనంగా ఒక్కొక్కటి చొప్పున కళా బృందాలను నియమించారు. రాజమండ్రి ప్రభుత్వ సంగీత కళాశాల ఆధ్వర్యాన విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల్లోనూ, విజయవాడ ఘంటశాల సంగీత కళాశాల ఆధ్వర్యాన కృష్ణ, పశ్చిమగోదావరి జిల్లాల్లో గుంటూరు కళాశాల ఆధ్వర్యాన గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోనూ, కర్నూలు కళాశాల ఆధ్వర్యాన కడప, కర్నూలు జిల్లాలోనూ, నెల్లూరు కళాశాల ఆధ్వర్యాన నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోనూ కళాకారులు ప్రభుత్వం తరుపున ప్రచారం నిర్వహించారు. ఒక్కో కళాకారునికి రోజుకు రూ.600 చొప్పున బృందానికి రూ.ఐదు వేల వరకూ ప్రోత్సాహకం చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పింది. విజయనగరం జిల్లాలో పది బృందాలు సుమారు 167 చోట్ల ప్రభుత్వ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాయి. రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఒక్కొక్క బృందం, పట్టణ కేంద్రాల్లో అదనపు బృందాలు కలుపుకుని సుమారు 200 కళాబృందాలు జన్మభూమి కార్యక్రమాల్లో ప్రదర్శనలిచ్చినట్టు సమాచారం. ఈ లెక్కన ఒక్కొక్క బృందానికి రూ.50 వేల చొప్పున రూ.కోటి వరకూ చెల్లించాల్సి ఉంది. కార్యక్రమం ముగిసి 25 రోజులు కావస్తున్నా నిధులు విడుదల చేయలేదు. ప్రభుత్వానికి అనుగుణంగా ప్రచారం చేయించుకుని ప్రోత్సాహకాలు ఇవ్వడానికి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని కళాకారులు వాపోతున్నారు. వెంటనే ప్రోత్సాహకాలను విడుదల చేయాలని కోరుతున్నారు.



జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో ప్రచారం నిర్వహిస్తున్న కళాకారులు (ఫైల్ ఫొటో)

సంపాదకీయం

నిరాశ పరిచిన ప్రసంగం

పార్లమెంటు ఉభయ సభల్లోనూ నరేంద్ర మోడీ బుధవారం చేసిన ప్రసంగం ఆంధ్రప్రదేశ్ ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేసింది. ప్రత్యేక హోదా విస్మరించడంతో పాటు, బడ్జెట్ కేటాయింపుల్లో మొండి చేయి చూపిన తీరుపై రాష్ట్రం రగులుతున్న సమయంలో మోడీ ప్రసంగం ఆంధ్రప్రదేశ్ ప్రజల పట్ల, వారి ఆకాంక్షల పట్ల ఆయనకు, ఆయన నాయకత్వం వహిస్తున్న బిజెపికి ఉన్న తేలిక భావానికి అద్దం పడుతోంది. రెండు రోజుల నుండి వైసిపితో పాటు, బిజెపి మిత్రపక్షమైన టిడిపి ఎంపీలూ పార్లమెంటు ఉభయసభల్లో నిరసన తెలుపుతున్నా ప్రధాని చెవులుండీ లేన్నట్లుగా వ్యవహరించిన తీరు దుర్మార్గం! నిజానికి ఆంధ్రప్రదేశ్‌కు బిజెపి చేసిన దగాపై అటు పార్లమెంటులోనూ, ఇటు బయట తీవ్ర స్థాయిలో ఆందోళనలు జరుగుతున్నాయి. వామపక్షాలు గురువారం తలపెట్టిన బంద్‌కు విస్తృత స్పందన లభిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రధాని తన ప్రసంగంలో ఎంతో కొంత ఊరట ఇస్తారని భావించిన వారిని, ఆయన తన ప్రసంగంలో వెక్కిరించినంత పని చేశారు. రాష్ట్ర ప్రజానీకం ఏక కంఠంతో ఏదైతే కోరుతోందో వాటిని తప్ప ఆయన అన్ని విషయాలనూ ప్రస్తావించారు. అసలు సమస్యలను మాత్రం గాలికి వదిలేసి అపహాస్యం చేశారు. పాత గాయాలను కెలికి ప్రజల హృదయాలను మరింత ఛిద్రం చేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు చెబుతూ పార్లమెంటు ఉభయ సభల్లోనూ నరేంద్రమోడీ చేసిన ప్రసంగం ప్రధాని స్థాయికి తగినట్టులేదు! ఆ పదవికి ఉన్న గౌరవాన్ని తగ్గించింది! ఏ మాత్రం పస లేకుండా సాగింది!

నరేంద్రమోడీ లోక్‌సభలో మాట్లాడుతూ తెలుగుప్రజలకు గతంలో ఎదురైన అవమానాలను ఏకరవు పెట్టారు. ముఖ్యమంత్రిగా అంజయ్య ఉన్నప్పుడు చోటు చేసుకున్న సంఘటనల నుండి అనేక అంశాలను వివరించారు. లోక్‌సభ తలుపులు మూసేసి, ప్రత్యక్ష ప్రసారాలను నిలిపివేసి పునర్ వ్యవస్థీకరణ బిల్లును ఆమోదించుకున్న తీరునూ ఆయన ప్రస్తావించారు. ఇవన్నీ జరిగిపోయిన సంఘటనలు! కాంగ్రెస్ అంత ఘోరంగా వ్యవహరించింది కాబట్టే రాష్ట్రంలో ఆ పార్టీకి ప్రజానీకం సమాధి కట్టారు. సమైక్య రాష్ట్రాన్ని హడావిడిగా, అడ్డగోలుగా విభజించి, ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసిన పాపంలో బిజెపికీ భాగస్వామ్యం ఉంది. ఈ విషయాన్ని ఆయన విస్మరించినా ప్రజలు మరిచిపోలేరు. ఇక అవమానాల విషయానికి వస్తే అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో మోడీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు కూడా కాంగ్రెస్‌కు ఏమాత్రమూ తీసిపోలేదు. ప్రధానమంత్రి అప్పాయింట్‌మెంట్ కోసం సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి నెలల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి గతంలో ఎన్నడూ లేదు. రాజధాని శంకుస్థాపనకు వచ్చి పిడికెడు మట్టి, చెంబుడు నీళ్లతో సరిపెట్టడం ప్రజానీకాన్ని అవమానపరచడం కాక మరేమౌతుందో ఆయనే సెలవియ్యాలి! పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని హామీల అమలు కోసం, ప్రత్యేక హోదా కోసం నాలుగేళ్లుగా కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నా నామమాత్రంగా కూడా పట్టించుకోక పోవడమూ రాష్ట్ర ప్రజానీకాన్ని గౌరవించడమేనా? రాజ్యసభలోనూ ఆయన ప్రసంగం ఇదే మాదిరి సాగింది. బ్యాంకుల్లో పేరుకు పోయిన నిరర్థక ఆస్తుల నుండి, నల్లధనం వెలికి రాకపోవడంతో దేశం ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలకూ కాంగ్రెస్ పార్టీయే కారణమన్నట్లు అధికారం చేపట్టిన నాలుగేళ్ల తరువాత ఆయన మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది. మరో ఏడాదిలో ఎన్నికలకు పోనున్న తరుణంలో ఈ కాలంలో ఎన్‌డిఎ ప్రభుత్వం దేశ ప్రజలను ఉద్ధరించిందేమిటో చెప్పి ఉంటే బావుండేది. దానికి భిన్నంగా ఎదురుదాడికి దిగడమంటే చెప్పడానికి ఏం లేదనే భావించాలి.

ప్రధానిగా మోడీ ప్రసంగిస్తున్న సమయంలో లోక్‌సభలో తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం కావడం తరిగిపోతున్న ఆయన ప్రాభవానికి నిదర్శనం. వైసిపి, టిడిపిలు ప్రత్యేక హోదా అంశంపై పార్లమెంటులో ఆకుకు అందకుండా పోకకు పొందకుండా వ్యవహరిస్తున్నాయి. తెలుగుదేశం ఎంపిలైతే ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టకుండా వ్యూహ్యాత్మక విన్యాసాలకు పాల్పడుతున్నారు. ప్రధాని ప్రసంగ సమయంలో తెలుగుదేశం పార్టీ ఎంపీలు మౌనం పాటించినా వామపక్షాలు ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై గళమెత్తాయి. కాంగ్రెస్ వారిని అనుసరించింది. దీంతో నిరసనలు లేకుండా ప్రసంగం సాగించాలన్న వ్యూహం విఫలమైంది. నాలుగేళ్ల కాలంలో ఎన్నడూ లేని పరిస్థితిని మోడీ ఎదుర్కోవాల్సివచ్చింది. నిరసనల మధ్యే ఉపన్యాసాన్ని కొనసాగించాల్సి వచ్చింది. ప్రధాని ప్రసంగంలో రాష్ట్రానికి మొండి చేయి చూపడంతో ఆందోళనల పర్వం కొనసాగనుందని తేలిపోయింది. మాయమాటలతోనూ, గోబెల్స్ ప్రచారంతోనూ కొంతకాలం మోసం చేయవచ్చు కానీ, ఎల్లకాలం సాగదన్న సంగతి మోడీ ఇప్పటికైనా గ్రహించాలి. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటికీ ఆచరణ రూపమివ్వాలి. లేకపోతే కాంగ్రెస్ పార్టీకి పట్టిన గతే బిజెపికి పడుతుంది.

ఇది విషయం



'భా'రతీయ' మ్యాపులో
ఆంధ్ర దేశముండదా ...
మోడీ, జైట్లీలకు అది
కలనన్నా కనపడదా!

లీకుల డ్రామాలతో
బాబు బురిడీల ఆట...
అన్నీ ఇచ్చేశామంటూ
బీజేపీ పాత పాట!

- కొల్లూరు వెంకట్

ఆర్థికం

కలల మాయా బడ్జెట్

ఎప్పటిలాగే 2018-19 బడ్జెట్ సైతం ఆర్భాటపు ప్రకటనలతో, అసత్య-అర్ధ సత్య వివరాలతో, రంగుల కలలను రంజుగా చూపించింది. నిజానికి ఈ బడ్జెట్ ఏ ప్రత్యేకతలూ లేకుండానే ఒక తతంగంలా ముగిసింది. ఎండమావినే ఒయాసిస్‌లా భ్రమింపచేసేందుకు శతవిధాలా కృషి చేసింది.

ఇక బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఆదాయ, వ్యయాల వివరాల్లోకి వెళితే...కేంద్ర ప్రభుత్వపు మొత్తం పన్ను వసూళ్ల బడ్జెట్ అంచనాలు రూ.19.11 లక్షల కోట్ల నుంచి 22.71 లక్షల కోట్లకి పెరిగాయని గమనించవచ్చు. అంటే ఇంచుమించు 19 శాతం వృద్ధి పన్ను వసూళ్లలో ఉండబోతోందన్న మాట. కానీ ఇందులో ప్రత్యక్ష పన్నులు, పరోక్ష పన్నుల వాటా విడివిడిగా చూసినప్పుడు మాత్రం ప్రత్యక్ష పన్నులు 17 శాతం వృద్ధినీ, పరోక్ష పన్నులు సుమారు 20 శాతం వృద్ధినీ నమోదు చెయ్యనున్నాయని అర్థమవుతుంది. ఈ దేశంలోని 1 శాతం మంది ప్రజల వద్ద (బడాబాబుల వద్ద) 73 శాతం సంపద కేంద్రీకృతమైందని నివేదికలు వెలువడుతున్నాయి. ఈవిధంగా ఆర్థిక అసమానతలు పెచ్చరిల్లుతున్న ఈ సమయంలో సైతం... అవే తలకిందుల పన్నుల విధానాలను అమలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదు. ఎందుకంటే ప్రత్యక్ష పన్నులు నేరుగా ఒక వ్యక్తి (సంస్థ) తన సంపాదనకి అనుగుణంగా కట్టేవీ, పరోక్ష పన్నులు అంతిమంగా జన బాహుళ్యం భరించేవీ కాబట్టి. పోనీ ఆ ప్రత్యక్ష పన్నుల్లోనైనా మధ్యతరగతి వర్గానికి ఏమైనా ఊరట లభిస్తోందా అంటే అదీ లేదు. అందుకు స్పష్టమైన ఉదాహరణ కార్పొరేట్ పన్ను వసూళ్లు కేవలం 15 శాతమే పెరగనుండగా వ్యక్తిగత ఆదాయ పన్ను వసూళ్లు 20 శాతం మేరకు పెరగనుండటమే! అదే సమయంలో కేంద్ర ప్రభుత్వానికి వడ్డీలు, డివిడెండ్ల వంటి పన్నేతర వసూళ్ల రూపంలో వచ్చే ఆదాయం 15 శాతం తగ్గనుండటం సైతం ఆందోళనకర పరిణామమే. ఒక పథకం ప్రకారం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ పోవడమే ఇందుకు ముఖ్య కారణం!



ఆర్ శశికుమార్

ఇక ఖర్చుల విషయానికొస్తే ప్రకటనలకీ కేటాయింపులకీ ఏ మాత్రం పొంతన కుదరడం లేదని స్పష్టమవుతుంది. నానాటికీ దిగజారుతున్న రైతుల ఆర్థిక పరిస్థితిపై మొసలి కన్నీరు కార్చిన జైట్లీ వ్యవసాయోత్పత్తుల కనీస మద్దతు ధరని సాగు ఖర్చులపై 50 శాతమైనా లాభం చేకూరేలా నిర్ణయించబోతున్నామని ప్రకటించారు. పైకి వినసొంపుగా ఉన్నప్పటికీ ఇది మరొక శుష్క వాగ్దానమేనని భవిష్యత్తు రుజువు చేయనుంది. ఎందుకంటే ఖర్చును నిర్వచించే ప్రస్తుత అశాస్త్రీయ విధానంలో ఏ రకమైన మార్పూ లేదు కాబట్టి. అసలు ప్రభుత్వాలు ఒప్పందం చేసుకునే ఎరువులు, పెట్రోలియం ఉత్పత్తులు, విద్యుత్ వంటి ఏ ఉత్పత్తి విషయంలోనైనా ఆయా ఉత్పత్తిదారుల మదింపు ప్రకారమే ఉత్పత్తి ఖర్చు నిర్ణయించబడుతుంది. కేవలం ఒక్క వ్యవసాయ ఉత్పత్తుల విషయంలో మాత్రమే ప్రభుత్వాలు ఖర్చును, ధరలను ఏకపక్షంగా నిర్ణయిస్తాయి. కనుక ఈ కనీస మద్దతు ధర విధానం మౌలికంగా దుర్మార్గమైంది. ఎందుకంటే వ్యవసాయదారుల ఖర్చులన్నిటినీ పూర్తిగా ఈ మదింపు పద్ధతుల్లో చేర్చడం లేదు కాబట్టి. పోనీ ఈ మద్దతు ధర అన్ని వ్యవసాయోత్పత్తులకీ వర్తిస్తుందా అంటే అదీ లేదు. సరే! వర్తించే ఉత్పత్తులన్నీ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందా అంటే దానికీ సమాధానం కాదనే! ఎందుకంటే 6 శాతం ఉత్పత్తి కంటే ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేయడం లేదు కాబట్టి. బహుళజాతి కంపెనీల కబంధ హస్తాలలో చిక్కుకున్న విత్తనాలు, పురుగు మందుల ధరలు ఆకాశాన్నంటు తున్నాయి. అదే సమయంలో ఎరువులపై ప్రభుత్వ సబ్సిడీ నానాటికీ తగ్గుతోంది. దీంతో ఆయా కంపెనీల లాభాలు ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్నాయే తప్ప ఆ మేరకు ఉత్పత్తి ఖర్చు పెరిగి చివరికి రైతుకే భారంగా మారుతున్నాయని తెలియని అమాయకులేం కాదు కదా మన ప్రభుత్వ పెద్దలు. అటువంటప్పుడు ఉత్పత్తి ఖర్చులను తగ్గించడం ఉత్పత్తి అమ్మకపు ధరలను పెంచడం అనే రెండు పార్శ్వాలనీ ఏక కాలంలో స్పృశిస్తే తప్ప సమస్యకు పరిష్కారం లభించదు. కానీ మన ప్రభువుల వారికి పరిష్కారం మీద కన్నా ప్రచారం మీదే ఎక్కువ మక్కువ. అందుకే ఇలాంటి చారిత్రాత్మక నిర్ణయాలను 'అలవోక'గా ప్రకటిస్తూ ఉంటారు. ఒక పక్క వ్యవసాయ రంగపు వృద్ధిరేటు రికార్డు స్థాయిలో మందగమనంలో ఉంటే కనీసం 19 శాతం వృద్ధి రేటు వార్షికంగా సాధిస్తే తప్ప సాకారం కాని 'వ్యవసాయ ఆదాయాల రెట్టింపు' అనే రంగుల కలని మళ్లీ మళ్లీ చూపిస్తూనే ఉంటారు. మొత్తంగా బడ్జెట్ పరిమాణం 14 శాతం పెరిగితే, వ్యవసాయ రంగానికి జరిగిన కేటాయింపులు కేవలం 12 శాతమే పెరిగాయి. ఈ వాస్తవం గమనిస్తే ఈ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ప్రత్యేకంగా పెద్ద పీట వేసిన దాఖలాలేమీ లేవని స్పష్టంగా అర్థమవుతుంది.

'బడ్జెట్ అంతా ఆ చేత్తో ఇవ్వడం ఈ చేత్తో గుంజడం అన్న చందానే తయారు చేసింది. విద్య, వైద్యం, వ్యవసాయం, శాస్త్రీయ పరిశోధన వంటి కీలక రంగాలపై ప్రకటనలు తప్ప కేటాయింపులు కనబడలేదు. అంతేకాక ప్రతి సంవత్సరం ప్రభుత్వం తీసుకుంటున్న అప్పుల్లో 90 శాతానికి పైగా వడ్డీ చెల్లింపులకే సరిపోవడం సంక్షోభ సూచకమే.'



ఇక ప్రపంచంలోనే అతి పెద్ద ఆరోగ్య బీమా విధానంగా డప్పు కొట్టుకుంటున్న 'ఆయుష్మాన్ భారత్' పథకం నిజానిజాలు పరిశీలిస్తే అది ఇప్పటికే ఉన్న 'జాతీయ ఆరోగ్య బీమా' పథకానికి పూసిన పైపూత మాత్రమే అని అర్థమవుతుంది. కేవలం పెద్ద పెద్ద అంకెలను ప్రకటించడం ద్వారా మాత్రమే అది గొప్ప పథకం అవుతుందనుకుంటే తప్ప దానికి జరిగిన కేటాయింపు కేవలం రూ.2000 కోట్లు మాత్రమే అని తెలిశాక కూడా ఎవరూ ఆ ఆర్భాటపు ప్రకటనల అసలు నైజం తెలుసుకోకుండా ఉండబోరు. ఇదే విధంగా గతంలో అట్టహాసంగా ప్రకటించిన జాతీయ డయాలసిస్ ప్రోగ్రాం కింద విడుదలైన నిధులు రూ.153 కోట్లు మాత్రమే అని తెలుసుకున్నాక కూడా ఇలాంటి డాంబికపు ప్రకటనలను నమ్మే అమాయకులు ఎవరూ ఉండరు. ఇప్పటికే ఉన్న విద్యా సెస్‌కి అదనంగా ఆరోగ్య సెస్ కూడా చేర్చి 1 శాతం పెంచిన ప్రభుత్వం తద్వారా రూ.11,000 కోట్ల అదనపు వసూళ్లు ఆశిస్తుండగా మొత్తంగా ఆరోగ్య రంగానికి జరిపిన అదనపు కేటాయింపులు రూ.5,800 కోట్లు మాత్రమే వుండటం ప్రజారోగ్యంపై ఈ ప్రభుత్వపు కపట ప్రేమని స్పష్టం చేస్తుంది. ఆరోగ్య రంగంలో ప్రభుత్వ ఖర్చు అత్యంత తక్కువగా జరుగుతున్న దేశంగా భారతదేశం నిలవడం అత్యంత విషాదకరం.

ఇదే నిర్లక్ష్యం విద్యారంగంపై సైతం తాండవిస్తోంది. గతేడాదితో పోలిస్తే ప్రాథమిక విద్యపై కేటాయింపులు కేవలం 8 శాతం, ఉన్నత విద్యపై కేటాయింపులు కేవలం 5 శాతమే పెరగడం అందుకు ప్రత్యక్ష నిదర్శనం. 2017లో కాగ్ ఇచ్చిన నివేదిక ప్రకారం ఉన్నత విద్యా సెస్ రూపంలో కేంద్ర ప్రభుత్వం వసూలు చేసిన రూ.83,500 కోట్లు అసలు ఖర్చే కాకుండా మూలుగుతున్నాయంటే వసూళ్లపై ఉన్న శ్రద్ధ, ప్రాధాన్యతా రంగాలపై ఖర్చు పెట్టడం మీద లేదని స్పష్టమవుతుంది. ఈ వసూళ్లపై పెరుగుతున్న ఎనలేని మోజు ఫలితమే పన్ను వసూళ్ల నిర్వహణలకు అయ్యే ఖర్చు ఏకంగా 8 రెట్లు పెరగడం (2017-18లో రూ.12,700 కోట్లు, 2018-19లో రూ.1,05,500కోట్లు). అంతేకాదు, శాస్త్రీయ పరిశోధనా రంగం కోసం గతంలో కేటాయించిన రూ.7,885 కోట్లలో రూ.610 కోట్లు మాత్రమే వెచ్చించారని కాగ్ అక్షింతలు వేసినా ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టైనా లేదు. చైనా, అమెరికా, దక్షిణ కొరియా లాంటి దేశాలు తమ జిడిపిలో వరుసగా 2,3,4 శాతానికి పైగా పరిశోధనలకై ఖర్చు పెడుతుంటే మన దేశపు ఖర్చు ఒక్క శాతం కూడా మించకపోవడం సిగ్గుచేటు.

నిజంగా ఈ బడ్జెట్‌లో మెచ్చుకోదగిన వాస్తవిక విషయమేదైనా ఉందంటే అది వయో వృద్ధుల వడ్డీ ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ.10,000 నుండి రూ.50,000 చెయ్యడమే! ఈ ఒక్కటి తప్ప మిగిలిన బడ్జెట్ అంతా ఆ చేత్తో ఇవ్వడం ఈ చేత్తో గుంజడం అన్న చందానే తయారు చేసింది. విద్య, వైద్యం, వ్యవసాయం, శాస్త్రీయ పరిశోధన వంటి కీలక రంగాలపై ప్రకటనలు తప్ప కేటాయింపులు కనబడలేదు. అంతేకాక ప్రతి సంవత్సరం ప్రభుత్వం తీసుకుంటున్న అప్పుల్లో 90 శాతానికి పైగా వడ్డీ చెల్లింపులకే సరిపోవడం సంక్షోభ సూచకమే అనిపిస్తుంది. కస్టమ్స్ సుంకం తప్ప మిగిలిన పరోక్ష పన్నులన్నీ జిఎస్టీ పరిధిలోకి రావడంతో పన్నులపై విధాన నిర్ణయాలు పార్లమెంటులో కన్నా దాని వెలుపలే ఎక్కువ జరగడం చూస్తుంటే రాబోయే రోజుల్లో ఎన్నో అనామక చర్చల్లో ఒక్క దానిలాగానే ఈ బడ్జెట్ సైతం ఉండబోతోందని ఊహించవచ్చు. అందుకే బడ్జెట్‌పై చర్చగానీ, విశ్లేషణగానీ రాబోయే రోజుల్లో చేయబోయే పనుల ప్రగల్భాల చుట్టూ కాక...ఇప్పటికే చేసిన, చేస్తున్న పనుల ప్రోగ్రెస్ రిపోర్ట్ వంటి ధోరణిలోకి మారవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది.

(రచయిత చార్టర్డ్ ఎకౌంటెన్సీ ఉపాధ్యాయుడు,
sasichamps@gmail.com)

సెటైర్



విజన్ 2022

సంవత్సరం : 2022
ప్రాంతం : అమెరికాలో కెంటుకి రాష్ట్రం
పాత్రలు : ఓ అమెరికన్ కుటుంబ సభ్యులు

'డాడీ. మంచి మార్కులొస్తే నాకు బీఎఫ్‌సీ ట్రీట్ ఇస్తానన్నారు. మరిచిపోయారా'

'నో. కిడ్. అంత డబ్బు లేదు ప్రస్తుతం నా దగ్గర. అందాకా కేఎఫ్‌సీ ఇవ్వనా !'

'నో డాడ్. గ్రేట్ డిప్రెషన్ టైంలో కల్నల్ సాండర్స్ తాతయ్య ఇక్కడే మొదలెట్టిన ఆ ఫుడ్ చైన్ ఇప్పుడు డిప్రెషన్‌లోకి పోయింది. ఇప్పుడంతా బీ ఎఫ్ సీ నడుస్తోంది. అఫ్ కోర్స్. వెరీ కాస్ట్లీ.'

'ఐ నో కిడ్. ది ఇండియన్ బీ ఎఫ్ సీ. ఐ మీన్ భారత్ ఫ్రెష్ పకోడీ చైన్ మొత్తం గ్లోబ్ అంతా లాగేసుకొంది. డామిట్. నో స్పేస్ ఫర్ అదర్ స్నాక్ ఫ్రాంచైస్.'

'ఆ ఇండియన్స్... వాళ్ళ ప్రొడక్ట్‌ని అక్కడే అమ్ముకోవచ్చు కదా డాడ్. మనకి అలవాటు చేసి మన మార్కెట్ ఎందుకు కొట్టేయడం?'

'యూ నో. అక్కడ ప్రధాని పిలుపు మేరకు అందరూ పకోడీలు తయారు చేయడం మొదలు పెట్టారట. దీంతో కొనేవాళ్ళు లేక ఇబ్బంది వచ్చిందట. ఇక లాభం లేదని ఎక్స్‌పోర్ట్ వ్యూహం అమలు చేసారట. అక్కడ జీడీపీలో సగం జీడిపప్పు పకోడీ సంపాదిస్తుంది తెలుసా!'

'అక్కడ అంత తక్కువ జీడీపీయా!'

'యూ. సిల్లీ. చైనా కన్నా ఎక్కువ. ఇన్ ఫాక్ట్. చైనా బెదిరిపోయి పకోడీ కి పోటీగా ఫేక్-కోడి అని డూప్లికేట్ దించితే, పాకిస్తాన్ పాక్-కోడి అని మరోటి మార్కెట్లోకి దించింది. అవేవీ పకోడీలో ఉల్లి రెక్కను కూడా పీకలేక పోయాయి.'

'మీ నోరూరించే కబుర్లు తర్వాత. ట్రీట్ ఎప్పుడో చెప్పండి'

✦ ✦ ✦

'మిట్టమధ్యాహ్నం ఏంటా నిద్ర. లేవండి.' అన్న ఆవిడ పిలుపుతో మత్తు వదిలింది. షా, మోడీ జోడీ వేడి వేడి పకోడీపై చేస్తున్న వాడివాడి చర్చలు విని కునుకేస్తే ఈ పగటి కల వచ్చిందన్నమాట. అదేమాట చెప్పాను.

'బాగా గుర్తు చేశారు. ఓ ప్లేట్ పకోడీ చెయ్యండి. తినాలనిపిస్తుంది.'

నేను కదలకపోయే సరికి మళ్లీ గదమాయించింది. షా, కాంగ్రెస్ వాళ్ళని గదమాయించినట్టు.

'పకోడీ చెయ్యడం నామోషీ కాదు. కథలు రాయడం కన్నా గొప్ప పని. మీరు కథలు రాసి పేపరేస్తే, వాటి కన్నా ఆ పేపరు పొట్లంలోని పకోడీలే బాగుంటాయి తెలుసా!'

'నామోషీ ఏంటి? దానికీ, దీనికీ పోలికేంటి? దేనికదే గొప్ప. ఇలా కంపేర్ చెయ్యడం బాగోలేదు.. నువ్వయినా, ఈ దేశ ప్రధాని అయినా'.

సణుగుతూ కిచెన్ వైపు నడిచాను.

'ఇదుగో, ఉల్లిపాయల ధరలు పెరిగాయి. వాడకండి. గ్యాసు, ఆయిల్ ధరలు కూడా.. అట్టే వేస్ట్ చేయకండి'

'సాయం లేకపోయినా, దేశంలో ఉపదేశాలకు లెక్క లేదు'.

- డా డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం.

✦

భూమిపై వేడిని చిత్తు చేసే ఎత్తు

భూమిపై వాతావరణం వేడెక్కి మంచు కొండలు సైతం కరిగి పోతాయని, నిజానికి అటువంటి కరుగుదల ఇప్పటికే ప్రారంభ మైందని అంటున్నారు. అయితే, అనూహ్యంగా అధికమౌతున్న భూ తాపోన్నతిని అధిగమించ డానికి అమెరికన్ శాస్త్రవేత్త ఒక పరిష్కారం సూచించాడు. ఆర్కిటిక్ ప్రాంతాన్ని తిరిగి ఘనీభవింపచేస్తే భూ తాపం తగ్గుముఖం పడుతుందన్నాడు. డేవిడ్ కీత్ అనే హార్వార్డ్ ఆచార్యుడు సూచించిన ప్రకారం కాంతిని పరావర్తనం చెందించే పదార్థాలను ఆర్కిటిక్ వాతావరణంలోకి వదిలితే, అవి సూర్యరశ్మిని భూమి మీదకు తక్కువగా వచ్చేలా చేస్తాయట. సూర్య కాంతి, దరిమిలా వేడి కూడా తగ్గి, ఆర్కిటిక్ ప్రాంతంలో శీతల వాతావరణాన్ని తిరిగి కలిగించి, మంచు ఏర్పడేలా చేయవచ్చు అంటున్నారు. సూర్యరశ్మిని కేవలం 0.5 శాతం తగ్గించినా కూడా ఆర్కిటిక్ ప్రాంత మంచును గణనీయంగా పెంచవచ్చని ఆయన సెలవిచ్చాడు. ✦

జన వాక్యం

కొవ్వును కొవ్వు తగ్గిస్తుందా?

ఈమధ్య వీరమాచినేని రామకృష్ణ అనే వ్యక్తి కొవ్వు పట్టిన వారు కొవ్వు తీసుకుంటే లావు తగ్గుతారని, రోగాలు తగ్గుతాయని ప్రచారం చేస్తున్నాడు. ఇది శాస్త్రీయమేనా? ఎటువంటి ఆధారాలు లేకుండా ఈయన చెప్పింది నమ్మాలా? అసలు కొవ్వును కొవ్వు తగ్గిస్తుందంటే ఎవరైనా నమ్ముతారా? నమ్మాలంటే ఏదైనా ప్రయోగ శాలలో రుజువులతో సహా తేలాలి. అప్పుడే ప్రజలు దానిని అంగీకరించాలి. అదే సైన్సు పద్ధతి. ఎందుకంటే సైన్సులో ఎటువంటి రహస్యం ఉండదు. అయితే ప్రస్తుత రోజుల్లో రకరకాల అశాస్త్రీయ వైద్య విధానాలతో కొందరు ప్రజలను మోసగిస్తున్నారు. మూత్రం తాగితే రోగాలు పోతాయని మూత్ర వైద్యం, ప్రాణిక్ హీలింగ్, రంగురాళ్లు, పిరమిడ్ వైద్యం, సంఖ్యాశాస్త్రం, ఆయిల్ పుల్లింగ్, ప్రకృతి వైద్యం, యోగా సర్వ రోగ నివారిణి అని, దేవుణ్ణి నమ్ముకుంటే రోగాలు పోతాయని, ప్రార్థనలు చేస్తే ఏ రోగాలైనా తగ్గుతాయని ఇలా రకరకాల వైద్యాల పేరుతో ప్రజలు మోసపోతున్నారు. వీటిని అరికట్టాల్సింది ప్రభుత్వమే. ప్రజలను విజ్ఞానం వైపుకు నడిపించాలి గాని, అజ్ఞానం వైపుకు కాదని పాలకులు గుర్తించాలి.

నార్నె వెంకట సుబ్బయ్య,
ఏ పి హేతువాద సంఘం.

వ్యాసాలు, ఉత్తరాలు రాయవల్సిన చిరునామా
editpageps@gmail.com

అంతర్జాతీయం

'కొరియా' రాజకీయ క్రీడలు!

దక్షిణ కొరియా నగరమైన పయోంగ్ చాంగ్‌లో శీతాకాల ఒలింపిక్స్ పోటీల ప్రారంభానికి ముందే కొరియా ద్వీపకల్పం, దాంతో ముడిపడిన దేశాలు రాజకీయ క్రీడలతో వేడెక్కసాగాయి. పశ్చిమ దేశాల తప్పుడు ప్రచారాన్ని ఎండగడుతూ ఈ పోటీల్లో ఒకే పతాకం నీడలో ఒకే గీతం పాడుతూ కదం తొక్కుదామని, ఉమ్మడి గా సాంస్కృతిక ప్రదర్శనలు ఇద్దామని, వీలైతే కొన్ని పోటీలలో ఉమ్మడి జట్లను బరిలోకి దింపుదామని ఉత్తర కొరియా చేసిన ప్రతి పాదనలకు దక్షిణ కొరియా కూడా ముందుకు వచ్చింది. అయితే పొమ్మనకుండానే పొగబెట్టినట్లు పాలకవర్గ దన్ను వున్న దక్షిణ కొరియా మీడియా అవమానకర రాతలు రాసిన కారణంగా తాము వెనక్కు తగ్గుతున్నట్లు ఉత్తర కొరియా ప్రకటించింది. ఒలింపిక్స్ జరిగే సమయంలోనే అమెరికా దాడులకు దిగనుందనే వార్తలు వచ్చినప్పటికీ ఈ పోటీలకు ఐదు వందల మందితో కూడిన ఉత్తర కొరియా ప్రతినిధి బృందం పయోంగ్ చాంగ్ చేరుకుంది. ఈ పోటీలకు పార్లమెంట్ స్పీకర్ కిమ్ యాంగ్ నామ్ కూడా హాజరవుతున్నారు. పోటీలు జరిగే ఈ నగరం ఉత్తర కొరియా సరిహద్దుకు కేవలం 80 కిలోమీటర్ల దూరంలోనే వుంది.



ఎం కోటేశ్వరరావు

తాము శాంతి ప్రయత్నాలు చేస్తున్నా ఉత్తర కొరియా అణు పరీక్షలను కొనసాగిస్తూనే వుందని ప్రపంచం ముందు కనిపించేందుకు గతేడాది మే నెలలో ఎన్నికైన దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ ప్రయత్నిస్తున్నాడు. అణు పరీక్షలు జరిపిందనే సాకుతో మూన్‌కు ముందున్న అధ్యక్షుడు పార్క్‌గున్ హై 2016 జనవరి తరువాత ఉత్తర కొరియాకు సాయం నిలిపివేశాడు. ప్రస్తుత పరిస్థితుల్లో సాయం అందించవద్దని జపాన్ ప్రధాని షింజో అబే వ్యక్తిగతం గా కోరినప్పటికీ మూన్ నాలుగు నెలల క్రితం ఎనిమిది మిలియన్ డాలర్ల సాయాన్ని పునరుద్ధరించాడని పరిశీలకులు వ్యాఖ్యానించారు. నిజానికి అది ప్రచార ఎత్తుగడని వేరే చెప్పనవసరం లేదు. ఈ సాయాన్ని ఉత్తర కొరియా మిలిటరీకి ఉపయోగిస్తున్నదని అమెరికా, జపాన్ ప్రచారం చేస్తున్నాయి. ఈ రెండు దేశాల ప్రయోజనాల కోసం ఉత్తర కొరియాను రెచ్చగొడుతున్నారని, ఒకవేళ యుద్ధమే వస్తే నష్టపోయేది తాము తప్ప ఆ దేశాలు కాదని దక్షిణ కొరియా పౌరులు ఆందోళన చెందుతూ సోదర కొరియాతో శాంతి కోసం ప్రయత్నించాలని పెద్ద ఎత్తున ఒత్తిడి తెస్తున్న కారణంగానే మూన్ శాంతి ప్రకటనలు చేస్తున్నాడు.



కిమ్



ట్రంప్



మూన్

రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ ఆక్రమణకు గురైన కొరియాను విముక్తి చేసే క్రమంలో ఉత్తర ప్రాంతంలో సోవియట్ సేనలు, దక్షిణ ప్రాంతంలో అమెరికా నాయకత్వం లోని సేనలు జపాన్ మిలిటరీని ఓడించాయి. దురాక్రమణకు వ్యతిరేకంగా పోరాడిన కమ్యూనిస్టుల నాయకత్వంలో ఉత్తర ప్రాంతంలో ఏర్పడిన ప్రభుత్వానికి సోవియట్ మద్దతు ప్రకటించగా దానికి పోటీగా అమెరికాలో వున్న కమ్యూనిస్టు వ్యతిరేకి, కొరియా మాజీ నియంత సింగమాన్ రీని అమెరికా నుంచి రప్పించి అమెరికన్లు దక్షిణ ప్రాంతంలో ఒక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. రెండు ప్రభుత్వాలు మొత్తం కొరియాపై తమదే ఆధిపత్యం అని ప్రకటించుకున్నాయి. పరిస్థితులు చక్కబడిన తరువాత ఐక్య కొరియా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనే అంగీకారం కుదిరింది. తరువాత దక్షిణ కొరియాలోని నియంత ప్రభుత్వం అమెరికా దన్నుతో ఉత్తర కొరియాను ఆక్రమించుకొనేందుకు దాడి చేసింది. దానిని సోవియట్, చైనా మద్దతుతో ఉత్తర కొరియా కమ్యూనిస్టు ప్రభుత్వం తిప్పి కొట్టింది. ఉభయుల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అప్పటి నుంచి విలీనం గురించి ఉత్తర కొరియా ప్రయత్నించగా తగిన పరిస్థితులు ఏర్పడలేదనే సాకుతో 1953 నుంచీ దక్షిణ కొరియా అడ్డుకొంటోంది. దీనికి అమెరికా, జపాన్ మద్దతు ఇస్తున్నాయి. ఉత్తర కొరియాకు రద్దయ్యే వరకు సోవియట్, తరువాత చైనా, వియత్నాం వెన్నుదన్నుగా వున్నాయి.

ఉత్తర కొరియాతో సఖ్యత, ఐక్యతకు సిద్ధమంటూనే మూన్ ఒకవైపు ప్రకటనలు చేస్తుంటే...మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యంత్రాంగం ఒలింపిక్ క్రీడల సమయంలోనే అవసరమైతే ఉత్తర కొరియాపై దాడి చేయాలని ఆలోచిస్తున్నట్లు వార్తలు వెలువడ్డాయి. దాన్ని ఆంగ్లంలో 'బ్లడీ నోస్' అని పిలుస్తున్నారు (ముక్కు బద్దలు కొట్టి భయ పెట్టటం వంటిది). ఎవరు అవునన్నా కాదన్నా అణ్వస్త్ర దేశాలలో ఉత్తర కొరియా ఒకటి. అమెరికా దగ్గర వెయ్యి వుంటే దాని దగ్గర ఒకటే వుండవచ్చు. వాటిని ప్రయోగిస్తే జరిగే నష్టం ఒకటైనా, వెయ్యి అయినా ఒకటే. తక్షణమే వాటిని ఉపయోగించకపోయినా మారణకాండ జరిపే ఆయుధాలు అమెరికా దగ్గర గుట్టలుగా వున్నాయి. అమెరికా గనుక యుద్ధానికి పూనుకుంటే దక్షిణ కొరియాలో వున్న రెండు లక్షల 30 వేల మంది అమెరికన్ సైనికుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని దక్షిణ కొరియాలో కొత్తగా నియమితులైన అమెరికా రాయబారి విక్టర్ చా హెచ్చరించాడు. అందుకుగాను ట్రంప్ ఆ నియామకాన్ని రద్దు చేశాడు. గత ఏడాది కాలంలో అనేక సార్లు ట్రంప్ ఉత్తర కొరియా నాయకత్వాన్ని తూలనాడటం, రెచ్చగొట్టే విధంగా ప్రకటనలు చేయటం తెలిసినదే. గత వారంలో ఉత్తర కొరియా నుంచి ఫిరాయించిన వారితో సమా వేశమై గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని, దాడులు తప్ప మరొక మార్గం లేదని నోరుపారేసుకున్నాడు. ఒలింపిక్స్‌కు బయలుదేరిన అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ మధ్యలో అలాస్కాలోని క్షిపణి వ్యతిరేక కేంద్రాన్ని సందర్శించటంతో పాటు జపాన్‌తో చర్చలు జరపాలని నిర్ణయించాడు. నిజానికి ఇతగాడి పర్యటన ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా ప్రచార దాడి లక్ష్యం తప్ప తలెత్తిన ఉద్రిక్తతలను ఉపశమింపచేసేదిగా లేదు. క్రీడల తరువాత గతేడాది మాదిరే ఉత్తర కొరియా సమీపంలో ఆధునిక ఆయుధాలతో సైనిక విన్యాసాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉత్తర కొరియాపై దాడులు చేసేందుకు అమెరికా అవకాశం కోసం చూస్తున్నది. దానిలో భాగంగానే జనవరి 13వ తేదీన హవాయి దీవుల వైపు ఖండాంతర క్షిపణి వస్తున్నదని, ఇది డ్రిల్లు కాదు, వెంటనే రక్షణ తీసుకోండనే తప్పుడు సమాచారాన్ని జనంలో ప్రచారంలో పెట్టారు. దాంతో వీధుల్లోని జనం కార్లను వదలి పరుగులు తీసిన ఉదంతం తెలిసిందే. అబద్ధాలు చెప్పి జనాన్ని బురిడీ కొట్టించటంలో అమెరికా గూఢచార, మీడియా సంస్థలు పేరు మోశాయి.

గత ఏడు దశాబ్దాల పరిణామాలను గమనించినపుడు ఉభయ కొరియాల విలీనానికి అడ్డుపడుతున్నది అమెరికా నాయకత్వంలోని సామ్రాజ్యవాద దేశాల కూటమి అన్నది స్పష్టం. 1950 దశకంలో ఉత్తర కొరియాను ఆక్రమించుకొనేందుకు అమెరికా మద్దతుతో దక్షిణ కొరియా ప్రయత్నించింది తప్ప ఇంతవరకు ఏ నాడూ దక్షిణ కొరియాపై సోషలిస్టు ఉత్తర కొరియా దాడి చేసిన దాఖలాలు లేవు. అయినప్పటికీ విలీనానికి ఇంకా అనుమానాలు తొలగలేదనే పాచి పాటనే పశ్చిమ దేశాలు పాడుతున్నాయి. శీతాకాల ఒలింపిక్స్ సందర్భంగా చేస్తున్న ప్రచార దాడి దానిలో భాగమే. ✦



ప్రకృతిలోని పరిణామాలను సరిగా అవగాహన చేసుకోలేక కల్పించుకున్న భావాలే దైవం, దెయ్యం, ఆత్మ, పరమాత్మ, పునర్జన్మ.. అనేవి. వీటి చుట్టే ఆయా మతాలూ ఏర్పడ్డాయి. కొన్ని మతాలైతే ఏకంగా మూఢత్వాన్ని ప్రధాన ఎజెండాగా ప్రచారం చేస్తూ.. మనిషి పుట్టుక నుంచి చావు వరకూ అర్థంలేని ఆచారాలను నమ్మబలుకుతూ మనిషిని నిలువునా వంచిస్తున్నాయి. అందులో ఇప్పటికీ చాపకింద నీరులా కొనసాగుతున్నదే 'బలి' దుష్టాచారం.. క్షుద్ర దేవతలకు పూజలు పేరిట.. సాటి మనుషుల ప్రాణాలను సైతం నిలువునా బలిగోరుతున్న వైనాలను ఇటీవల కాలంలో మనం చూస్తున్నాం. వింటున్నాం. 'ఇంత దారుణమా?' అంటూ హడలిపోతున్నాం. ఆధునికంగా ముందడుగు వేయాల్సిన సమాజం ఎందుకు తిరోగమనం దిశగా వెలుతోంది? అసలు నరబలులకు పాల్పడేవారి మనస్తత్వం ఏమిటి? ఇదే నేటి 'జీవన' ఫోకస్.

మూఢత్వానికి బలిశిశువులు

కుటుంబాల్లో చిన్న వయసు నుంచే పిల్లల్లో మౌఢ్యపు భావనల్ని నింపేస్తుండడంతో సమాజంలో తరతరాలుగా మూఢనమ్మకాలు అలాగే కొనసాగుతున్నాయి. దేవుళ్లకు, దెయ్యాలకు బలులిస్తే తమ కోరికలు నెరవేరుతాయన్న మూఢనమ్మకాన్ని ఇప్పటికీ జనం నమ్ముతుండడానికి కారణం అజ్ఞానమే. కొన్ని మతాల్లోనూ బలులివ్వడం నైవేద్యం పెట్టడంలానే భావిస్తారు. అందులోనూ సాధారణ జంతువులు కన్నా నరబలి ఇస్తే తమ కోరికలు అన్నీ నెరవేరుతాయనే మూఢత్వం మాటున ఒక నేరమనస్తత్వం పెరిగిపోతోంది.

ఎన్నో ఘటనలు

ఒకటా రెండా ఎన్నో ఘటనలు అన్నీ అమానవీయమైనవే. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, మిగిలిన రాష్ట్రాల్లోనూ ఈ నరబలి అమానుషం అప్పుడప్పుడు నాగరిక సమాజాన్ని ఉలిక్కి పడేలా చేస్తోంది. గత రెండేళ్లలోనే పదుల సంఖ్యలో ఘటనలు, సమాజాన మానవత్వం ఎలా మాయమైపోతోందో స్పష్టం చేస్తున్నాయి. గతవారం హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో రాజశేఖర్ అనే క్యాబ్‌డ్రైవర్ కరీంనగర్ తండా నుంచి ఓ పసిపాపను కొని తీసుకొచ్చి, నరబలి ఇచ్చాడు. తన భార్య ఆరోగ్యం గత కొద్ది రోజులుగా బాగుండటం లేదని క్షుద్ర పూజలు చేసే పూజారుల వద్దకు తిరిగాడు. పూజారులు చెప్పిన విధంగా చంద్రగ్రహణం రోజు క్షుద్రపూజలో భాగంగానే అప్పటికే తాము కొనుగోలు చేసిన ముక్కుపచ్చలారని పసికందును బలి ఇచ్చాడు. కర్నాటకలోని మాగడివద్ద గతేడాది మార్చి నెలలో పదేళ్ల వయసున్న చిన్నారి అయేషాను నరబలి ఇచ్చేశారు. బాలికను బలిస్తే పక్షవాతం నయమౌతుందని భూతవైద్యుడు చెప్పడంతో ఈ దారుణచర్యకు పాల్పడ్డారు. గతేడాది ఆగస్టు నెలలో తమిళనాడులోని వేలూరు జిల్లా వానియంబాడిలోని స్వామిజీమఠంలో చిన్నారిని నరబలి ఇచ్చి, నీటి తొట్టెలో వేశాడు. ఆరోజు చంద్రగ్రహణం కావడంతో స్వామిజీ రవి ప్రత్యేక యాగం చేసి ఆ బాలికను నరబలి ఇచ్చేశాడు. గతేడాది అక్టోబర్‌లో ఉత్తరప్రదేశ్‌లోని సహరణ్‌పూర్‌లో నలుగురు కూతుళ్లున్న ఓ తండ్రి.. కొడుకు పుట్టాలనే ఆశతో పొరుగింటి అక్షిత అనే చిన్నారిని గొంతుకోసి, బలి ఇచ్చాడు. కర్నూలు జిల్లా బొల్లవరం దగ్గర 2016 అక్టోబర్ నెలలో పనికి వెళ్లిన దళిత యువకుడిని కొత్త పొక్లెయినర్‌కు నరబలివ్వాలన్న మూఢనమ్మకంతో రమేష్ అనే వ్యక్తి చంపించేశాడు. తూర్పుగోదావరి జిల్లా ఏజెన్సీలో వై.రామారం మండలం చింతకర్రపాలెంలో 2015 అక్టోబర్ నెలలో గంగాలమ్మ తల్లికి ఒక మహిళను అక్కడి గిరిజనులు బలిచ్చారు. కర్నూలు జిల్లా పత్తికొండలో 2015 అక్టోబర్ నెలలో క్షుద్రపూజల పేరిట తొమ్మిది నెలల శిశువును నరబలి ఇచ్చారు. గతేడాది అక్టోబర్ నెలలో చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం, రామాపురం అడవుల్లో బంగారం గుప్త నిధులు ఉన్నాయన్న మూఢ నమ్మకంతో కొందరు క్షుద్ర మాంత్రికులు పూజలు చేస్తూ మురుగా నాయక్ అనే యువకుడిని నరబలి ఇవ్వబోతుండగా స్థానికులు అడ్డుకున్నారు. ప్రకాశం జిల్లా వలేటివారిపాలెం మండలం పోమేరు గ్రామంలో 2015 సెప్టెంబర్ నెలలో సాగర్ అనే ఐదేళ్ల బాలుడిని అదే గ్రామానికి చెందిన తిరుమలరావు అనే వ్యక్తి తన ఇంట్లో క్షుద్రపూజలు నిర్వహించి, పసివాడిని బలి ఇచ్చాడు.

అపోహలతోనే.. మూఢవిశ్వాసం

మానవ సంబంధాలను మరింత బలహీనం చేయడానికి మూఢత్వం అమానుషాన్ని ప్రేరేపిస్తోందని ఇలాంటి దారుణాలు రుజువు చేస్తున్నాయి. రకరకాల కారణాలవల్ల కుటుంబ జీవనానికి తగిన ఆర్థికపరిస్థితులు లేకపోవడం. ఏం చేసైనా డబ్బు సంపాదించుకోవచ్చు, సామాజిక బాధ్యత అవసరం లేదనుకునే అవాంఛనీయధోరణి, అన్ని రంగాలలో తిష్టవేసిన వినిమయ సంస్కృతి మనిషిలోని విచక్షణని మరింత దిగజారుస్తున్నాయి. కుటుంబ బంధాలు ఒకవైపు విచ్ఛిన్నమైపోతుండగా.. మరోవైపు మూఢనమ్మకాలు మనిషి మెదడులో తిష్టవేసి, అమానుష స్థితిలోకి నెట్టేస్తున్నాయి. శాస్త్రీయ అవగాహన, ఆలోచన మానవజీవితంలో భాగం కాలేనంతవరకూ సమాజాన్ని ఇలాంటి అంధవిశ్వాసాలే శాసిస్తుంటాయన్నది ఎవరూ కాదనలేని వాస్తవం.

అశాస్త్రీయమైన విషయం ఏదైనా అది మూఢవిశ్వాసమే. అది ఎదురొచ్చే పిల్లికావొచ్చు, నెత్తిమీద పడే బల్లి కావొచ్చు. మనిషిలో మూఢత్వం అంతకంతకు పెరిగి... జాడ్యమైతే చివరికి మానవ మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. అందుకే.. మనిషిలో శాస్త్రీయ దృక్పథం పెరగాలి. ఇలాంటి బలుల మూఢత్వాన్ని తిప్పికొట్టడంతోపాటు.. సాటివారినీ మేల్కొలిపే బాధ్యతా తీసుకోవాలి. చుట్టూ ఉన్న సమాజాన ఎక్కడ ఎలాంటి అనాగరిక అలికిడి కనపడినా.. వినపడినా చట్టానికి అప్పగించాలి.

- బెందాళం కృష్ణారావు



ప్రమాదకరమైన మానసికధోరణి

మూఢ విశ్వాసాలు మనిషి మెదడును చాలా తీవ్రంగా ప్రభావితం చేస్తుంటాయి. తాము చేస్తున్నది ఏమిటో కూడా తెలియనంతగా అవి మనిషిని లొంగదీసుకుంటాయి. అప్పుడప్పుడూ కాస్త వివేకం తలెత్తినా సరే.. ఇలాంటి అమానుష చర్యలు తప్పుకావని, ఫలానా గ్రంథంలో ఉంది. ఫలానా శాస్త్రంలో ఉంది అంటూ సమర్థించుకునే మానసిక స్థితి వారిలో ఉంటుంది. ఇటువంటి ధోరణి సమాజంలో చాలా ప్రమాదకరమైనది. కర్ణాటక రాష్ట్రంలో మాదిరిగా మూఢనమ్మకాల నిరోధానికి ప్రత్యేక చట్టాన్ని దేశమంతటా తీసుకొచ్చి, దానిని కఠినంగా అమలుచేయాలి.

- డాక్టర్ జాగర్లపూడి అమర్‌నాథ్.
సైకాలజిస్ట్, హైదరాబాద్.



తక్షణం చట్టం తేవాలి!

అశాస్త్రీయత రాజ్యమేలుతున్న ప్రస్తుత తరుణంలో జంతుబలి, నరబలి, మూఢత్వ నిర్మూలనకు విస్తృతమైన ప్రచారం జరగాలి. అందుకు ప్రభుత్వాలే పూనుకోవాలి. అలాంటప్పుడే ఇలాంటి క్షుద్ర పూజా పద్ధతుల నిర్మూలనకు అడ్డుకట్టపడుతుంది. ఇలాంటివాటికి పాల్పడేవారు వాస్తవంగా సాధించిందీ ఏమీ లేదు.. పైగా వారి జీవితాల్నే సర్వనాశనం చేసుకుంటున్నారు. అందుకు ఈ సంఘటనే తాజా ఉదాహరణ. చేసినవారు, చేయించినవారు అందరూ శిక్షింపబడుతున్నారు. తులసీదళం.. తదితర మూఢత్వాన్ని ప్రేరేపించే టీవీ సీరియల్స్‌కూ, సినిమాలకూ నేడు మన మాధ్యమాల్లో కొదవేలేదు. ఈ తీవ్రతను గుర్తించి, ప్రభుత్వాలు మూఢనమ్మకాల నిరోధక చట్టాన్ని తక్షణం తీసుకొచ్చి, అమలు జరపడమే మార్గం.

- కె. శ్రీనివాస్
జెవివి రాష్ట్ర కార్యదర్శి

యువతుల్లో ధైర్యాన్ని నింపుతోంది



'భయపడుతూ, బలహీనులుగా ఉండటం మా అభిమతం కాదు.. మేము ఎంతో బలంగా ఉండి మా సమాజాన్ని పునరుద్ధరించుకోవడమే మా లక్ష్యం' అంటున్నారు పాకిస్తాన్‌కు చెందిన గులాలై ఇస్మాయిల్. మతం మాటున నలిగిపోతున్న పాకిస్తాన్ మహిళల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా పదహారేళ్ళ వయసులోనే 'అవేర్ గర్ల్స్' పేరుతో స్వచ్ఛంద సంస్థను స్థాపించి, యువతులను జాగృతం చేస్తోన్నారు.

పాకిస్తాన్ మహిళల్లో సాధికారత, లింగ సమానత్వం, శాంతి స్థాపనే ధ్యేయంగా గులాలై తన సోదరి సాబాతో కలిసి మహిళల్లో అవగాహన కల్పించే కార్యక్రమాన్ని 'అవేర్ గర్ల్స్' పేరుతో చేపట్టారు. పదిహేనేళ్ళుగా చేస్తున్న ఈ కార్యక్రమాలకు ఎన్నో అవాంతరాలు, బెదిరింపులు.. అయినా మొక్కవోని దీక్షతో లక్ష్యాన్ని చేరుకునే దిశగా అడుగులు వేస్తున్న గులాలై పాకిస్తాన్‌లోని ఖైబర్ పఖ్తున్ఖ్వ రాష్ట్రంలోని స్వాబి జిల్లాలో జన్మించింది. మతం పేరుతో మహిళలపై పెరుగుతున్న హింసకు ప్రతిరూపం ఈ ప్రాంతం. మహిళల హక్కుల గురించి పోరాడటానికి స్ఫూర్తి మా నాన్నే అంటున్నారు గులాలై. గులాలై తండ్రి మానవ హక్కుల కార్యకర్త. ఆయన సమాజంలో అసమానతల మీద పోరాటం చేస్తున్నారు. 9/11కి ముందు ఆఫ్ఘనిస్తాన్ నిర్వహిస్తున్న ఉగ్రవాద సంస్థలకు పాకిస్తాన్ ఎన్నటికీ సహాయం చేయదని ప్రచారం నిర్వహించినందుకు అతన్ని జైల్లో పెట్టారు.



గులాలై పదమూడేళ్ళ వయసులో బాలల హక్కుల అడ్వైజరీ ఫోరమ్స్‌తో కలిసి పనిచేశారు. అదే స్ఫూర్తితో పదహారేళ్ళకే 'అవేర్‌గర్ల్స్' స్వచ్ఛంద సంస్థను స్థాపించి, యువతలో మార్పుకు శ్రీకారం చుట్టారు. మహిళల్లో ముఖ్యంగా యువతుల్లో దాగి ఉన్న నాయకత్వ లక్షణాలను వెలికితీసి, వారికున్న హక్కులను తెలుసుకునేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ సంస్థ పనిచేస్తోంది. పాకిస్తాన్‌లోని ఖైబర్ పఖ్తున్ఖ్వ రాష్ట్రంలో హింసాత్మక తీవ్రవాదాన్ని నివారించడం కోసం కూడా ఆమె పనిచేస్తున్నారు. అంతేకాక, మహిళలకు విద్య ఎంత అవసరమో వివరించి వారిని ఆర్థిక, రాజకీయ, సామాజిక సాధికారత సాధించేలా తయారు చేయడం ఆ సంస్థ ఉద్దేశం. యువతుల లైంగిక, పునరుత్పత్తి హక్కులను కాపాడటం, మహిళల్లో ఆరోగ్యకరమైన ఆబార్షన్స్ గురించి అవగాహన కల్పించే కార్యక్రమాలనూ నిర్వహిస్తున్నారు. గృహహింసకు గురవుతున్న మహిళలకు రక్షణ కల్పించడం, వారికి కౌన్సెలింగ్ నిర్వహించడానికి ఒక హెల్ప్‌లైన్‌నూ నడుపుతున్నారు.

భారతదేశంలో మహిళల పరిస్థితులకు, పాకిస్తాన్ పరిస్థితులకూ పోలిక ఉందని అంటున్న గులాలై పాకిస్తాన్‌లో మాత్రం ఉన్నత విద్యనభ్యసించిన సాధారణ అమ్మాయిలకు తమ జీవితం మీద ఎలాంటి అధికారం లేదని అంటున్నారు. ఉన్నత విద్యనభ్యసించిన అమ్మాయిలు పెళ్ళి చేసుకున్న తర్వాత తరతరాలుగా పేరుకుపోయిన విశ్వాసాలతో బానిస కంటే హీనంగా బతుకుతున్నారు. దీన్నిబట్టి విద్య మహిళల్లో సాధికారతను తీసుకువస్తుందని ఎలా అనుకుంటామని గులాలై ప్రశ్నిస్తున్నారు. ఆ సంస్థ ద్వారా హింసకు వ్యతిరేకంగా ప్రచారం చేయడం, శాంతి కొరకు యువతలో అవగాహన ఎలా కల్పించాలనే విషయాలను శిక్షణలో నేర్పిస్తారు. శిక్షణ తీసుకున్న కార్యకర్తలు వారి వారి ప్రాంతాలలో తప్పుదోవ పడుతున్న యువతలో మార్పుకు ప్రయత్నిస్తారు. ★

సెల్ వాడకం ఆపేదెలా?

సెల్‌ఫోన్ చేతిలో లేకుండా క్షణం గడవడం లేదు. ఇక యూత్ అయితే స్మార్ట్‌ఫోన్స్‌కు అతుక్కుపోతున్నారు. రాత్రీపగలూ తేడా లేకుండా చాటింగ్, గేమింగ్స్‌తో గడుపుతున్నారు. చిన్నపిల్లలకూ ఈ స్మార్ట్‌ఫోన్ వైరస్ సోకింది. ఇది వారి మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నది. పిల్లల్లో సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గించడానికి కొన్ని చిట్కాలు...

- మొబైల్ వాడకాన్ని మనం నెమ్మదిగా తగ్గించాలి. పిల్లలు ఇంట్లో ఉన్నప్పుడు వాటి జోలికి మనమూ వెళ్లకుండా ఉంటే మంచిది. మనం ఇంట్లో పనులు చేస్తూ వారినీ భాగస్వాములను చేస్తూ వారితో మనసువిప్పి మాట్లాడాలి.
- అవుట్‌డోర్ గేమ్స్, స్పోర్ట్స్ ఆడేలా ప్రోత్సహించాలి.



- అనవసరమైన ఫీచర్స్ లేని ఓ బేసిక్ ఫోన్ మనం కొనాలి. అది వినోదం కోసం కాకుండా కేవలం కమ్యూనికేషన్‌కు మాత్రమే ఉపయోగించేలా చూడాలి.
- సెల్‌ఫోన్ ముఖానికి ఎనిమిది ఇంచెల దూరంలో ఉండేలా చూడమని పిల్లలకు సూచించాలి. మ్యూజిక్ వినడానికి తప్పనిసరిగా హెడ్‌ఫోన్ ఉపయోగించమని చెప్పాలి.
- ఫోన్ మాట్లాడేటప్పుడు చెవి దగ్గరగా కాకుండా లౌడ్ స్పీకర్ పెట్టి మాట్లాడమని సూచించాలి.
- పిల్లలెప్పుడూ పెద్దలనే ఫాలో అవుతూ ఉంటారు. కాబట్టి సెల్‌ఫోన్ వినియోగం మనం తగ్గించి, మన పిల్లలనూ మొబైల్‌కు దూరంగా ఉంచాలి.

జీవన సౌరభం

ఆవేశపరుడు ముందు మాట్లాడి తర్వాత ఆలోచిస్తాడు. వివేకవంతుడు ముందు ఆలోచించి తర్వాత మాట్లాడతాడు.

మీ కోసం



మైక్రోఒవెన్‌లో దుర్వాసన రాకుండా బేకింగ్‌సోడా ముంచిన స్పాంజితో తుడవాలి.

గోరింటా చెరిగీ పోవునులే ..!!



ఎర్రగా పండిన గోరింటాకు చేతులు అంటే అందరికీ ఇష్టమే! వెంట వెంటనే గోరింటాకు పెట్టుకోవడం సాధ్యం కాదు. ఎందుకంటే చేతికి ఉన్న డిజైన్ పోతేగానీ కొత్తగా గోరింటాకును పెట్టుకోలేం. కానీ కొన్ని చిట్కాలు పాటిస్తే గోరింటాకును ఎన్నిసార్లయినా పెట్టుకోవచ్చు.

ఉప్పు నీరు: గోరువెచ్చని నీటిలో ఉప్పు వేసి, మన చేతులను 20 నిమిషాల పాటు అందులో ఉంచాలి. లేదంటే నీరు చల్లబడే వరకూ చేతులను ఉంచాలి. ఎక్కువసేపు మన చేతులు ఉప్పునీటిలో ఉన్నందువల్ల పొడిగా మారవచ్చు. కాబట్టి ఒక మంచి మాయిశ్చరైజర్‌ను వాడాలి.

బ్లీచ్ : గోరింటాకు పెట్టుకున్న ప్రాంతంలో మంచి నాణ్యత కలిగిన బ్లీచ్‌ను రాయాలి. ఆరిన తర్వాత చల్లని నీటితో శుభ్రంగా కడగాలి.

హ్యాండ్ వాష్: గోరింటాకు త్వరగా పోవాలంటే రోజులో 10 నుంచి 12 సార్లు తరచుగా చేతులను కడగాలి. హ్యాండ్‌వాష్ మెహందీ రంగును తగ్గించటానికి సహాయపడుతుంది. ఎక్కువసార్లు మన చేతులను కడగటం వలన పొడిగా మారవచ్చు. కాబట్టి మన చేతులను కడిగిన ప్రతిసారీ మంచి మాయిశ్చరైజర్‌ను రాయటం మర్చిపోకూడదు.

బేకింగ్ సోడా : బేకింగ్ సోడాలో నిమ్మరసం కలిపి పేస్ట్‌గా చేసి, గోరింటాకుపై రాయాలి. అది పొడిగా మారిన తర్వాత చల్లని నీటితో కడగాలి.

టూత్ పేస్టు: టూత్ పేస్టులో ఉన్న కొన్ని లక్షణాలు పండిన గోరింటాకు త్వరగా పోవటానికి సహాయం చేస్తాయి. టూత్ పేస్టును గోరింటాకుపై అప్లైచేసి, ఆరిన తర్వాత వేగంగా మన చేతులను రబ్ చేయాలి. ఆ తర్వాత చల్లని నీటితో కడగాలి.

ఆలివ్ నూనె: ఆలివ్‌నూనె గోరింటాకు రంగును తొలగించడానికి సహాయపడుతుంది. ఆలివ్‌నూనెలో



కొంచెం ఉప్పు కలిపి, చేతుల మీద రాయాలి. పది నిమిషాల తర్వాత మరోసారి ఆలివ్‌నూనె చేతులపై రాయాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో చేతులు శుభ్రం చేసుకోవాలి. రెండురోజుల్లో మన చేతులకు ఉన్న గోరింటాకు పూర్తిగా తొలగిపోతుంది. ★

సెన్సెక్స్ 113
34,082

నిఫ్టీ ⬇ 22
10,476

రూపాయి ⬇ 03 పై॥
అమెరికా డాలరుకు రూ.
64.28

కియా మోటో ప్రవేశం..

దక్షిణ కొరియాకు చెందిన కియా మోటార్స్ కొత్తగా భారత మార్కెట్లోకి ప్రవే శించింది. ఈ కంపెనీ పోర్టుపోలియోలో ని 16 మోడళ్లను ఎక్స్‌పోలో ఉంచింది. 2019 రెండో అర్ధభాగంలో ఈ ఎస్‌యూవీ విక్రయాలు చేపట్టనున్నాం' అని కియా మోటార్స్ సిఇఒ హన్‌కో పార్క్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవలే ఏర్పాటు చేసిన తయారీ కేంద్రం నుంచి ఈ ఎస్‌పీ కాన్సెప్ట్ ఎస్‌యువిని విడుదల చేయనున్నారు.



రెనాల్ట్ 'ట్రెజర్'

ఫ్రెంచ్‌కు చెందిన రెనాల్ట్ రెండు విద్యుత్ కాన్సెప్ట్ కార్లు ట్రేజర్, జోలను ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శించింది. భారత్‌లో విద్యుత్ వాహన విధానం వెల్లడి తర్వాత రోడ్‌మ్యాప్‌ను ప్రకటించనున్నట్లు పేర్కొంది.



ఆర్‌బిఐ మూడో 'సారీ'

వడ్డీ రేట్లు యధాతథం

ప్రజాశక్తి - బిజినెస్ డెస్క్



రిజర్వు బ్యాంకు మరో మారు రుణ గ్రహీతలు, పెట్టుబడిదారులను నిరాశకు గురి చేసింది. వరుసగా మూడో సారి వడ్డీ రేట్లను యథా తథంగా నిర్ణయించింది. దేశంలో ద్రవ్యోల్బణ భయాలు పొంచి ఉన్న నేపథ్యంలో వడ్డీ రేట్ల తగ్గింపునకు ప్రధాన అడ్డంకిగా మారాయి. రిజర్వు బ్యాంకు గవర్నర్ ఉర్జిత్ పటేల్ అధ్యక్షతన జరిగిన మానిటరీ పాలసీ కమిటీ (ఎంపిసి) భేటీలో కీలక వడ్డీ రేట్లను యథాతథంగా నిర్ణయించారు. గతేడాది ఆగస్టులో జరిగిన సమీక్షలో చివరి సారిగా వడ్డీ రేట్లను పావు శాతం తగ్గించారు. తాజా భేటీలో రెపో రేటును 6 శాతంగానే కొనసాగించింది. రివర్స్ రెపో రేటును కూడా 5.75శాతం వద్దనే ఉంచింది. బుధవారంతో ముగిసిన 6వ ఎంపిసి భేటీలో ఐదుగురు సభ్యులు వడ్డీ రేట్ల యథాతథానికి ఓటు వేయగా, ఒక్కరు మాత్రం 0.25 బేసిస్ పాయింట్లు పెంచాలని కోరారు.

వృద్ధి రేటు 6.6 శాతమే..!

2018-19లో ప్రథమార్థం (హెచ్1)లో ద్రవ్యోల్బణం సూచీ 5.1-5.6 శాతానికి చేరొచ్చని తాజా ఎంపిసి భేటీలో ఆర్‌బిఐ అంచనా వేసింది. ఈ రిపోర్టు ప్రకారం ద్వితీయార్థంలో 4.5-4.6 శాతానికి తగ్గొచ్చని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చితో ముగియనున్న నాలుగో త్రైమాసికంలో ద్రవ్యోల్బణం సూచీ 5.1 శాతానికి చేరొచ్చు. ముఖ్యంగా ఈ మూడు నెలల కాలంలో అంతర్జాతీయంగా చమురు ధరల ప్రభావం దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుదలకు కారణం కావొచ్చని విశ్లేషించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2017-18లో భారత వృద్ధి రేటు 6.6 శాతంగా నమోదు కావొచ్చు. జిఎస్‌టి స్థిరత్వంలోకి వస్తే వచ్చే ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 7.2 శాతానికి చేరొచ్చని అంచనా వేసింది. పెట్టుబడులతో పాటు ఎగుమతుల డిమాండ్ పుంజుకోవచ్చని పేర్కొంది. వచ్చే ఎంపిసి భేటీ ఏప్రిల్ 4,5న నిర్వహించాలని ఆర్‌బిఐ నిర్ణయించింది.

మళ్లీ 'బేర్'మన్న మార్కెట్లు



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా ఏడో సెషన్‌లోనూ పతనాన్ని చవి చూశాయి. 2017-18లో భారత వృద్ధి రేటు 6.6 శాతానికి పరిమితం కావొచ్చన్న రిజర్వు బ్యాంకు అంచనాలు బుధవారం దలాల్ స్ట్రీట్‌పై ఒత్తిడిని పెంచాయి. ఇప్పటికే ఎల్‌టిసిజి పన్ను నుంచి కోలుకోని మార్కెట్లకు ఆర్‌బిఐ నిర్ణయాలు మరింత ఆజ్యం పోశాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 470 పాయింట్ల పతనంతో మొదలయ్యింది. కాని కొన్ని అంతర్జాతీయ సానుకూల పరిణామాలతో అనంతరం కొంత పుంజుకుని తుదకు 113.23 పాయింట్లు లేదా 0.33 శాతం క్షీణించి 34,082.71కి దిగజారింది. ఇంతక్రితం ఆరు సెషన్లలో ఈ సూచీ 2,087 పాయింట్లు పతనమయ్యింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 21.55 పాయింట్లు లేదా 0.21 శాతం తగ్గి 10,476.70 వద్ద ముగిసింది. ఇంట్రా ట్రేడింగ్‌లో 10,614-10,446 మధ్య కదలాడింది. మంగళవారం సెషన్‌లో భారీ నష్టాలను ఎదుర్కొన్న ప్రపంచ మార్కెట్లు బుధవారం పుంజుకున్నాయి. అయినా భారత మార్కెట్లకు మద్దతు లభించలేదు.

రిజర్వు బ్యాంకు వృద్ధి రేటు అంచనాలు అంతంత మాత్రంగా నే ఉండటంతో పాటు వడ్డీ రేట్లను యథాతథంగా ప్రకటించడంతో మదు పర్లు నిరుత్సాహానికి గురైయ్యారు. బిఎస్‌ఇలో భారతీ ఎయిర్‌టెల్ 2.03 శాతం, విప్రో 1.85 శాతం, యస్ బ్యాంకు 1.58 శాతం, ఎల్‌అండ్‌టి 1.58 శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1.37 శాతం, టిసిఎస్ 1.34 శాతం చొప్పున అధిక నష్టాలు చవి చూసిన వాటిలో ముందు వరుసలో ఉంది. కాగా కోల్ ఇండియా 2.48 శాతం, ఒఎన్‌జిసి 2.24 శాతం, టాటా మోటార్స్ 0.81 శాతం, ఆసియన్ పెయింట్స్ 0.91 శాతం చొప్పున అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. రంగాల వారిగా టెక్ 0.72 శాతం, ఐటి 0.68 శాతం, బ్యాంకింగ్ 0.59 శాతం, కాపిటల్ గూడ్స్ 0.54 శాతం చొప్పున నష్టపోయి మార్కెట్లను ఒత్తిడికి గురి చేశాయి.

సదరన్ ట్రావెల్స్ హాలిడే బజార్ ఆఫర్

విశాఖపట్నం : సదరన్ ట్రావెల్స్ పర్యాటకులను ఆకర్షించడానికి డిస్కౌంట్లతో హాలిడే బజార్‌ను నిర్వహిస్తుందని ఆ సంస్థ డైరెక్టర్ రామా రావు తెలిపారు. విశాఖపట్నంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని ఆరు పట్టణాల్లో హాలిడే బజార్ క్యాంపెయిన్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 10,11 తేదిల్లో విశాఖపట్నం, గాజువాక, శ్రీకాకుళం, విజయనగరం, రాజమండ్రీ, కాకినాడలో హాలిడే బజార్ క్యాంపెయిన్ జరగనుందన్నారు. ఇది వరకు ఎప్పుడూ లేని విధంగా ఇందులో డిస్కౌంట్ ఆఫర్లను అందిస్తున్నామని పేర్కొన్నారు. దేశంలోని అన్ని ప్రముఖ నగరాలు, పుణ్య క్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు తమ సేవలు లభిస్తాయ్నారు. అదే విధంగా అంతర్జాతీయంగా కూడా ముఖ్యమైన అన్ని పర్యాటక ప్రాంతాలకు ప్యాకేజీలు అందిస్తున్నామని తెలిపారు.

విజయవాడకు ఇండిగో సేవలు

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

చౌక ధరల విమానయాన సంస్థ ఇండిగో తన సేవలను విజయవాడకు విస్తరించింది. తమ 50వ గమ్యస్థానంగా ఈ కేంద్రాన్ని ఎంచుకున్నామని ఇండిగో చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ సంజయ్ కుమార్ తెలిపారు. ఇక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ మార్చి 2 నుంచి తాము విజయవాడ, బెంగళూరు, హైదరాబాద్, చెన్నయ్‌లతో కనెక్టివిటీని అందించనున్నామన్నారు. ఎపిలో ఇప్పటికే తిరుపతి, రాజమండ్రి విమానశ్రయాల నుంచి తాము సేవలు అందిస్తున్నామన్నారు. కొత్తగా విజయవాడ నుంచి ప్రతీ రోజు మూడు విమానాలను హైదరాబాద్‌కు నడపనున్నామన్నారు. బెంగళూరు, చెన్నయ్‌లకు రోజుకు ఒక్క విమానాన్ని అందుబాటులోకి తెస్తున్నామన్నారు.

ఎయిర్‌బస్ ఎ320 నియో ఎయిర్‌క్రాఫ్టులను ఇందుకు ఉపయోగించనున్నామని చెప్పారు. విజయవాడ నుంచి తమ సేవలు పరిచయం చేయడంపై సంజయ్ సంతోషం వ్యక్తం చేశారు.

అట్టహాసంగా ఆటో ఎక్స్‌పో

- కొత్త వాహనాలతో సందడి

న్యూఢిల్లీ : గ్రేటర్ నోయిడాలో వాహన ప్రదర్శన అబ్బు రపరుస్తోంది. ఐదు రోజుల పాటు జరగనున్న 14వ ఆటో ఎక్స్‌పో 2018లో వివిధ ఆటో మొబైల్ కంపెనీలు కొత్తగా రూపొందించిన వాహనాలను ప్రదర్శనకు పెట్టాయి. తొలిరోజు బుధవారం నాడు ది మోటార్ షో ప్రీ ఒపెన్ ఈవెంట్‌లో పలు కంపెనీల కొత్త మోడళ్ళు ఆకర్షి స్తున్నాయి. ఫిబ్రవరి 9-14వ తేదీవరకు ఈ ప్రదర్శన కొనసాగనుంది.


మారుతి 'ఫ్యూచర్ ఎస్'

దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి కొత్తగా ఫ్యూచర్ ఎస్ కాన్సెప్ట్ కారును ఆవిష్కరించింది. ఇది కాంపాక్ట్ కార్ల వినియోగదారుల సహజ ఎంపికగా ఉండబోతోందన మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ సిఎండి కెన్చి అయుకవా పేర్కొన్నారు. హెూండా కార్స్ ఇండియా ఆటో ఎక్స్‌పోలో హెూండా స్పోర్ట్స్ ఇవిని ఆవిష్కరించింది. అశోక్ లేలాండ్ తయారు చేసిన విద్యుత్ బస్సులను ప్రదర్శించింది. ఇవి కేవలం 7 నిమిషాల్లోనే ఛార్జింగ్ అవుతాయి. టాటా మోటార్స్ టియాగో జెపి, టిగోర్ జెపి మోడళ్లను ప్రదర్శించింది.

సరికొత్త బైకులు..

దేశంలోనే అతిపెద్ద ద్విచక్ర వాహన కంపెనీ హీరో మోటో కార్ప్ స్కూటర్ సెగ్మెంట్‌లో రెండు, మోటార్ సైకిల్ విభాగంలో ఒక్క మోడల్ చొప్పున ప్రదర్శించింది. కొత్తగా ఎక్స్‌పల్స్ 200ను ఆవిష్కరించింది. వీటిని ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ పవన్ ముంజల్ విడుదల చేశారు. ప్రముఖ వెస్పా స్కూ టర్ల తయారీ సంస్థ పియాజియో ఏప్రిలియా ఎస్ఆర్ 125ను ఆవిష్కరించింది. దీని ధర రూ.65,310గా నిర్ణయించింది.

ఉపాధి



ఎ. ఉమామహేశ్వరరావు
సబ్జెక్టు నిపుణులు, తెనాలి.
సెల్ : 9985288150

టెట్, డీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

మానవునిలో లోపించిన ఎముక?

మానవ శరీర ధర్మ శాస్త్రం

అస్థిపంజర వ్యవస్థ : జీవులలో అంతర లేదా బాహ్యంగా ఉండే గట్టి, దృఢమైన ఆకారం, రక్షణ నిచ్చే నిర్మాణం, అస్థిపంజరం ఇది జీవులలో రెండు రకాలు :

1. బాహ్య అస్థిపంజరం (ఎక్సో స్కెలిటన్)
2. అంతర అస్థిపంజరం (ఎండో స్కెలిటన్)

1. బాహ్య అస్థిపంజరం

ఇది దృఢమైన, రక్షణనిచ్చే బయటి నిర్జీవ పొర

ఉదా : నత్తలు, ఆల్చిప్ప, ప్రవాళాల కర్పరం, కీటకాల స్క్లీరైట్లు, సకశేరుకాల వెంట్రుకలు, గోర్లు, కొమ్ములు, ఈకలు, చేపల పొలుసులు, కోడిగుడ్డు పెంకు.

2. అంతర అస్థిపంజరం

ఇది శరీరం లోపల ఉండి శరీరానికి నిర్దిష్ట ఆకారాన్ని, యాంత్రిక ఆధారాన్ని ఇస్తుంది.

దీనిలో రెండు రకాల ఎముకలు ఉన్నాయి. అవి :

1. మృదులాస్థి (కార్టిలేజ్)
2. అస్థి (బోన్)

1. మృదులాస్థి (కార్టిలేజ్)

- ★ మెత్తగా ఉండే ఎముకలను మృదులాస్థులు అంటారు.
- ★ మృదులాస్థుల అధ్యయనాన్ని 'కాండ్రాలజి' అంటారు.
- ★ మృదులాస్థులలోని ప్రోటీన్ : కాండ్రిన్
- ★ దీనిలో ఉండే కణాలు - కాండ్రోసైట్స్
- ★ ఇవి సాగే గుణం కలిగి చలనానికి సహాయపడతాయి.

ఇవి ఉండే ప్రదేశాలు :

1. వెలుపలి చెవి (పిన్నా)
2. ముక్కు కొన/ నాసికాగ్రం
3. కొండనాలుక/ ఉపజిహ్విక (ఎపిగ్లాటిస్)
4. వాయునాళంలోని ఉంగరం/ సి ఆకారపు నిర్మాణాలు

2. అస్థి (బోన్)

- ★ గట్టిగా, దృఢంగా ఉండే ఎముకను 'అస్థి' అంటారు.
- ★ వీటి అధ్యయనాన్ని ఆస్టియాలజీ అంటారు.
- ★ వీటిలో ఉండే కణాలు - ఆస్టియోసైట్స్
- ★ మానవునిలోని మొత్తం ఎముకల సంఖ్య 206.
- ★ పుట్టినప్పుడు చిన్నపిల్లల్లో సుమారు 300 వరకూ ఎముకలు ఉంటాయి.
- ★ అతిపెద్ద, పొడవైన ఎముక : **ఫీమర్/ తొడ ఎముక**
- ★ అతిచిన్న ఎముక : **స్టెఫిస్ (లేక) కర్ణాంతరాస్థి.**
- ★ పుర్రెలో అతి గట్టిది : **కింది దవడ (లోవర్ జా)**
- ★ మానవునిలో అతి గట్టి ఎముక **- ఫీమర్**
- ★ కప్పలో అతిపెద్దది **- టిబియో - ఫిబ్యులా**
- ★ ఎముకలు దృఢంగా ఉండడానికి కారణం క్యాల్షియం (సిఎ), ఫాస్పరస్ (పి). ఇవి క్యాల్షియం ఫాస్పేట్, క్యాల్షియం కార్బొనేట్ రూపాలలో ఉంటుంది.
- ★ క్యాల్షియం ఫాస్పేట్ ఎక్కువగా ఉంటుంది.
- ★ ఫాస్ఫరస్‌కు మండే స్వభావం ఉండటం వల్ల శవాలను కాల్చినపుడు కాంతివంతంగా ఉంటాయి.

1. తల : దీనిలోని ఎముకలన్నింటినీ కలిపి **'పుర్రె'** అంటారు. ఇది నాలుగు భాగాలు

1. కపాలం - 8
2. ముఖం - 14
3. చెవి - 6 (3+3)
4. నాలుక కింద - 1

మొత్తం - 29

- ★ కపాల అధ్యయనాన్ని క్రేనియాలజీ అంటారు.
- ★ తలలో కదిలే ఎముకలు - 1 (కింద దవడ)
- ★ కదలని ఎముకలు - 28

మొత్తం - 29

- ★ ముఖము (సౌందర్యం) అధ్యయనం : **కాలాలజి**
- ★ అందవిహీనులకు భయపడడం **- కాలోఫోబియా**

2. చెవి : దీని అధ్యయనాన్ని **'ఓటాలజీ'** అంటారు.

- ★ ఇది ఒక జ్ఞానేంద్రియం
- ★ ఎముకల సంఖ్య : 6 (3+3)

ఎ. మాలియస్
బి. ఇంకస్
సి. స్టెపిస్

3. నాలుక కింద : 1 (హయాయిడ్ ఎముక)

నోట్ : ఉరి వేసినపుడు విచ్చిత్తి చెందుతుంది.

4. భుజవలయం : (షోల్డర్ గిర్డిల్) : 4 (రెండు జతలు)

వీటిలోని ఎముకలు

ఎ. కాలర్ బోన్ (క్లావికిల్)
బి. షోల్డర్ బోన్ (స్కాప్యులా)

5. చేతులు : 60 (30+30)

ఎ. భుజం : **3 ఎముకలు (హ్యూమరస్ + రేడియస్ + అల్నా)**
బి. మణికట్టు (ద్రిష్ట) : **ఎనిమిది**
సి. అరచేయి (పామ్) : **ఐదు**
డి. వేళ్లు (ఫింగర్స్/ కార్పల్స్) : **14**

6. వెన్నెముక (బ్యాక్‌బోన్) : 26 (చిన్నపిల్లల్లో 33)

7. పక్కటెముకలు (రిబ్స్) : 24 (12 జతలు)

8. రొమ్ము ఎముక (స్టోర్నమ్) : 1

9. కటివలయం (పెల్విక్ గిర్డిల్) : రెండు (1 జత)

10. కాళ్లు : 60 (30+30)

ఎ. కాలు : **నాలుగు (పటెల్లా + ఫీమర్ + టీబియో + ఫిబ్యులా)**
బి. చీలమండ (యాంకిల్) : **ఏడు**
సి. అరికాలు : **ఐదు**
డి. వేళ్లు (టార్సెల్స్) : **14**

ఎముకలు ఉండే ప్రదేశాలు

ఎ. కపాలం + ముఖం - 22 (8+14)
బి. చెవి - ఆరు
సి. నాలుక కింద - ఒకటి
డి. భుజవలయం - నాలుగు (రెండు జతలు)
ఇ. చేతులు - 60 (30+30)
ఎఫ్. వెన్నుముక - 26
జి. పక్కటెముకలు - 24
హెచ్. రొమ్ము ఎముక - ఒకటి
ఐ. కటివలయం - రెండు (ఒక జత)
జె. కాళ్లు - 60 (30+30)

మొత్తం - 206

వ్యాధులు

1. ఆర్థరైటిస్ : ఇది సాధారణ కీళ్లనొప్పి. దీనిని నివారించడానికి **'తేనెటీగల'** విషాన్ని మందుగా వాడతారు.

2. స్పాండిలైటిస్ : వెన్నునొప్పి



3. రుమటాయిడ్ అర్థరైటిస్ : కీళ్ల మధ్య **'సైనోనియల్'** ద్రవమును చుట్టూ ఉండే సైనోవియల్ త్వచం వాయడం, మృదులాస్థిపై దృఢమైన కణజాలం ఏర్పడడం వల్ల తీవ్రమైన కీళ్లనొప్పి ఉండడం. ఇది 20-40 సంవత్సరాల మహిళల్లో చాలా తరచూ కనబడుతుంది.

4. రికెట్స్ : చిన్న పిల్లల్లో 'డి' విటమిన్ లోపం వల్ల ఎముకలు వంగడం.

5. ఆస్థియోమలేషియా : పెద్దవారిలో 'డి' విటమిన్ లోపం వల్ల ఎముకలలో క్యాల్షియం, ఫాస్పరస్ లోపించి మెత్తగా మారడం.

6. ఆస్టియోపోరోసిస్ : 'పారాథార్మోన్' అధికస్రావం వల్ల ఎముకలపై రంధ్రాలు పడి క్యాల్షియం, ఫాస్పరస్ బయటికి రావడం వల్ల ఎముకలు పెళుసుగా మారతాయి.

7. గౌట్ : రక్తంలో, కీళ్లల్లో 'యూరిక్ ఆమ్ల స్ఫటికలు' (సోడియం బైయూరేట్) పేరుకొని పోవడం వల్ల కలిగే కీళ్ల నొప్పి. దీనివల్ల వాపు, జ్వరం, చలి, టాకీకార్డియా వంటి లక్షణాలు కనపడతాయి.

నోట్ : ఈ వ్యాధి చికిత్సలో వాడే రసాయనం **- కాల్చిసిన్.**

8. ఆస్టియో ఆర్థరైటిస్ : కీళ్ల మధ్య ఉన్న మృదులాస్థి నశించడం, సైనోవియల్ ద్రవం తగ్గడం.

9. ఫ్లోరోసిస్ : నీటిలో ఫ్లోరిన్ అధికం కావడం వల్ల దంతాలు పసుపు రంగులోకి, ఎముకలు వికృత రూపాలలోకి మారడం.

- ★ నేషనల్ క్యాన్సర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అండ్ డబ్ల్యూహెచ్ఓ వారి ప్రకారం ప్రతి వ్యక్తికి కావాల్సిన ఫ్లోరిన్ పరిమాణం - 1 మి.గ్రా/లీటర్
- ★ నీటిలో ఉండాల్సిన సాధారణ ఫ్లోరిన్ పరిమాణం - 0.7 మి.గ్రా -1.2 మి.గ్రా/లీటర్

అస్థిపంజరం విధులు

1. శరీరానికి ఆకారం, నిర్మాణం ఇవ్వడం
2. సున్నిత అవయవాలకు రక్షణ
3. ఆర్‌బిసి, డబ్ల్యూబిసిల ఉత్పత్తి
4. చలనానికి సహాయం
5. మూలకాలు, కొవ్వు నిల్వ
6. అస్థిమజ్జలోని ఎరిత్రోపాటియిన్ అనే ప్రోటీన్ వల్ల రక్తం ఉత్పత్తవుతుంది.

కీళ్లు (జాయింట్స్)

- ★ రెండు లేదా ఎక్కువ ఎముకలు **'లిగమెంట్'** అనే పట్టీల సహాయంతో అతికే ప్రదేశాన్ని **'కీలు'** అంటారు.
- ★ వీటి అధ్యయనాన్ని ఆంథ్రాలజీ అంటారు.
- ★ ఇవి ముఖ్యంగా నాలుగు రకాలు

ఎ. బంతిగిన్ని కీలు (బాల్ అండ్ సాకెట్) **- భుజము**
బి. మడతబందు కీలు (హింజ్ జాయింట్) **- మోచేయి, మోకాలు**
సి. జారెడు కీలు (గ్లైడింగ్ జాయింట్) **- వెన్నెముక, మణికట్టు**
డి. బొంగరపు కీలు (పివోట్ జాయింట్) **- మెడ**

- ★ ఫాస్ట్ బౌలర్స్ ఎక్కువగా ఉపయోగించే కీలు **- బంతిగిన్నె కీలు, మడతబందు కీలు.**
- ★ స్పిన్ బౌలర్స్ ఎక్కువగా ఉపయోగించే కీలు **- బంతిగిన్నె కీలు, మడతబందు కీలు, జారుడు కీలు**
- ★ భరతనాట్యం, కూచిపూడి, నాట్యకారులు ఎక్కువగా ఉపయోగించే కీలు **- బొంగరపుకీలు**

కండరాలు (మజిల్స్)

- ★ వీటి అధ్యయనాన్ని 'మయాలజి/సార్కాలజీ' అంటారు.
- ★ వీటి కదలికల అధ్యయనాన్ని 'కైనిసాలజి' అంటారు.
- ★ **ముఖ్యనిధి :** సంకోచ, సడలికలు చెంది ఎముకలను కదల్చడం
- ★ వీటి మొత్తం సంఖ్య : **639**
- ★ అతిపెద్ద కండరం : **గ్లుటియస్ మాక్జిమస్ (పిరుదు కండరం)**
- ★ అతి చిన్న కండరం : **స్టెపీడియస్ (చెవి కండరం)**
- ★ అతి పొడవైన కండరం : **సార్టోరియస్ (తొడ కండరం)**
- ★ అతి బలమైన కండరం : **మాసెటర్ (దవడ కండరం)**
- ★ కండర సంకోచానికి ఉపయోగపడే మూలకాలు : **కె, సిఎ**
- ★ దీనిని వివరించే సిద్ధాంతం **'స్లైడింగ్ ఫిలమెంట్ థియరీ'**
- ★ దీనిని ప్రతిపాదించినది : **హక్సలే.**
- ★ కండరాలకు వచ్చే క్యాన్సర్ : **సర్‌కోమా/ మయోమా**
- ★ కండరాలలో ఉండే వర్ణకం : **మయోగ్లోబిన్ (రెడ్)**

కండరాల మూడు ముఖ్య లక్షణాలు

ఎ. టిటాని, బి. కండర గ్లాని, సి. రిగర్ మోర్టిన్

1. టిటాని : టిటాని అనగా 'పారాథార్మోన్' తక్కువ స్రావం వల్ల కండరాలు ఎల్లప్పుడు సంకోచం చెందడం. దీనివల్ల ఎముకలు కదలవు.

- ★ ఇది క్యాల్షియం లోపం వల్ల, పాస్పరస్ ఎక్కువ కావడం వల్ల సాధారణంగా కనబడును.

2. కండర గ్లానీ : (మజిల్ ఫ్యాటిగ్యూ) కండరాలు ఎల్లప్పుడూ పనిచేయడం వల్ల వాటికి సరైన ఆక్సిజన్ అందక అవాయుశ్వాసక్రియ జరుపుకొని 'లాక్టిక్ ఆమ్లం' ఏర్పరచడం వల్ల కండరాలు అలసట చెందుతాయి.

3. రిగర్ మోర్టిన్ : జీవి చనిపోయిన తర్వాత దానిలో ఎటిపి ఉత్పత్తి కాకపోవడం వల్ల ఆక్టిన్, మయోసిన్ అనే కండరాల ప్రోటీన్స్ పనిచేయక శరీరం గట్టిగా మారడం.

కండరాలు రకాలు :

1. అస్థి/ నియంత్రిత కండరాలు (వాలంటరీ / స్కెలిటల్) : ఇవి ఎముకలను అతుక్కుని కదలికలకు తోడ్పడతాయి.

- ★ వీటిపై చారలు ఉంటాయి. కాబట్టి రేఖిత కండరాలు అంటారు.

ఉదా : చేతి, కాలి కండరాలు

2. నునుపు / అనియంత్రిత కండరాలు (స్మూత్/ ఇన్వోలెంటరీ) : వీటిని అరేఖిత కండరాలు అంటారు.

- ★ ఇవి నియంత్రించలేనివి.

ఉదా : పేగు, జీర్ణాశయం, మూత్రాశయం, గర్భాశయం, కంటిలోని కండరం.

3. హృదయ కండరాలు (కార్డియాక్ మజిల్స్) : ఇవి హృదయంలో ఉంటాయి.

- ★ ఇవి నిర్మాణరీత్యా రేఖిత కండరాలను, క్రియరీత్యా అరేఖిత కండరాలను పోలి ఉంటాయి. ★

నమూనా ప్రశ్నలు

1. కపాలం ఎముకల అధ్యయనం ?
ఎ. ఆస్టియాలజీ బి. కాలాలజీ
సి. క్రానియాలజీ డి. ఓటాలజీ

2. చెవిలోని ఎముకల సంఖ్య ?
ఎ. రెండు బి. మూడు
సి. నాలుగు డి. ఆరు

3. తేనెటీగల విషాన్ని ఏ వ్యాధికి మందుగా వాడతారు ?
ఎ. స్పాండిలైటిస్ బి. రికెట్స్
సి. ఆర్థరైటిస్ డి. గేట్

4. చిన్న పిల్లల్లోని మొత్తం ఎముకల సంఖ్య ?
ఎ. 206 బి. 300 సి. 439 డి. 639

5. నీటిలో ఉండాల్సిన సాధారణ ఫ్లోరిన్ పరిమాణం (మిగ్రా/లీటర్) ?
ఎ. 0.1-07 బి. 0.7-1.2
సి. 1-1.5 డి. 2

6. స్పిన్ బౌలర్ ఎక్కువగా ఉపయోగించే కీలుకానిది ?
ఎ. బంతిగిన్నె కీలు బి. మడతబందు కీలు
సి. జారెడు కీలు డి. బొంగరపు కీలు

7. నాట్యంచేసేవారు అభినయించడానికి ఉపయోగించే కీలు ?
ఎ. బొంగరపు కీలు బి. మడతబందు కీలు
సి. జారెడు కీలు డి. బంతిగిన్నె కీలు

8. కీళ్ల మధ్య ఉన్న సెనోవియల్ ద్రవం అరిపోవడం వల్ల కలిగే వ్యాధి ?
ఎ. రికెట్స్ బి. ఆర్థరైటిస్
సి. ఆస్టియో ఆర్థరైటిస్ డి. ఫ్లోరోసిస్

9. తాళం వేసినప్పుడు, తీసినప్పుడు, వంగినప్పుడు ఎక్కువగా పనిచేసే కీలు ?
ఎ. జారెడు కీలు బి. మడతబందు కీలు
సి. బొంగరపు కీలు డి. బంతిగిన్నె కీలు

10. రక్తంలో యూరిక్ ఆమ్ల స్ఫటికాలు పేరుకుపోవడం వల్ల వచ్చే వ్యాధి ?
ఎ. గేట్ బి. రికెట్స్
సి. ఫ్లోరోసిస్ డి. ఆర్థరైటిస్

11. చనిపోయిన వ్యక్తి శరీరంలో ఆక్టిన్, మయోసిన్ కండరాలు పనిచేయకపోవడం వల్ల శరీరం గట్టిపడే స్థితి ?
ఎ. రికెట్స్ బి. టిటాని
సి. రిగర్ మెర్టిస్ డి. కండర గ్లానీ

12. ఒక వ్యక్తి పరిగెత్తి అలసిపోయినప్పుడు శరీర కండరాలలో ఈ ఆమ్లం ఉత్పత్తి వల్ల నొప్పులు కలుగుతాయి ?
ఎ. పైరువిక్ ఆమ్లం బి. లాక్టిక్ ఆమ్లం
సి. మాలిక్ ఆమ్లం డి. పామిటిక్ ఆమ్లం

13. మానవునిలో లోపించిన ఎముక ?
ఎ. హ్యూమరస్ బి. ఆస్ట్రాగెలస్
సి. టిబియో డి. ఫిబ్యులా

14. స్లైడింగ్ ఫిలమెంట్ సిద్ధాంతం వేటి చలనాలను వివరిస్తుంది ?
ఎ. ఎముకలు బి. మృధులాస్థి
సి. అస్థి డి. కండరాలు

15. కండరాలకు వచ్చే క్యాన్సర్ ?
ఎ. కార్సినోమా బి. ల్యూకేమియా
సి. సార్కోమా డి. ఎనిమియా

సమాధానాలు : 1.సి, 2.డి, 3.సి, 4.బి, 5.బి, 6.డి, 7.ఎ, 8.సి, 9.ఎ, 10.ఎ, 11.సి, 12.బి, 13.బి, 14.డి, 15.సి.

సీనియర్ రెసిడెంట్ల సమ్మె విరమణ

ప్రజాశక్తి - నెల్లూరు అర్బన్

నెల్లూరు నగరంలోని సర్వజన ఆస్పత్రిలో సీనియర్ రెసిడెంట్లు (బుధవారం సమ్మె విరమించారు. ఆరు నెలల నుంచి వారికి చెల్లించాల్సిన గౌరవ వేతనం అందడం లేదు. ఈ కారణంగా వారు ఆరు రోజుల నుంచి విధులను బహిష్కరించిన సంగతి తెలిసిందే. రోగులు ఇబ్బందులకు గురి కావడంతో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ చాట్ల నరసింహారావు జోక్యం చేసుకుని సంబంధిత అధికారుల తో సంప్రదింపులు జరిపారు. దాంతో వారికి మూడు నెలల గౌరవ వేతనాన్ని విడుదల చేశారు. బకాయి వేతనాలను తర్వాత ఇస్తామని హామీ ఇవ్వడంతో సీనియర్ రెసిడెంట్లు సమ్మెను విరమించారు. చాట్ల మాట్లాడుతూ సమస్యను మంత్రి కామినేని శ్రీనివాస్, కలెక్టర్ ముత్యాలరాజు దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. వారు స్పందించి సమస్యను పరిష్కరించారని తెలిపారు.



రాస్తారోకో సమస్యల పరిష్కారం కోసం తూర్పుగోదావరి జిల్లా ఉప్పాడ, పిఠాపురం రోడ్డులో బుధవారం సిపిఎం ఆధ్వర్యాన రాస్తారోకో చేస్తున్న బాధిత రైతులు

కాకినాడ సెజ్ రైతుల నిరసన

అడ్డుకున్న పోలీసులు - సిపిఎం ఆధ్వర్యాన ప్రదర్శన, రాస్తారోకో, ధర్నా

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి (తూర్పుగోదావరి)

సమస్యల పరిష్కారం కోసం తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద వంటావార్పుతో నిరసన తెలిపేందుకు బుధవారం బయల్దేరిన యు.కొత్తపల్లి రమణక్కపేటకు చెందిన సెజ్ రైతులను పోలీసులు అడ్డుకున్నారు. దీనికి నిరసనగా సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దువ్వా శేషబాబ్జి ఆధ్వర్యాన రమణక్కపేట నుంచి యు.కొత్తపల్లి తహశీల్దార్ కార్యాలయం వరకూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఉప్పాడ- పిఠాపురం రోడ్డుపై రాస్తారోకో చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దువ్వా శేషబాబ్జి మాట్లాడుతూ.. ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తే ఉవ్వెత్తున ఎగసిపడేలా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. సెజ్ బాధిత రైతుల భూములను వెనక్కి ఇచ్చే వరకూ పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. కాకినాడ వెళ్లే సెజ్ బాధిత రైతులను అడ్డుకోవడం ప్రజావ్యతిరేక చర్య అని అన్నారు. రమణక్కపేటలో వందల ఎకరాల్లో అక్రమంగా రొయ్యల చెరువులను తవ్వి, గ్రామాన్ని అనారోగ్యం పాలుచేస్తున్నారని, పంటభూమిని నాశనం చేస్తున్నారని విమర్శించారు. అధికారులు మొద్దునిద్రను వీడి అక్రమ రొయ్యల చెరువులను మూసేయాలన్నారు. వారం రోజుల్లో ఉద్యమంపై కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ధర్నాలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, సిపిఎం నాయకులు గుత్రల అప్పారెడ్డి, కె.నాగేశ్వరరావు, సెజ్ పోరాట కమిటీ నాయకులు పెనుమళ్ల సుబ్బిరెడ్డి, సెజ్ బాధిత రైతులు పాల్గొన్నారు.

నేటి బంద్‌పై ఉధృత ప్రచారం



రాజమహేంద్రవరంలో ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు



విజయవాడలో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు తదితరులు

ప్రజాశక్తి- యంత్రాంగం

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ గురువారం చేపట్టబోయే రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ రాష్ట్రంలో బుధవారం ఉధృత ప్రచారం జరిగింది. వామపక్షాలు, వైసిపి, కాంగ్రెస్ పార్టీ, ప్రజా, కార్మిక, విద్యార్థి సంఘాలు ర్యాలీలు, ప్రదర్శనలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించాయి. వర్తక, వాణిజ్య సముదాయాలు, ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, విద్యాసంస్థల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. బంద్‌కు స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు. విజయవాడ సింగ్‌నగర్‌లో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన ప్రదర్శన నిర్వహించారు. బంద్‌కు మద్దతుగా ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నంలో సిపిఎం, సిపిఐ, ఎంసిపిఐ, వామపక్షాల ఆధ్వర్యాన ర్యాలీ జరిగింది. మచిలీపట్నంలో ర్యాలీ నిర్వహించారు. మొవ్వ, పామర్రు, గుడివాడ, నూజివీడు, నందిగామ, అవనిగడ్డ, మోపిదేవి, పెడన మండలాల్లో ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, పాఠశాలలు, బ్యాంకుల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. గుంటూరులో సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఎంసిపిఐ (యు) ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మంగళగిరి, ఆత్మకూరు, పెదవడ్లపూడి, చినవడ్లపూడి, నూతక్కి, రామచంద్రాపురం, కాజా, చినకాకాని గ్రామాల్లో సిపిఎం ఆధ్వర్యాన ర్యాలీ సాగింది. సత్తెనపల్లిలో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. వైసిపి మద్దతిచ్చింది. వామపక్షాలు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యాన విశాఖలో జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి బైక్ ర్యాలీ, ముఠా కార్మికుల ఆధ్వర్యాన పూర్ణామార్కెట్‌లో ప్రదర్శన నిర్వహించారు. బంద్‌కు వర్తక, వాణిజ్య సంఘాలు, హోటల్ యజమానులు, అన్ని తరగతుల ప్రజలూ సహకరించాలని కోరారు. వామపక్ష పార్టీలు, వైసిపి ఆధ్వర్యంలో విశాఖ జిల్లా చోడవరంలో బైక్ ర్యాలీ, నిర్వహించారు. కె.కోటపాడు, గొలుగొండ, అరకులోయ, పాడేరు మండల కేంద్రాల్లోనూ, డుంబ్రిగుడ వారపు సంతలోనూ ప్రచారం, చింతపల్లిలో బైక్ ర్యాలీ చేపట్టారు. పెదబయలులో పోస్టర్‌ను ఆవిష్కరించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో సభలు, సమావేశాలు నిర్వహించారు. పోలవరంలో సిపిఎం ఆధ్వర్యాన ఏటిగట్టు సెంటర్‌లోని పార్టీ స్తూపం వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. జంగారెడ్డిగూడెంలో కాంగ్రెస్ ఆధ్వర్యాన సమావేశం నిర్వహించారు. కొయ్యలగూడెంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. చింతలపూడిలో అఖిలపక్షాల ఆధ్వర్యాన మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన తూర్పుగోదావరి జిల్లా కాకినాడ, రాజవొమ్మంగి, ఏలేశ్వరం గ్రామాల్లో బైక్ ర్యాలీలు జరిగాయి. రాజమహేంద్రవరంలో సిపిఎం ఆధ్వర్యాన ఆటో ప్రచారం చేశారు. పెద్దాపురంలో సిపిఎం ఆధ్వర్యాన సన్నాహక సమావేశం జరిగింది. ఎఐటియుసి ఆధ్వర్యాన ప్రదర్శన నిర్వహించారు. కడపలో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన స్కూటర్ ర్యాలీ జరిగింది. వామపక్షాల ఆధ్వర్యాన శ్రీకాకుళంలో ర్యాలీ చేశారు. బంద్‌కు సన్నాహకంగా ఎన్‌జిఒ హోములో వామపక్షాల ఆధ్వర్యాన పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. విజయనగరం జిల్లా సీతానగరంలో సిపిఎం ఆధ్వర్యాన ప్రచారం చేపట్టారు. డెంకాడలో సిపిఎం, వైసిపి నాయకులు కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు, ప్రదర్శనలు కొనసాగాయి. కర్నూలులో సిపిఎం, ఎస్‌యుటిఐ పార్టీ ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతపురం జిల్లాలో జాతీయ సంస్థల ఏర్పాటుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లాలో కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు శంకుస్థాపన చేసిన ఛాయాచిత్రాలను ప్రదర్శించి నిరసన తెలిపారు. చిత్తూరు జిల్లా తిరుపతిలో సిపిఎం, సిపిఐ, సిఐటియు, ఎఐటియుసి, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ఆటో ప్రచారం, సిపిఎం, సిపిఐ, వైసిపి, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. నెల్లూరు జిల్లాలో ఆటో ప్రచారం, కరపత్రాలు పంపిణీ చేశారు.

బంద్‌తో ప్రభుత్వాల మెడలు వంచాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బడ్జెట్‌లో రాష్ట్రానికి ఇవ్వాల్సిన వాటిని ఇవ్వకుండా అన్యాయం చేసిన కేంద్ర, ప్రశ్నించకుండా ప్రజలను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాల మెడలు గురువారం చేపట్టనున్న రాష్ట్ర బంద్‌తో వంచాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ నాన్ పొలిటికల్ జెఎసి ఆధ్వర్యాన విజయవాడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన రాష్ట్ర సదస్సులో మధు మాట్లాడుతూ బంద్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేస్తామన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులను సాధించి తీరుతామన్నారు. ప్రజల్లో చైతన్యాన్ని తీసుకొచ్చి పోరాటం చేస్తామన్నారు. చంద్రబాబు కేంద్రంతో కలిసి నాటకాలాడుతున్నారని, కేంద్రం దగ్గర ఒక మాట, ఇక్కడ మరో మాట చెబుతున్నారని విమర్శించారు. రాష్ట్రానికి తీవ్ర అన్యాయంతో పాటు అవమానం కూడా జరిగిందన్నారు. బంద్‌లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ విభజన చట్టంలో ఇస్తామని హామీ ఇచ్చిన ప్రత్యేక హోదా, రైల్వే జోన్, పోలవరం, రాజధాని నిర్మాణానికి నిధులేవీ బడ్జెట్‌లో దక్కలేదన్నారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ విభజన చట్టంలోని 13వ షెడ్యూల్ ప్రకారం కడపలో ఉక్కు కర్మాగారం, దుగరాజపట్నంలో ఓడరేవు, విశాఖ రైల్వేజోన్, విజయవాడ, విశాఖలో మెట్రో ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. మోడీకి రాజకీయాలే ముఖ్యమని, అందుకే ఎవరూ అడక్కపోయినా బెంగళూరు మెట్రోకు నిధులిచ్చారని తెలిపారు. మోడీ మట్టి పోసి శంకుస్థాపన చేసిన రాజధానికి ఒక్క ఇటుక కూడా పేర్చలేదన్నారు. బిజెపి చేసిన మోసానికి టిడిపి సహకారం అందిస్తోందన్నారు. దమ్ముంటే చంద్రబాబు బిజెపికి మద్దతు ఉపసంహరించుకోవాలన్నారు. సమావేశంలో ఎపి నాన్ పొలిటికల్ జెఎసి కన్వీనర్ శ్రీహరినాయుడు, పిసిసి అధికార ప్రతినిధి కొలనుకొండ శివాజీ, సిపిఐ నగర కార్యదర్శి దోనెపూడి శంకర్, నవ్యాంధ్ర విద్యార్థి జెఎసి రాష్ట్ర అధ్యక్షులు ఐజాక్, జెఎసి నాయకులు ప్రసాద్, శీను తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీల అమలుకు సంతకాల సేకరణ

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

విభజన హామీలైన ప్రత్యేక హోదా, రైల్వేజోన్ తదితర వాటిని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆధ్వర్యాన విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద బుధవారం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్, రిటైర్డ్ ఆర్‌డిఒ కె.ఆర్.డి.ప్రసాద్ సంతకం చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అతిథులు ఎం.ఆర్.కాలేజీ విశ్రాంత అధ్యాపకులు రామకృష్ణ, వర్కింగ్ జర్నలిస్టుల జెఎసి కన్వీనర్ ఎం.ఎం.ఎల్.నాయుడు, విశ్రాంత ఉద్యోగులు, పెన్షన్‌దారుల సంఘం అధ్యక్షులు పెద్దింటి అప్పారావు సంతకాలు చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ విభజన చట్టంలోని ఏ ఒక్క అంశాన్నీ నెరవేర్చకుండా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబునాయుడు ప్రభుత్వాలు రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశాయన్నారు.

న్యాయం చేసే వరకూ పోరాటం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు (గుంటూరు జిల్లా)

పెదగొట్టిపాడు దళితులకు న్యాయం చేసే వరకూ సిపిఎం పోరాడుతుందని ఆ పార్టీ గుంటూరు తూర్పు జిల్లా కార్యదర్శి పాశం రామారావు ఉద్ఘాటించారు. గ్రామంలో దళిత మహిళలు బుధవారం చేపట్టిన రిలే దీక్షలను సిపిఎం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) నాయకులు బుధవారం సందర్శించారు. రామారావు మాట్లాడుతూ జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు టి.రాములు గ్రామాన్ని సందర్శించిన సందర్భంలో ప్రధాన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, ఆస్పత్రిలో ఉన్న బాధితులకు రోజు వారీ కూలి లెక్కించి ఇవ్వాలని ఆదేశించినా చర్యలేమీ లేవని చెప్పారు. గ్రామంలో దళితులకు పనులు దొరక్క నేటికీ ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని గుర్తు చేశారు. స్థానిక దళితుల సమస్యలపై ఇంటింటి సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. పెదగొట్టిపాడు దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23వ తేదీన చలో గుంటూరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - లింగాల(కడప)

అప్పుల బాధతో విషగుళికలు తిని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కడప జిల్లా లింగాల మండలంలోని కామసముద్రంలో బుధవారం చోటు చేసుకొంది. పోలీసులు, బంధువుల కథనం మేరకు.. కామసముద్రంకు చెందిన పోతిరెడ్డి రామాంజినేయరెడ్డి (48)తనకున్న మూడు ఎకరాలలో చీనీ పంటను సాగు చేస్తున్నాడు. బోర్ల కోసం చేసిన సుమారు రూ.పది లక్షల అప్పుకు వడ్డీ ఎక్కువ కావడంతో అప్పులు ఇచ్చిన వారు తీర్చాలని అడగటంతో ఆందోళనకుగురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఊరిబయట పొలాల్లోకి వెళ్లి విషపు గుళికలు మింగి తన భార్య శకుంతలకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకొంటున్నట్లు చెప్పారని బంధువులు తెలిపారు. సంఘటనా స్థలానికి హుటాహుటిన శకుంతల, స్థానికులు, బంధువులు వెళ్లారు. అక్కడ అపస్మారక స్థితిలో ఉన్న రామాంజినేయరెడ్డిని గ్రామస్తులు పులివెందులలో ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం కడపకు తీసుకెళ్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు.

ప్రజ్ఞ

జవాబులు

1. అమెరికాకు చెందిన స్పేస్ ఎక్స్
2. మహారాష్ట్ర, 3. కర్నాటకలోని గోమటేశ్వర
4. ముంబయి
5. గౌహతి (అసోం)

సిపిఎం 25వ రాష్ట్ర మహాసభల సంరంభం..

అరుణారుణం.. భీమవరం..

- తోరణాలతో పట్టణం ముస్తాబు - ఆకర్షిస్తున్న ఫ్లెక్సీలు
- ప్రజాప్రదర్శన, బహిరంగ సభకు సన్నాహాలు
- పనుల్లో నిమగ్నమయిన వాలంటీర్లు



భీమవరంలో ప్రజా సాంస్కృతిక సంబరాల ప్రారంభం సందర్భంగా కళాకారుల ప్రదర్శన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సిపిఎం 25వ రాష్ట్ర మహాసభల నేపథ్యంలో పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో పండుగ వాతావరణం నెలకొంది. ఏ రోడ్డు చూసినా, ఏ వీధి చూసినా ఎర్రజెండా రెపరెపలాడుతోంది. ఫ్లెక్సీలు, బ్యానర్లు ఆకట్టుకుంటున్నాయి. తొలిసారిగా భీమవరంలో పార్టీ రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తుండటంతో చరిత్రలో నిచిలిపోయేలా విజయవంతం చేయాలనే లక్ష్యంతో పార్టీ నాయకత్వం నుంచి కార్యకర్తల వరకూ ఎంతో శ్రమిస్తున్నారు. ఈ నెల 10, 11, 12 తేదీల్లో మహాసభలు నిర్వహించనున్నట్లు ప్రకటించిన నాటి నుంచీ మహాసభల ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం చేశారు. ఈ మహాసభల నిర్వహణకు సమన్వయకర్తగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మంతెన సీతారాం వ్యవహరిస్తున్నారు. ఆయన నేతృత్వంలో వివిధ విభాగాలను జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.రాజారామ్మోహన్‌రాయ్, డిఎన్‌విడి ప్రసాద్, పి.మంగరాజు పర్యవేక్షిస్తున్నారు. వాలంటీర్ల కన్వీనర్‌గా బివి వర్మ వ్యవహరిస్తున్నారు. ఆయన నేతృత్వంలో 20 రోజుల నుంచి సుమారు 150 మంది వాలంటీర్లు వివిధ పనుల్లో నిమగ్నమయ్యారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో తోరణాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగ్స్, ఆటో స్టిక్కర్స్, ఎల్ఇడి స్క్రీన్లు వంటివి ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకూ పట్టణాన్ని అన్ని హంగులతో సుందరీకరణ చేస్తున్నారు. రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి అరుదెంచే నాయకులు, కార్యకర్తలు ఎటువంటి అసౌకర్యానికీ గురికాకుండా చూసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రకాశం చౌక్ సెంటర్, అంబేద్కర్ సెంటర్, మురుగు కాలువ వంతెనపై పందిరి వలే తోరణాలు అలంకరించడంతో ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. ఈ ప్రాంతంలో భారీ స్వాగత కటవుట్లు, వంతెనకు అటువైపున, ఇటు వైపున ఫ్లెక్సీలు, బొంబే స్వీట్, నటరాజ్ థియేటర్, అడ్డవంతెన సమీపంలో భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. బహిరంగ సభకు అవసరమైన వేదికను సిద్ధం చేసేందుకు ఇప్పటికే చర్యలు తీసుకున్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే నాయకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ప్రచారం చేయడంతోపాటు ప్రజలను సమాయత్తం చేస్తున్నారు.

కర్తవ్యంగా భావిస్తున్నాను
పి.శ్రీనివాస్, వాలంటీర్



సిపిఎం మహాసభల నిర్వహణలో పనిచేయడం నా కర్తవ్యంగా భావిస్తున్నాను. పార్టీ మా కార్మికులకు అండగా నిలబ డింది. నాపై బాధ్యత పెట్టి వాలంటీర్‌గా నియమించడం ఆనందంగా ఉంది.



సభలు జరగడం సంతోషం: ప్రభాకరరావు, వాలంటీర్

భీమవరంలో మహాసభలు జరగడం సంతోషంగా ఉంది. రాష్ట్ర నలుమూలల నుంచీ మహాసభలకు మా కార్మిక సోదరులు విచ్చేయనున్నారు. వారికి ఆతిథ్యం ఇవ్వడం ఆనందదాయకంగా ఉంది. కొన్ని రోజుల నుంచి మా పార్టీ జెండాను పట్టణమంతా తోరణాలుగా అలంకరిసున్నాం

ఆనందంగా ఉంది
కె.సత్యనారాయణ, వాలంటీర్



పట్టణం నలుమూలలా జెండాలతో అలంకరించాం. ఫ్లెక్సీలు, బ్యానర్లు పెట్టాం. 20 రోజుల నుంచీ ఇదే పనిలో ఉన్నాం. మహాసభలకు పనిచేయడం ఆనందంగా ఉంది. రాత్రి, పగలు ఈ పనుల్లోనే ఉంటున్నాను. కార్మికుల పక్షాన నిలబడే పార్టీ కోసం పని చేస్తున్నాను.



ఏర్పాట్లు పూర్తి కావస్తున్నాయి:వర్మ, వాలంటీర్ల కన్వీనర్

రాష్ట్రం నలుమూలల నుంచీ ఎంతోమంది నాయకులు మహాసభలకు విచ్చేయనున్నారు. వీరు ఎటువంటి అసౌకర్యాలకూ గురికాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. 20 రోజుల నుంచి పట్టణాన్ని సుందరీకరించడంలో కార్మిక సోదరులు నిమగ్నమయి ఉన్నారు. మహాసభలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి కావస్తున్నాయి.

సంతకాల సేకరణ

అణుపార్కుకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ



సంతకాలు చేస్తున్న నర్సింగరావు, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం కొవ్వాడలో అణుపార్కు ఏర్పాటు కోసం వెస్టింగ్‌హౌస్ కంపెనీ యాజమాన్యాన్ని తీసుకొచ్చేందుకు కేంద్రప్రభుత్వం చేస్తోన్న ప్రయత్నాలను విరమించుకోవాలని సిఐటియు ఆధ్వర్యాన శ్రీకాకుళంలోని ఏడురోడ్ల కూడలిలో బుధవారం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ దివాళా తీసిన వెస్టింగ్‌హౌస్ కంపెనీ యాజమాన్యాన్ని కొవ్వాడ సందర్శించాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు.

వెస్టింగ్‌హౌస్ యాజమాన్యం కొవ్వాడ పరిశీలనకు వస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. కొవ్వాడలో అణుపార్కు ఏర్పాటు కోసం అటమిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డుకు భారత అణుఇంధన సంస్థ దరఖాస్తు చేయలేదని తెలిపారు. అయినప్పటికీ భూసేకరణకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని విమర్శించారు. మత్స్యకారులను మభ్యపెట్టి కొవ్వాడ చుట్టుపక్కల గ్రామాల్లో భూములను సేకరించిందని విమర్శించారు. బలవంతపు భూ సేకరణను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు చౌదరి తేజేశ్వరరావు, జిల్లా కార్యదర్శి భవిరి కృష్ణమూర్తి, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసు, డి.గోవిందరావు, పలుసంఘాల నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ధర్నా జయప్రదం కోసం జెఎసి ర్యాలీ

ప్రజాశక్తి-కాకినాడ

పెన్షన్ సాధన సమితి ఆధ్వర్యాన తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద ఈ నెల 10న నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలంటూ జెఎసి ఆధ్వర్యాన బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్‌జిఒ కార్యాలయంలో జెఎసి జిల్లా చైర్మన్, పెన్షన్ సాధన సమితి కన్వీనర్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పించను విధానాన్ని కొనసాగించాలనే ప్రధాన డిమాండ్లతో ఈ ధర్నాను నిర్వహిస్తున్నామని తెలిపారు. ధర్నాలో భాగంగా తొలుత భారీ ర్యాలీ ఉంటుందన్నారు. జిల్లాకు చెందిన ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు, ఉపాధ్యాయులు ఈ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ధర్నాను విజయవంతం చేయాలంటూ ముద్రించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.

జ్యూట్ పరిశ్రమను పరిరక్షించాలని ఐఎఫ్‌టియు ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జ్యూట్ పరిశ్రమ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐఎఫ్‌టియు ఆధ్వర్యాన పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు అశోక్‌నగర్‌లోని కార్మికశాఖ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. మూతపడిన జ్యూట్‌మిల్లులను తెరిపించాలని, జ్యూట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ధర్నానుద్దేశించి ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు మాట్లాడారు. రాష్ట్రంలో అనేక జ్యూట్ మిల్లులు మూతపడి సుమారు 20 వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని చెప్పారు.

నడుస్తున్న మిల్లుల్లోనూ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. చాలీచాలని జీతాలు, డిఎ తగ్గిపోవడం, బోనస్ ఎరియర్స్ యాజమాన్యాలు చెల్లించకపోవడం వంటి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. జ్యూట్ పరిశ్రమ రక్షణకు తగిన చర్యలు చేపట్టాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ నగర అధ్యక్షులు కాకర్ల అప్పారావు, నగర కార్యదర్శి బద్దా వెంకటరావు, ఎ.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఉబర్ డ్రైవర్ల నిరాహారదీక్షలు

విశాఖ : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉబర్ డ్రైవర్లు బుధవారం విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ దీక్షలనుద్దేశించి విశాఖ మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కార్యదర్శి బి.జగన్ మాట్లాడారు. విదేశీ కంపెనీ అయిన ఉబర్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తూ, సంస్థలో పనిచేస్తున్న కార్మికుల పొట్ట కొట్టడం దుర్మార్గమన్నారు.

కల్బుర్గి, గౌరీ లంకేష్ హత్యలపై 'సిట్'

రాజ్యసభలో కేంద్ర హోం సహాయ మంత్రి హన్సరాజ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రముఖ రచయిత గౌరీ లంకేష్, మాజీ వైస్ చాన్సలర్, హేతువాది కల్బుర్గీ హత్యలపై కర్ణాటక ప్రభుత్వం ప్రత్యేక విచారణ బృందం(సిట్) ఏర్పాటు చేసిందని కేంద్ర హోం సహాయ మంత్రి హన్సరాజ్ గంగారామ్ పేర్కొన్నారు. విచారణ కూడా కొనసాగుతోందని అన్నారు. బుధవారం రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపి కెవిపి రామ చంద్రరావు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి హన్సరాజ్ లిఖిత పూర్వక సమాధాన మిచ్చారు. కల్బుర్గీ హత్య ఘటనపై ఇప్పటికే సిఐడి విచారణ చేపట్టిందని, రాష్ట్రాల్లో శాంతి భద్రతలు బాధ్యత ఆయా రాష్ట్ర ప్రభుత్వాలదేనని అన్నారు.



గగన విహారం

డేవిడ్ ఎల్ గోల్డ్‌ఫీన్ తర్వాత ఫ్రెంచ్ ఎయిర్‌ఫోర్స్ జనరల్ ఆండ్రి లనాటా తేజాస్ యుద్ధవిమానంలో గగన విహారం రెండవ విదేశీ వైమానిక అధికారిగా రికార్డుకెక్కారు.

మా హామీలు అమలు జరుపుతాం

జనామోద యోగ్యమైన మ్యానిఫెస్టోతో ముందుకు

త్రిపుర లెఫ్ట్‌ఫ్రెంట్

ప్రజాశక్తి - జనరల్ డెస్క్

త్రిపుర... దేశవ్యాప్తంగా అందరి దృష్టి ఇప్పుడు ఆ చిన్న రాష్ట్రంపైనే ఉంది. త్రిపుర అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో అధికార లెఫ్ట్ ఫ్రంట్ ఎన్నికల మ్యానిఫెస్టోను ఇటీవల విడుదల చేసింది. 25 ఏండ్లుగా ఈ రాష్ట్రంలో వరుసగా అధికారంలో ఉన్న లెఫ్ట్ ఫ్రంట్ తన మ్యానిఫెస్టోలో అనేక కీలక అంశాలను పేర్కొంది. వేర్పాటువాదుల హింసాత్మక చర్యలను అదుపుచేయడం నుంచి వ్యవసాయ ఆధునీకరణ, పారిశ్రామికీకరణ ద్వారా ఉపాధి కల్పించడం వరకూ, అక్షరాస్యత పెంచడం, డ్రాపవుట్లను తగ్గించడం నుంచి ఆరోగ్య సేవలను విస్తృతపర్చడం వరకు, వివిధ జాతుల మధ్య సామరస్యాన్ని పెంపొందించడం మొదలుకుని పేద, గిరిజన, దళితులు, మైనార్టీల అవసరాలపై దృష్టిసారించడం వరకు అనేక అంశాలను వామపక్ష కూటమి తన మ్యానిఫెస్టోలో ప్రస్తావించింది. తన పనిలో, బహుళ వర్గాల మద్దతును కూడగట్టుకుంటూ ఎంతో విశ్వాసంతో బీజేపీ-ఐపీఎఫ్‌టీ కూటమికి భిన్నమైనదిగా వామపక్ష కూటమి ముందుకు సాగుతున్నది.

విజయవంతంగా పృథ్వి-2 క్షిపణి ప్రయోగం



బాలాసోర్ : దేశీయంగా అభివృద్ధిపరిచిన అణ్వస్త్రాలను మోసుకెళ్ళగల సామర్థ్యం వున్న పృథ్వి-2 క్షిపణిని భారత్ బుధవారం విజయవంతంగా ఒడిషాలోని బాలాసోర్ నుండి ప్రయోగించిందని రక్షణ వర్గాలు తెలిపాయి. సైన్యం నిర్వహించే యూజర్ ట్రయల్స్‌లో భాగంగా ఈ ప్రయోగం నిర్వహించారు. ఉపరితలం నుండి ఉపరితలంపైకి ప్రయోగించే ఈ క్షిపణిని ఉదయం11.35గంటల సమయంలో బాలాసోర్‌కు సమీపంలోని చాందిపూర్ ఐటిఆర్ నుండి ప్రయోగించారు. ఈ ప్రయోగం విజయవంతమైందని, అన్ని లక్ష్యాలు ప్రామాణికతలను అందుకున్నదని ఆ వర్గాలు తెలిపాయి. 500 నుండి వెయ్యి కిలోల వరకు అణు శీర్షాలను ఈ క్షిపణి మోసుకెళ్లగలదు. 350కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగలదు.

కులభూషణ్‌జాదవ్‌పై మరో కేసు..!



కరాచీ: పాకిస్తాన్‌లో గూఢచర్యానికి పాల్పడిన ఆరోపణలపై అరెస్టయి మరణశిక్షను ఎదుర్కొంటున్న భారత నౌకాదళ మాజీ అధికారి కులభూషణ్‌జాదవ్‌పై పాక్ ప్రభుత్వం మరో కేసు బనాయించింది. ఉగ్రవాదం, విద్రోహ చర్యల వంటి అభియోగాలతో నమోదయిన ఈ కేసుపై త్వరలోనే విచారణ ప్రారంభం కానున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. జాదవ్ కేసుకు సంబంధించిన సమాచారాన్ని అందించటానికి 13 మంది భారతీయ అధికారులతో భేటీ అయ్యేందుకు తమ ప్రభుత్వ పదేపదే ప్రయత్నించినా, భారత్ సహకరించలేదని ఈ వర్గాలను ఉటంకిస్తూ డాన్ పత్రిక తన వార్తా కథనంలో వివరించింది. జాదవ్‌పై ఉగ్రవాదం, విద్రోహచర్యల వంటి అనేక కేసులు నమోదయ్యాయని, వీటిపై విచారణ ఇప్పుడు కొనసాగుతోందని ఈ వర్గాలు వివరించాయి. కాగా తాజా కేసుపై విచారణను సైనిక ట్రిబ్యునల్ కొనసాగిస్తుందా లేక సాధారణ కోర్టులో నిర్వహిస్తారా అన్న అంశంపై ఈ వర్గాలు ఎటువంటి వివరణనూ ఇవ్వలేదు. జాదవ్‌పై తాజాగా నమోదయిన ఉగ్రవాదం కేసు అంతర్జాతీయ న్యాయస్థానంలో అతడికి వ్యతిరేకంగా తమ వాదనను బలపరుస్తుందని పాక్ అధికారులు చెబుతున్నారు.

ముంబయి ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో అగ్ని ప్రమాదం

ముంబయి : గత కొన్ని రోజులుగా ముంబయిలో ఏదో ఒక ప్రాంతంలో అగ్ని ప్రమాద ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా బుధవారం మరో అగ్ని ప్రమాదం సంభవించింది. ఉదయం సబర్బన్ ముంబయిలో గోర్గాన్ ఒబెరాయ్ మాల్‌కు దగ్గరలోని ఇటాలియన్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ వున్న వస్త్ర పరిశ్రమలో అగ్ని ప్రమాదం సంభవించిందని పోలీసులు తెలిపారు. మూడు అంతస్తుల బిల్డింగ్‌లో గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రమాదం జరిగిందనీ, ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని, పోలీసులు తెలిపారు. సమాచారం అందిన వెంటనే ఎనిమిది ఫైర్ ఇంజన్లు, వాటర్ ట్యాంక్, అంబులెన్స్‌ను ఘటనాస్థలానికి తరలించామని, మంటలు ఆర్పివేశామని అగ్నిమాపక విభాగం తెలిపింది. గత డిసెంబర్‌లో ఇదే నగరంలో కమలా మిల్స్ కౌంపౌండ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 14 మంది మృతి చెందిన సంగతి తెలిసిందే.

ముస్లింలు పాకిస్తాన్‌కో, బంగ్లాదేశ్‌కో వెళ్లిపోవాలి

వినయ్ కతియార్ వివాదస్పద వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: బిజెపి సీనియర్ నేత వినయ్ కతియార్ ముస్లింలపై మరోసారి నోరు పారేసుకున్నారు. 'ముస్లింలకు భారత్‌లో ఏం పని లేదని, వారు పాకిస్తాన్‌కో, బంగ్లాదేశ్‌కో పోవాలని అన్నారు. దేశ విభజనకు ముస్లింలే కారణమని నిందించారు. వందేమాతర గీతాన్ని, జాతీయ పతాకాన్ని గౌరవించని వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ముస్లింలకు 'పాకిస్తానీ' అన్న వారిని మూడేళ్లు జైలులో పెట్టాలంటూ ఎంఐఎం నేత ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై స్పందించిన కతియార్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారతీయ ముస్లింలను పాకిస్తానీలు అనటం అవమానకరమైన అంశమన్న ఒవైసీ... జిన్నా రెండు దేశాల వాదనను తోసిపుచ్చి వారు భారత్‌లోనే మనుగడ సాగిస్తున్నారని గుర్తు చేశారు.



చెరువు వద్ద గాలింపు చర్యలు చెపడుతున్న పోలీసులు

చెరువులో పడి కుటుంబం ఆత్మహత్య

అత్తవారింటి వేధింపులే కారణం

హైదరాబాద్ : ఇక్కడకు సమీపంలోని కీసర ప్రాంతంలో ఉన్న చెరువులోకి దూకి ఒక కుటుంబం ఆత్మహత్య చేసుకుంది. మృతుల్లో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారని పోలీసులు తెలిపారు. మృతులను ఎం.రమేష్ (30), భార్య మానస(26), వారి పిల్లలు గీతశ్రీ(3), దివిజ(ఆరునెలలు)గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. నలుగురి మృతదేహాలను చెరువు నుండి వెలికితీసినట్లు కీసర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మృతులు సోమవారం ఇంటినుండి బయటకు వచ్చారని తెలిపారు. మానస తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు వారి కోసం వెతకగా చెరువుకు సమీపంలో రమేష్ బైక్ పార్కింగ్ చేసి ఉండటాన్ని గుర్తించారు. దీనితో వారు చెరువులో దూకి ఉంటారనే అనుమానంతో పోలీసులకు విషయాన్ని తెలియజేశారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని ఈతగాళ్ల సహాయంతో మృతదేహాలను బయటకు తీశారు. కాగా, మానస అత్తమామలు వేధించడం వల్లే పిల్లలతో సహా తన కూతురు ఆత్మహత్యకు పాల్పడిందనీ మానస తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రమేష్, మానసలకు 2014లో వివాహం కాగా, వీరికి ఇద్దరు కుమార్తెలు జన్మించారు. అయితే కుమారుడుకి జన్మనివ్వలేదని అత్తమామాలు, ఆడపడుచు, ఇతర కుటుంబసభ్యులు మానసను చిత్రవధ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైందని, వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పెట్రోల్‌పై ఎక్సైజ్‌డ్యూటీ ఎత్తేయండి..

- ఈ ఏడాది మూడు లక్షల కోట్ల పన్ను విధింపు
- అంతర్జాతీయంగా ధరలు తగ్గినా వినియోగదారుడికి చేరని వైనం
- రాజ్యసభ జీరోఅవర్‌లో సిపిఐ(ఎం) ఎంపీ కేకే రాగేష్ విమర్శ



సిపిఐ(ఎం) ఎంపీ కేకే రాగేష్

ప్రజాశక్తి - న్యూఢిల్లీబ్యూరో

దేశంలో నానాటికీ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించాలని సీపీఐ(ఎం) ఎంపీ కేకే రాగేష్ డిమాండ్ చేశారు. చాలా నగరాల్లో లీటర్ పెట్రోల్ ధర రూ.80 దాటిందని, ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీని విరమించుకోవాలని కోరారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినప్పటికీ కేంద్రంలోని మోడీ సర్కారు ఆ ప్రయోజనాలను వినియోగదారుడికి చేరనీయకుండా అడ్డుకుంటోందని ఆక్షేపించారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరల అంశాన్ని రాజ్యసభ జీరో అవర్‌లో కేకే రాగేష్ బుధవారం లేవనెత్తారు. 'ఈ ఏడాది వార్షిక బడ్జెట్‌లో పెట్రోల్‌పై ఎక్సైజ్ డ్యూటీని రూ. 8 తగ్గిస్తున్నట్టు ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించారు. కానీ అది వినియోగదారులకు చేరకుండా రోడ్డు సెస్ రూ.8 విధించారు' అని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరల నియంత్రణను ఎత్తివేస్తూ యూపీఏ సర్కారు నిర్ణయం తీసుకుందని, సీపీఐ(ఎం)గా ఆ నిర్ణయాన్ని అప్పుడే వ్యతిరేకించామని గుర్తు చేశారు. అయితే నియంత్రణ ఎత్తివేసే సమయంలో అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా పెట్రోల్, డీజిల్ ధరల్లో పెరుగుదలతో పాటు తగ్గుదల కూడా ఉంటుందని అప్పటి యూపీఏ ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు. కానీ గడిచిన నాలుగేండ్లలో అంతర్జాతీయ ధరలు పెరిగినప్పుడు పెట్రోల్ ధరలు పెరుగుతున్నాయని, కానీ ధరలు తగ్గినప్పుడు ఆ ప్రయోజనం వినియోగదారులకు చేరడం లేదని వివరించారు. '2014 సంవత్సరంలో అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడిచమురు ధర 110 యూఎస్ డాలర్లు ఉండగా.. ప్రస్తుతం అది 70 యూఎస్ డాలర్లకు తగ్గింది. ఒకానొక సమయంలో బ్యారెల్ ముడిచమురు ధర 30 యూఎస్ డాలర్లకు కూడా పతనమైంది. కానీ ఆ ప్రయోజనాలను వినియోగదారులకు చేరనీయలేదు' అని మోడీ సర్కారును విమర్శించారు. పైగా పెట్రోల్‌పై 2014 సంవత్సరంలో రూ.లక్ష కోట్లు, 2016-17లో రూ.2.67 లక్షల కోట్లు, ఈ ఏడాది రూ.మూడు లక్షల కోట్ల ఎక్సైజ్ డ్యూటీని విధించారని వివరించారు. పైగా డీజిల్ పై రూ.92 వేల కోట్ల సబ్సిడీని ఎత్తేశారని చెప్పారు. ప్రస్తుతం పెట్రోల్ ధరలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో ఎక్సైజ్‌డ్యూటీని ఎత్తేయాలని డిమాండ్ చేశారు.

మీ సిఫార్సును పున:పరిశీలించండి

కొలిజీయంను కోరనున్న ప్రభుత్వం?

న్యూఢిల్లీ : ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కె.ఎం.జోసెఫ్‌కు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి కల్పించాలని దాదాపు నెల రోజుల క్రితం కొలీజియం సిఫార్సు చేసింది. అయితే సీనియారిటీ పట్టించుకోలేదని, ప్రాంతీయ ప్రాతినిధ్యం వంటి కారణాలతో ఆ సిఫార్సును పున:పరిశీలించాలని కోరుతూ కొలీజియంకు పంపే విషయాన్ని ప్రభుత్వం పరిశీలించవచ్చని తెలుస్తోంది. ఉత్తరాఖండ్‌లో రాష్ట్రపతి పాలన విధింపును రద్దు చేసి, హరీష్ రావత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పునరుద్ధరించి, కేంద్రాన్ని ఇబ్బందికర పరిస్థితుల్లో నెట్టింది ప్రధాన న్యాయమూర్తి జోసెఫ్ నేతృత్వంలోని ధర్మాసనమే అనే విషయాన్ని ఇక్కడ గుర్తుంచుకోవాలి. కాగా, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, జస్టిస్ చలమేశ్వర్, రంజన్ గగోయ్, మదన్ లోకూర్, కురియన్ జోసెఫ్‌లతో కూడిన కొలీజియం కె.ఎం.జోసెఫ్ పదోన్నతి కోసం సిఫార్సు చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకంలో సీనియారిటీ, ప్రాంతీయ ప్రాతినిధ్యం అమలు చేయాలని ప్రభుత్వంలో జరుగుతున్న చర్చకు సంబంధించిన వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై న్యాయ నిపుణులు స్పందిస్తూ, అటువంటి నిబంధనలేమీ లేవని అన్నారు.

'జై శ్రీరామ్' చెప్పాలంటూ ముస్లిం వ్యక్తిపై దాడి

న్యూఢిల్లీ : 'జై శ్రీరామ్' అనాలంటూ ఒక ముస్లిం వ్యక్తిపై దాడి చేసిన సంఘటన రాజస్తాన్‌లో జరిగింది. సామాజిక మీడియాల్లో ఈ దాడికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారడంతో మత స్వేచ్ఛకు, రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా జరిగిన ఈ సంఘటనపై దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతోంది. దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. దాడి చేసిన 18 ఏళ్ల విజయ్ మీనాను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మూడు నిమిషాలు నిడివి ఉన్న ఈ వీడియోలో 'జై శ్రీ రామ్' అని చెప్పాలంటూ మహమ్మద్ సలీమ్‌ను విజయ్ మీనా 25 సార్లు కొట్టిన దృశ్యం ఉంది. 'దేవుడు సర్వశక్తిమంతుడు' అనే సలీమ్ బదులు ఇస్తున్నట్లు ఉంది. రాజస్తాన్‌లో ప్రముఖ పర్యాటక క్షేత్రం మౌంట్ అబూకు 30 కిలో మీటర్లు దూరంలో రోడ్డుపై సోమవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. ఈ వీడియో చూసిన ముస్లిం నేతలు విజయ్ మీనాపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజస్తాన్‌లో ఈ తరహా దాడులు ఎక్కువగా జరుగుతున్నాయి. డిసెంబరు 6న రాజ్‌స్మండ్‌లో మహమ్మద్ అఫ్రూజుల్ అనే వ్యక్తిని కిరాతంగా మంటల్లో తగులపెట్టారు. అంతకుముందు 55 సంవత్సరాల పెహ్లూఖాన్‌ను ఆవులను అక్రమ రవాణా చేస్తున్నాడని ఆరోపిస్తూ గో గూండాలు కొట్టి చంపారు.

లోయా మృతి కేసులో జోక్యం చేసుకోండి

రాష్ట్రపతిని కోరనున్న ప్రతిపక్ష పార్టీలు

న్యూఢిల్లీ : సిబిఐ న్యాయమూర్తి బి.హెచ్.లోయా అనుమానాస్పద మృతిపై మరింతగా దర్యాప్తు జరపడానికి అవకాశం కల్పించేందుకు జోక్యం చేసుకోవాల్సిందిగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కోరుతూ ప్రతిపక్ష పార్టీలు పిటిషన్ అందచేయనున్నాయి. లోయా మృతి అనుమానాస్పదంగా వుందని, అందువల్ల దీనిపై స్వతంత్ర దర్యాప్తు జరపాల్సిన అవసరం వుందని ఆ పిటిషన్ కోరుతోంది. కాంగ్రెస్ పార్టీ చొరవతో రూపొందిన ఈ మూడు పేజీల పిటిషన్‌పై వంద మందికి పైగా ఎంపీలు సంతకాలు చేశారు. లోయా మృతి కేసును మరుగున పడేసేందుకు ప్రభుత్వం చాలా ప్రయత్నిస్తోందని సీనియర్ ప్రతిపక్ష నేత ఒకరు వ్యాఖ్యానించారు. అత్యున్నత స్థాయిలోని రాష్ట్రపతి ఈ విషయంలో జోక్యం చేసుకుంటే బాగుంటుందని తాము భావించామని ఆయన తెలిపారు. ప్రస్తుతం సుప్రీం కోర్టు బెంచ్ లోయా మృతిపై స్వతంత్ర దర్యాప్తు డిమాండ్ చేస్తున్న పిటిషన్లను విచారిస్తోంది. 2014 డిసెంబరులో లోయా మరణించేనాటికి సోహ్రాబుద్దీన్ షేక్ హత్య కేసు విచారిస్తున్నారు. ఈకేసులో అమిత్ షా నిందితుడుగా వున్నారు.

మాల్యా రుణాలపై ఎలాంటి రికార్డులు లేవు

సమాచార కమిషన్‌కు కేంద్రం వెల్లడి



న్యూఢిల్లీ : వివిధ బ్యాంకుల నుంచి వేల కోట్లు రూపాయిల రుణాలను తీసుకుని చెల్లించకుండా విదేశాలకు పారిపోయిన వ్యాపారవేత్త విజయ్ మాల్యా రుణాల గురించి కేంద్రం వద్ద ఎలాంటి రికార్డులు లేవని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ స్వయంగా వెల్లడించింది. సమాచార హక్కు దరఖాస్తు ఫిర్యాదు మేరకు ఆర్థిక శాఖను విజయ్ మాల్యా రుణాల గురించి కేంద్ర సమాచార కమిషన్ (సిఐసి) ప్రశ్నించింది. మాల్యా రుణాల గురించి తమ వద్ద ఎలాంటి రికార్డులు లేవని ఆర్థిక శాఖ సమాధానం ఇచ్చింది. సమాచార హక్కు చట్టం ద్వారా రాజీవ్ కుమార్ ఖరే అనే వ్యక్తి ఈ దరఖాస్తు చేశారు. ఈ దరఖాస్తును విచారించి సిఐసి కమిషనర్ ఆర్‌కె మధూర్ వివరాలు చెప్పాలంటూ ఆర్థిక శాఖను కోరారు. విజయ్ మాల్యా గురించి రాజీవ్ కుమార్ ముందుగా ఆర్థిక శాఖకే దరఖాస్తు చేసుకున్నారు. అయితే వ్యక్తిగత భద్రత, దేశ ఆర్థిక ప్రయోజనాల రీత్యా వివరాలు చెప్పలేమని ఆ దరఖాస్తును ఆర్థిక శాఖ తిరస్కరించింది. దీంతో సిఐసికి రాజీవ్ కుమార్ దరఖాస్తు చేశారు. కాగా, మాల్యా రుణాల గురించి తమ వద్ద ఎలాంటి రికార్డులు లేవని సిఐసికి తెలిపిన ఆర్థిక శాఖ గతంలో ఇదే విషయంపై పార్లమెంట్‌లో సభ్యులకు అనేకసార్లు సమాధానం ఇచ్చింది. 2017 మార్చి 17న పార్లమెంట్‌లో ఆర్థిక శాఖ సహయ మంత్రి సంతోష్ గంగ్వార్ మాట్లాడుతూ మాల్యా పేరును ప్రస్తావిస్తూ 2004 సెప్టెంబరులో అతనికి రుణం ఇచ్చామని, 2008 ఫిబ్రవరిలో దాన్ని సమీక్షించామని తెలిపారు. 2009 నాటికి బ్యాంకుల నిరర్థక ఆస్తుల విలువ రూ. 8,040 కోట్లుగా ప్రకటించారు. మార్చి 21న రాజ్యసభలో సంతోష్ గంగ్వార్ మాట్లాడుతూ విజయ్ మాల్యా ఆస్తులను వేలం వేయడం ద్వారా రూ. 155 కోట్లు రాబట్టుకున్నట్లు తెలిపారు. 2016 నవంబర్ 17న రాజ్యసభలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మాట్లాడుతూ విజయ్ మాల్యా రుణాలను యుపిఎ ప్రభుత్వం నుంచి వచ్చిన భయంకరమైన వారసత్వంగా పేరొన్నారు.

జర్నలిస్టులపై దాడుల్లో మధ్యప్రదేశ్ టాప్

దేశంలో 90 కేసుల్లో 108 మంది అరెస్టు

న్యూఢిల్లీ: దేశంలో మోడీ సర్కారు అధికారంలోకొచ్చాక జర్నలిస్టుపై దాడులు ఎక్కువయ్యాయి. 2015-17 మధ్యకాలంలో దేశంలో 90 చోట్ల ఈ దాడులు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనల్లో 108 మందిని పోలీసులు అరెస్టు చేశారు. జర్నలిస్టులపై దాడుల కేసుల్లో బీజేపీ పాలిత రాష్ట్రమైన మధ్యప్రదేశ్ అగ్రస్థానంలో(41కి పైగా కేసులు) ఉండటం గమనార్హం. జర్నలిస్టులపై దాడుల విషయమై నేషనల్ క్రైం రికార్డ్ బ్యూరో(ఎన్‌సీఆర్‌బీ) గణాంకాలను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ అహీర్.. రాజ్యసభలో బుధవారం వెల్లడించారు. గతేడాదిలో 15 చోట్ల జర్నలిస్టుల పై జరిగిన దాడుల్లో 26మందిని అరెస్టు చేసినట్టు ఆయన తెలిపారు. అరెస్టయిన వారిలో అత్యధికంగా రాజస్థాన్ నుంచి ఉన్నారు. 2016లో నమోదైన 47 కేసుల్లో మధ్యప్రదేశ్ నుంచే 41 ఉన్నాయి. 2015లో 28 కేసుల్లో 41 మందిని అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు.

గోవాలో 88 మైనింగ్ లీజుల రద్దు : సుప్రీం ఆదేశం

గోవా: గోవా రాష్ట్ర ప్రభుత్వం 2015లో పునరుద్ధరించిన దాదాపు 88 మైనింగ్ లీజులను రద్దు చేస్తూ సుప్రీం కోర్టు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. మైనింగ్ లీజులను వేలం ద్వారా కేటాయించాలని మైన్స్ అండ్ మినరల్స్ (రెగ్యులేషన్ అండ్ డెవలెప్‌మెంట్) చట్టాన్ని సవరించటానికి కొద్ది రోజుల ముందే గోవా ప్రభుత్వం ఈ లీజులను రెన్యూ చేసింది. సుప్రీం కోర్టు తాజా ఆదేశాల నేపథ్యంలో గోవాలో ఇనుము, మాంగనీసు గనులకు సంబంధించిన మైనింగ్ కార్యకలాపాలన్నీ మార్చి 15 నాటికి పూర్తిగా నిలిచిపోనున్నాయి. 2015లో గోవాలోని బిజెపి ప్రభుత్వం ఈ మైనింగ్ కంపెనీల లీజులను మరో 20 ఏళ్ల పాటు పొడిగిస్తూ 2007 నుండి అమలులోకి వచ్చే విధంగా రెన్యూవల్ చేసింది. ఈ రెన్యూవల్‌ను రద్దు చేసిన న్యాయమూర్తులు మదన్ బి లోకుర్, దీపక్ గుప్తాతో కూడిన ధర్మాసనం మైనింగ్ లీజు దరఖాస్తులను తాజాగా పరిశీలించాలని ప్రభుత్వానికి సూచించింది.

ఇతర దేశాల్లో మెడిసిన్ చేసేవారికీ అర్హత పరీక్షలు

న్యూఢిల్లీ : ఈ సంవత్సరం నుండి ఇతర దేశాల్లో మెడిసిన్ చేయాలనుకునే విద్యార్థులకు కూడా నేషనల్ ఎలిజిబిలిటీ, ఎంట్రన్స్ టెస్ట్ తప్పనిసరి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యాలయాల అధికారిక వర్గాలు తెలిపిన ప్రకారం ఈ చర్యలు విదేశీ విశ్వవిద్యాలయాల్లోని మెడిసిన్ అభ్యసించే మంచి విద్యార్థుల కోసం లక్ష్యంగా పెట్టుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం విదేశాల్లో మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామ్ పాసై డిగ్రీలను పొందిన పట్టభద్రులు, దేశంలో వైద్యులుగా పనిచేయడానికి రిజిస్టర్ చేసుకునే ముందు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసిఐ) నిర్వహిస్తున్న పరీక్షలు రాయాల్సి ఉంటుంది.

అయితే వారి ఉత్తీర్ణత శాతం తక్కువ ఉంటుంది. ప్రతి సంవత్సరం ఎంసిఐ లెసెన్సు పరీక్షను ఈ గ్రాడ్యుయేట్లలో కేవలం 10-15 శాతం మాత్రమే పూర్తి చేయగ ల్గుతున్నారని, దీని నుండే ఇతర దేశాల్లోని విద్యార్థుల నాణ్యత, వైద్య విద్య యొక్క ప్రామాణికత అర్థమౌతోందని ఆరోగ్య మంత్రిత్వశాఖలోని ఒక అధికారి తెలిపారు.

ప్రత్యేకం

కనీస మద్దతు ధర దక్కని రైతులు

వెల్లడి చేసిన మీడియా చానల్



న్యూఢిల్లీ : దీర్ఘకాలంగా రైతులు చేస్తున్న డిమాండ్లను నెరవేర్చనున్నట్లు 2018-19 సంవత్సరపు కేంద్ర బడ్జెట్ వాగ్దానం చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే ఉత్పత్తి వ్యయానికి అదనంగా 50 శాతం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) ఉండేటట్లు చూస్తామని పేర్కొన్నారు. దీనిని రాబోయే రబీ సీజన్‌కి అమలు చేయనున్నట్లు హామీ ఇచ్చారు. కానీ నాలుగింట మూడొంతులు రబీ పంటను మద్దతు ధర కంటే తక్కువగా అమ్ముతున్నారని ఒక మీడియా చానల్ వెల్లడిచేసింది. చానల్ దీనిపై దృష్టి సారించి అనేక విషయాలను వెల్లడిచేసింది. ఇందులో భాగంగా వ్యవసాయ మార్కెట్‌లో అమ్ముతున్న ధరలతో శనగలు, కందిపప్పు(ఎరుపు, నలుపు కాయధాన్యాలు), ఆవాలు, గోధుమలు వంటి పంటలను మద్దతు ధరతో పోల్చి చూశారు. మూడు మార్కెట్లలో విక్రయిస్తున్న ఈ పంటల అమ్మకం ధరను సగటున తీసుకున్నారు. వారి లెక్కల ప్రకారం శనగలు కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 4,400, ఉండగా, సగటు మార్కెట్ ధర క్వింటాల్‌కు రూ. 3,755 ఉందని, అనగా కనీస మద్దతు ధర కంటే 14 శాతం తక్కువ. అదేవిధంగా కందులు, ఆవాలకు కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 4,250, రూ.4,000 ఉండగా, సగటు మార్కెట్ ధర క్వింటాల్‌కు రూ. 3,546, 3,530 గా ఉంది. వారి కనీస మద్దతు ధర కన్నా 17 శాతం, 12 శాతం తక్కువగా ఉందని వెల్లడి చేసింది. శనగలను మార్కెట్లో విక్రయించిన ధరతో తాము సగం పెట్టుబడిని కొల్పోయామని మధ్యప్రదేశ్‌కు చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారని మీడియా వెల్లడించింది. తాను రూ .4,000 ధరల అంచనాతో ఇక్కడకు వచ్చాను, కానీ శనగ పంట 3500 రూపాయలకు విక్రయించానని మరో రైతు చెప్పారు. అయితే, గోధుమల సగటు మార్కెట్ ధరలు కనీస మద్దతు ధర కంటే 12 శాతం ఎక్కువగా ఉందని పేర్కొంది. కాగా, ప్రతి రైతు దాని నుండి లాభం పొందుతున్నాడని అర్థం కాదని, గోధుమ విక్రయించిన మొదటి మూడు మార్కెట్లలో, ముంబైలో టోకు ధరలు ఆగ్రా మరియు లలిత్ పూర్ (ఉత్తర ప్రదేశ్లో) కంటే చాలా ఎక్కువని తెలిపింది. అక్కడ ధరల శ్రేణి, కనీస మద్దతు ధర కంటే తక్కువ.

సంక్షిప్తం

ఆప్ ఎంఎల్‌ఎల పిటిషన్లపై రోజువారీ విచారణ

న్యూఢిల్లీ : లాభార్జన గల పదవులను నిర్వహిస్తున్నారనే కారణంతో తమని అనర్హులుగా ప్రకటించడానికి వ్యతిరేకంగా ఆప్ ఎంఎల్‌ఎలు దాఖలు చేసిన పిటిషన్లను రోజువారీ ప్రాతిపదికన విచారించాల్సిందిగా ఢిల్లీ హైకోర్టు బుధవారం ఆదేశించింది. అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ రాష్ట్రపతి కోవింద్‌కు ఇసి సిఫార్సు చేయడాన్ని వ్యతిరేకిస్తూ తొలుత ఎనిమిది మంది ఆప్ ఎంఎల్‌ఎలు పిటిషన్ దాఖలు చేశారు. తర్వాత బుధవారం మరో నలుగురు ఎంపీలు హైకోర్టుకు వెళ్ళారు.

కారు ప్రమాదంలో ప్రధాని భార్యకు స్వల్పగాయాలు

జైపూర్ : రాజస్తాన్‌లోని చిత్తోర్‌గడ్ జిల్లాలో ప్రధాని మంత్రి నరేంద్రమోడీ భార్య జశోదాబెన్ ప్రయాణిస్తున కారు బుధవారం ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఆమె దగ్గర బంధువు మృతి చెందగా, ఆమెకు గాయలయ్యాయి. గుజరాత్‌లోని వివాహానికి హాజరై వస్తుండగా, రాజస్తాన్‌లో ఈ ప్రమాదం జరిగిందని పోలీసు అధికారి పేర్కొన్నారు. డ్రైవర్‌తో సహా ఆరుగురు ప్రయాణిస్తున్న కారును వెనుక నుండి ట్రక్కు వేగంగా గుద్దటంతో ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు ఈ ఘటనలో బసంత్ బాయ్ మోడీ మృతి చెందారనీ, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయని తెలిపారు.

రెండు మోటర్ సైకిళ్ళ ఢీ : ముగ్గురు మృతి

బాందా : ఉత్తరప్రదేశ్‌లోని గిర్వాన్ ప్రాంతంలో ఉన్న రిసౌరా గ్రామానికి సమీపంలో బుధవారం రెండు మోటర్‌సైకిళ్లుఒకదానితో ఒకటి ఢీ కొనడంతో ముగ్గురు మృతిచెందగా, ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. విద్యార్థులు పరీక్ష రాసి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ఈ ఘటన జరిగిందని పేర్కొన్నారు. త్రిపాఠి, సత్యం శుక్లా, అజయ్ అనే ముగ్గురు విద్యార్థులు ఘటనా స్థలిలోనే మృతి చెందారని పోలీసులు తెలిపారు. వీరందరూ 20 నుండి 23 సంవత్సరాలలోపు వారేనని పేర్కొన్నారు. గాయపడిన ఇద్దరిని ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

సిరియా పట్టణం నుండి వైదొలగండి

అమెరికాకు టర్కీ హెచ్చరిక

అంకారా : సిరియా పట్టణమైన మాంబిజ్ నుండి అమెరికా బలగాలు తక్షణమే వైదొలగాలని టర్కీ అధ్యక్షుడు రెసెప్ తైయిప్ ఎర్డోగన్ హెచ్చరించారు. కీలకమైన వ్యూహాత్మక కేంద్రం మాంబిజ్ వరకు టర్కీ బలగాలు తమ సైనిక కార్యకలాపాలను విస్తరిస్తాయని చెప్పారు. మాంబిజ్‌లో ప్రజా రక్షణ దళాలు (వైపిజి), దాని రాజకీయ విభాగం డెమోక్రటిక్ యూనియన్ పార్టీ (పివైడి)కి చెందిన కార్యకర్తలు వుండడాన్ని ఎర్డోగన్ తీవ్రంగా నిరసిస్తున్నారు. వాటిని తీవ్రవాద గ్రూపులుగా టర్కీ చూస్తోంది. సిరియా పట్టణమైన అఫ్రిన్ నుండి వైపిజి బలగాలను పారద్రోలే లక్ష్యంతో జనవరి 20న టర్కీ పెద్ద ఎత్తున సైనిక చర్య చేపట్టింది. అయితే ఆఫ్రిన్ పరిస్థితికి భిన్నంగా మాంబిజ్‌లో సైనిక బలగాలు వున్నందున అటువైపు టర్కీ బలగాలు వెళితే పెద్ద ఎత్తున ఘర్షణలు తప్పవని భావిస్తున్నారు. మాంబిజ్ వంటి పట్టణాలు అరబ్ మెజారిటీ ప్రాంతమని టర్కీ భావిస్తోంది.



అన్వేషణ।

తైవాన్‌లోని హువాలియన్‌లో భూకంపం ధాటికి ధ్వంసమైన భవనంలో చిక్కుకుపోయిన వారికోసం అన్వేషిస్తున్న సహాయక బృందాలు

తైవాన్ పర్యాటక కేంద్రంలో భూకంపం

ఐదుగురి మృతి, 60 మందికి పైగా గల్లంతు

హువాలిన్ (తైవాన్): తైవాన్‌లోని ప్రముఖ పర్యాటక కేంద్రం హువాలిన్ నగరంలో బుధవారం సంభవించిన భూకంపంలో కనీసం ఐదుగురు మరణించారని, మరో 60 మందికి పైగా గల్లంతయ్యారని దాదాపు 243 మంది ప్రజలు తీవ్రంగా గాయపడ్డారని అధికారులు చెప్పారు. భూప్రకంపనల ధాటికి పలు భవనాలు కూలిపోయాయని, శిధిలాలలో చిక్కుకున్న వారి కోసం సహాయకబృందాలు గాలిస్తున్నాయని వివరించారు. తైవాన్ తీరప్రాంతంలోని హువాలిన్ నగరంలో మంగళవారం అర్ధరాత్రికి కొద్ది ముందు సంభవించిన ఈ భూ ప్రకంపనలు రిక్టర్ స్కేల్‌పై 6.4 పాయింట్ల తీవ్రతను నమోదు చేశాయి.

గల్లంతయిన వారి సంఖ్య 60 వరకూ వుంటుందని, అయితే ఇది మరింత పెరిగే అవకాశం లేకపోలేదని నగగర మేయర్ ఫుకున్ ఛి చెప్పారు. కూలిపోయిన భవనాల కింద ఇంకా పలువురు చిక్కుకుని వున్నట్లు భావిస్తున్న అధికారులు వారి కోసం విస్తృత స్థాయిలో గాలింపు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. గాయపడిన వారిలో చైనా, చెక్, జపాన్, సింగపూర్, ద.కొరియా దేశాలకు చెందిన వారున్నట్లు తెలుస్తోంది. ఈ భూకంపంలో తీవ్రంగా దెబ్బతిన్న 12 అంతస్తుల హోటల్ భవనంలో చిక్కుకుపోయిన వారి కోసం అత్యవసర సహాయక బృందాలు గాలిస్తున్నాయి. దాదాపు 17 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం ప్రకంపనల ధాటికి కుప్పకూలింది.

జిన్‌పింగ్, పుతిన్‌ల వార్షిక సందేశాలు

బీజింగ్ : 'చైనా-రష్యాల మధ్య స్థానిక సహకారం, పరస్పర మార్పిడుల ఏడాది' ప్రారంభోత్సవం సందర్భంగా బుధవారం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లు పరస్పరం అభినందన సందేశాలు పంపుకున్నారు. రష్యా సంస్కృతీ వారసత్వం సుసంపన్నంగా గల హర్బిన్ నగరంలోని సన్ ఐలాండ్‌లో ఈ కార్యక్రమం జరుగుతోంది. ఈ సందర్భంగా చైనా ఉప ప్రధాని వాంగ్ యాంగ్ రష్యా డిప్యూటీ ప్రధాని యారీ తుతనెవ్‌తో సమావేశమయ్యారు.

పేదరిక నిర్మూలనలో ౼మిష్టి కృషి

అన్ని రాజకీయ పక్షాలకు సీ జిన్‌పింగ్ పిలుపు

బీజింగ్: చైనాలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వంతో కలిసి సమిష్టిగా కృషి చేయాలని చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, దేశాధ్యక్షుడు సీ జిన్‌పింగ్ దేశంలోని రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చారు. అఖిల చైనా వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చైనా పరిస్థితులకు అనువైన కొత్త సోషలిస్టు శక ఆవిర్భావానికి రాజకీయ పార్టీల మధ్య సహకారం అవసరమన్నారు. దేశంలోని వివిధ రాజకీయ పార్టీలు, వారి సభ్యులు కలిసి గత ఏడాది 150కి పైగా విధానపరమైన అంశాల పై లోతైన అధ్యయనం చేశారని ఆయన వివరించారు. తాజాగా అన్ని రాజకీయ పార్టీలూ తమ అంతర్గత ఎన్నికలను విజయవంతంగా నిర్వహించుకోవటం సంతోషకరమైన విషయమని ఆయన అన్నారు. కొత్త యుగానికి చైనా పరిస్థితులకు అనువైన సోషలిజంపై సీ ఆలోచనలను, సిపిసి 19వ జాతీయ మహాసభలిచ్చిన స్ఫూర్తిని తాము ఏ విధంగా అధ్యయనం చేస్తున్నదీ వారు ఆయనకు వివరించారు.

గత తీర్పును రద్దు చేసిన మాల్దీవుల సుప్రీంకోర్టు

మాలె : మాజీ అధ్యక్షుడు మహ్మద్ నషీద్‌తో సహా తొమ్మిదిమంది ప్రతిపక్ష నేతలను విడుదల చేయాలని ఆదేశిస్తూ గత వారం జారీ చేసిన రూలింగ్‌ను మాల్దీవుల సుప్రీం కోర్టు రద్దు చేసింది. కోర్టు తీసుకున్న చర్యను ప్రభుత్వం స్వాగతించిందని అధ్యక్ష కార్యాలయం విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. కొత్త ఆదేశాలపై సుప్రీంకోర్టులోని ముగ్గురు న్యాయమూర్తులు సంతకాలు చేశారు. 15 రోజుల పాటు అత్యవసర పరిస్థితి విధిస్తూ అధ్యక్షుడు ప్రకటించగానే మంగళవారం తెల్లవారు జామున ప్రధాన న్యాయమూర్తి సయీద్, మరో న్యాయమూర్తి అలీ హమీద్‌లను అరెస్టు చేయడంతో మిగిలిని ముగ్గురు న్యాయమూర్తులు ఈ తీర్పు వెలువరించడం విశేషం. ప్రభుత్వాన్ని కూలదోసే ప్రయత్నంలో భాగంగానే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అబ్దుల్లా సయీద్ ముడుపులు తీసుకున్నారని అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ అంతకుముందు ఆరోపించారు. గత గురువారం నాటి కోర్టు తీర్పుతో మాల్దీవుల్లో రాజకీయ సంక్షోభం నెలకొంది. ప్రభుత్వాన్ని కూలదోసే కుట్రలు పన్నుతున్నారంటూ మాజీ అధ్యక్షుడు గయూమ్‌ను కూడా అరెస్టు చేశారు.



మాల్దీవుల సుప్రీంకోర్టు

గాజాలో విద్యుత్ సంక్షోభం

మూతపడుతున్న ఆస్పత్రులు

గాజా : విద్యుత్ కొరత కారణంగా గాజాలో సంక్లిష్టమైన పరిస్థితులు నెలకొన్నాయి. మెడికల్ సెంటర్లు, ఆస్పత్రులు వంటి అత్యవసర విభాగాలు ఇప్పటివరకు ఇంధనంతో నడుస్తున్నాయి. కానీ అవి కూడా రాబోయే పది రోజుల్లో హరించుకుపోయే పరిస్థితులు ఎదురవడంతో ఇక విపత్కర పరిస్థితులు తప్పవని ఐక్యరాజ్య సమితి హెచ్చరించింది. విద్యుత్ లేకపోవడంతో ప్రతి నెలా 14లక్షల ఇంధనం అవసరమవుతోందని, కీలకమైన ప్రజా విభాగాలు మూతపడకుండా వుండేందుకు ఇంధనం తప్పనిసరైందని ఐక్యరాజ్య సమితి మానవతా వ్యవహారాల విభాగం (ఓసిహెచ్ఎ) తెలిపింది. ఆరోగ్యం, నీరు, పారిశుధ్యం సేవలందాలంటే, ప్రజల ప్రాణాలను కాపాడాలంటే తక్షణమే దాతల విరాళాలు అవసరమని మానవతా విభాగ సమన్వయకర్త రాబర్ట్ వాలెంట్ తెలిపారు. తక్షణ సాయం అందని పక్షంలో రాబోయే వారాల్లో ఆస్పత్రులు మూతపడే ప్రమాదం కనిపిస్తోంది. ఈ పరిస్థితి ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపే ప్రమాదముంది. ఇప్పటికే విద్యుత్ కొరతతో 19 మెడికల్ సెంటర్లు మూతపడ్డాయని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధి తెలిపారు.

ద.కొరియా చేరుకున్న ఉ.కొరియా కళాకారుల బృందం

సియోల్: ఈ నెల 9 నుండి ప్రారంభం కానున్న శీతాకాల ఒలింపిక్స్‌లో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించేందుకు ఉ.కొరియాకు చెందిన 140 మంది కళాకారుల బృందం మంగళవారం నాడు ఇక్కడికి చేరుకుంది. శీతాకాలం ఒలింపిక్స్ నిర్వహించనున్న ప్యాంగ్ చాంగ్‌లో వీరు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఒలింపిక్స్‌కు హాజరవుతున్న ఉన్ సోదరి

ఉ.కొరియా అధినేత కిమ్‌జోంగ్ ఉన్ సోదరి కిమ్‌యో జాంగ్ శీతాకాలం ఒలింపిక్ క్రీడలకు హాజరయ్యేందుకు ఈ వారంలో ద.కొరియా సందర్శించనున్నారని సియోల్ ఏకీకరణ మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో వివరించింది.



ఆగ్నేయాసియాలో పెరుగుతున్న తీవ్రవాద ముప్పు

సహకారం పెంపునకు ఆసియాన్ రక్షణ మంత్రుల పిలుపు

సింగపూర్ : ఆగ్నేయాసియా ఎదుర్కొంటున్న తీవ్రవాద ముప్పు పెరిగిపోతోందని ఆగ్నేయాసియా రక్షణ మంత్రులు బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో తీవ్రవాద ముప్పును ఎదుర్కొనేందుకు సహకారాన్ని మెరుగుపరుచుకోవాల్సి వుందని వారు పేర్కొన్నారు. ఇస్లామిస్ట్ తీవ్రవాదులను ఎదుర్కొనేం దుకు గానూ గత నెల్లో ఇంటెలిజెన్స్ ఒప్పందాన్ని ఆరు ఆగ్నేయాసియా దేశాలు రూపొందించాయి. భద్రతాపరమైన ముప్పులపై సహకారాన్ని కూడా మెరుగుపరుచుకోవాలని పిలుపిచ్చాయి. పరస్పర సహకారాన్ని పెంచుకోవాలని కూడా తీర్మానించాయి. "అత్యంత అధునాతనమైన ప్రాణాంతకమైన ఆయుధాలు, ఎత్తుగడలతో వ్యక్తులు, గ్రూపులు, సంస్థలు సాగించే తీవ్రవాద చర్యలు, కార్యకలాపాలు పెరిగిపోవడం పట్ల తాము తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నామని వారు పేర్కొన్నారు. సింగపూర్‌లో రెండు రోజుల సమావేశం ముగింపులో వారు ఈ ప్రకటన చేశారు. సరిహద్దులు దాటి విదేశీ సంస్థలకు చెందిన తీవ్రవాదులు ఈ ప్రాంతానికి చేరుకుంటుండడంతో ముప్పు తీవ్రంగా వుందని ఆ ప్రకటన పేర్కొంది. విదేశీ భాగస్వాములతో కూడా తమ సహకారాన్ని పెంచుకుంటామని మంత్రులు తెలిపారు.

రష్యా అధ్యక్ష ఎన్నికల బరిలోకి పుతిన్

మరోసారి అభ్యర్థిగా నమోదు

మాస్కో: త్వరలో జరుగనున్న అధ్యక్ష ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థిగా రష్యా ప్రస్తుత అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తన పేరును మంగళవారం నాడు రష్యా కేంద్ర ఎన్నికల కమిషన్ వద్ద నమోదు చేసుకున్నారు. పుతిన్ అభ్యర్థిత్వానికి మద్దతుగా 3,14,837 మంది సంతకాలను పుతిన్ కార్యాలయం సేకరించిందని ఎన్నికల కమిషన్ ఒక ప్రకటనలో వివరించింది. నిబంధనల ప్రకారం అభ్యర్థిత్వానికి మద్దతుగా 3 లక్షల సంతకాలను సేకరించాల్సి వుంటుంది. కాగా ఎటువంటి సంతకాలు సేకరించకుండానే మరో ఇద్దరి అభ్యర్థిత్వాలను ఎన్నికల కమిషన్ నమోదు చేసింది. అవి పార్లమెంటరీ రాజకీయ పార్టీలతరపు అభ్యర్థులవి కావటం విశేషం. ఇందులో రష్యన్ కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధి పావెల్ గ్రుడినిన్ ఒకరు కాగా మరొకరు రష్యన్ లిబరల్ డెమొక్రాటిక్ పార్టీ నేత వ్లాదిమిర్ జిరినోవ్‌స్కీ. రష్యా ఎన్నికల నిబంధనల ప్రకారం అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయదల్చుకున్న అభ్యర్థులు ఈ నెల 10వ తేదీలోపు ఎన్నికల కమిషన్ వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాల్సివుంటుంది. అలా చేసుకుంటేనే మార్చి 18న జరిగే ఎన్నికల బ్యాలెట్‌లో వారి పేర్లు వుంటాయి.

మొదటి పేజీ తరువాయి

నేడు ముద్దుకృష్ణమ అంత్యక్రియలు

శోకసంద్రమయ్యింది. సిఎం చంద్రబాబునాయుడు ప్రభుత్వ కార్యక్రమాలను రద్దు చేసుకుని ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 2.40 నిమిషాలకు వెంకట్రామాపురానికి చేరుకుని నివాళి అర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ 'మాజీ మంత్రి, ఎంఎల్‌సి గాలి ముద్దుక్రిష్ణమనాయుడు హఠాన్మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నానని, నా సహచరుడిని కోల్పోయాను' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భావోద్వేగంతో అన్నారు. జిల్లా ప్రజలకు, పార్టీకి ఎనలేని కృషి చేసిన ఒక ఆశయం కలిగిన సహచరుడిని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతికి ముందే అమరావతిలో తనను కలిసి నారావారిపల్లిలో ఈసారి మిమ్మల్ని కలవలేనని, దుబాయ్ నుంచి వచ్చాక కలుస్తానని చెప్పారని గుర్తు చేసుకున్నారు. మూడురోజులుగా ప్రజలతో మమేకమై, డెంగ్యూ జ్వరంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారన్నారు. రాజకీయాల్లోకి రాక ముందు పెదనందిపాడు కళాశాలలో లెక్చరర్‌గా పనిచేశారని, రాజకీయాల్లోకి వచ్చినా అప్పటినుంచి ఇప్పటివరకూ కళాశాలను మరచిపోకుండా సంబంధాలను కొనసాగిస్తుండటం ఆయన ఆదర్శానికి తార్కాణమన్నారు. సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ, మంత్రులు అచ్చెన్నాయుడు, నారాయణ, దేవినేని ఉమా మహేశ్వరరావు, ఎంపి శివప్రసాద్, ఎంఎల్‌సిలు గౌనివారి శ్రీనివాసులు, నరసింహులు, ఎమ్మెల్యేలు నారాయణస్వామి, తలారి ఆదిత్య, డిఎ సత్యప్రభ, సుగుణమ్మ, రాష్ట్ర మహిళా చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి నివాళులర్పించిన వారిలో ఉన్నారు. గురువారం మధ్యాహ్నం ఆయన స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

పెద్ద దిక్కును కోల్పోయాం : పిడిఎఫ్

మాజీ మంత్రి, శాసనమండలి సభ్యులు ముద్దుకృష్ణమనాయుడు మృతితో చిత్తూరు జిల్లా పెద్దదిక్కును కోల్పోయిందని పిడిఎఫ్ ఎంఎల్‌సిలు విఠపు బాలసుబ్రమణ్యం, బొడ్డు నాగేశ్వరరావు, యండపల్లి శ్రీనివాసులురెడ్డి, రాముసూర్యారావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాజకీయాల్లో ఎంత ఎత్తు ఎదిగినా, ఎన్ని పదవులు పొందినా అందరితో ఆత్మీయంగా ఉండేవారని చెప్పారు. శాసనమండలిలో ఎక్కువ ప్రశ్నలను అడిగేవారిలో ఆయన ఒకరని గుర్తు చేశారు. రాజకీయాలకు అతీతంగా తమ పట్ల ప్రేమను ప్రదర్శించేవారని చెప్పారు.

పలువురు నేతల సంతాపం

గాలి ముద్దుకృష్ణమనాయుడు మృతదేహానికి తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు రాజకీయ నేతలు నివాళి అర్పించారు. వైసిపి అధ్యక్షులు జగన్, పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కంభంపాటి హరిబాబు, కాంగ్రెస్ రాజ్యసభ సభ్యులు కెవిపి రామచంద్రారావు, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎపి శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాద్, నగరి ఎమ్మెల్యే రోజా, తెలంగాణ టిడిపి నేతలు రమణ, మోతుకూరి నరసింహులు, నామా నాగేశ్వరరావు, తెలంగాణ కాంగ్రెస్ నేతలు జానారెడ్డి, రేవంత్‌రెడ్డి, తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపి గుత్తా సుఖేంద్రరెడ్డి, ఎన్‌టిఆర్ కుమారులు హరిక్రిష్ణ, రామకృష్ణ సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

నేడు బంద్

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించారు. ప్రత్యేక పరిస్థితుల్లో బంద్‌లో పాల్గొంటున్నట్లు జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ ప్రకటించారు. జనసేన శ్రేణులు కూడా బంద్‌లో పాల్గొనాలని కోరారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు విద్యాసంస్థలు, కళాశాలలు యాజమాన్యం బంద్‌కు మద్దతుగా స్వచ్ఛందంగా సెలవు ప్రకటించాయి. కార్మిక సంఘాలూ, విద్యా, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలూ బంద్‌లో పాల్గొంటున్నట్లు స్పష్టం చేశాయి. వాణిజ్య సంఘాలు కూడా బంద్‌కు మద్దతు తెలిపాయి. రాష్ట్రానికి న్యాయం జరిగే వరకూ ఊరుకునేది లేదని హెచ్చరించాయి. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కూడా బంద్‌లో పాల్గొంటున్నట్లు ప్రకటించాయి. ఆంధ్రప్రదేశ్ వర్కింగు జర్నలిస్టు యూనియన్(ఎపియుడబ్ల్యుజె), ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్(ఐజెయు), ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు ఫెడరేషన్(ఎపిజెఎఫ్) సంపూర్ణ మద్దతు ప్రకటించడంతోపాటు, బంద్‌లోనూ పాల్గొనాలని జర్నలిస్టులు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ కూడా మద్దతు ఇచ్చింది. రాష్ట్రంలో జరిగే బంద్‌లకు అన్ని జర్నలిస్టు సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇప్పటికే అన్ని జిల్లాల్లోనూ బంద్‌కు మద్దతుగా పెద్దఎత్తున స్పందన వస్తోంది. సామాన్యులూ బడ్జెట్లో జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేస్తున్నారు. రాస్తారోకోలు, ధర్నాలు చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు నిరసనగా 15వ తేదీ వరకూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చిన కాంగ్రెస్ అధ్యక్షులు రఘువీరారెడ్డి బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఉత్తరాంధ్ర చర్చావేదిక, అభివృద్ధి వేదిక, రాయలసీమ అభివృద్ధి వేదిక, నాన్ పొలిటికల్ జెఎసి తదితర సంఘాలన్నీ మద్దతు ఇచ్చాయి. వృత్తిదారులు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు కూడా బంద్‌లో పాల్గొంటున్నట్లు ప్రకటించారు. మరోవైపు ప్రభుత్వం మాత్రం బంద్‌ను విరమించుకోవాలని, పార్లమెంటులో టిడిపి నిర్వహిస్తున్న ఆందోళనకు మద్దతు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం తరుపున అచ్చెన్నాయుడు, నక్కా ఆనందబాబు విజ్ఞప్తి చేశారు. బంద్‌లో భాగంగా ఉదయం ఐదు గంటలకు పండిట్ నెహ్రూ బస్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేయనున్నారు. అనంతరం లెనిన్ సెంటర్ నుండి నిరసన ప్రదర్శనలు మొదలవుతాయని నాయకులు ప్రకటించారు.

గాలిలో దీపంలా గిరిజనుల ఆరోగ్యం

అటకెక్కిన 6-డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని గిరిజనుల ఆరోగ్య పరిరక్షణకు ఉద్దేశించిన '6-డి' కార్యక్రమం అమలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా మారింది. డిఫెక్ట్స్ డ్యూరింగ్ ప్రెగ్నెన్సీ (గర్భంతో ఉండగా లోపాలు), డిఫెక్ట్స్ ఎట్ బర్త్ (పుట్టుకతో లోపాలు), డిసీసెస్ (వ్యాధులు), డెఫిషియన్సీస్ (పోషకాహార లోపాలు), డవలెప్‌మెంటల్ డిలే అండ్ డిజేబిలిటిటీ (ఎదుగుదల లోపం, అంగవైకల్యం), డిఫెక్ట్స్ ఎట్ అడాలిసెంట్స్ అండ్ డ్రాపవుట్ (కౌమార ఆరోగ్య సమస్యలు).. ఈ ఆరింటినీ గిరిజన ప్రాంతాల్లో సరిదిద్దేందుకు యంత్రాంగం తీసుకోవాల్సిన చర్యలనే '6-డి' కార్యక్రమంగా పేర్కొంటున్నారు. తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం ఐటిడిఎ పరిధిలోని వై రామవరం మండలం చాపరాయిలో గతేడాది 16 మంది గిరిజనులు చనిపోయిన సంఘటనతో ప్రభుత్వం కళ్లు తెరిచింది. అలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా గిరిజన ప్రాంతాల్లో అమలుకు అధికారులు ఈ 6-డిని తెరమీదికి తెచ్చారు. పాఠశాల సమగ్ర ఆరోగ్యం (స్కూల్ హెల్త్‌లో) భాగంగా దీన్ని ఏజెన్సీ ప్రాంతాల అన్ని పాఠశాలల్లోను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. అంతే.. అక్కడితో ఆ ప్రచారాడంబరం ముగిసిపోయింది. 6-డి కార్యక్రమం అమలులో అటకెక్కింది. అసలా ఆ పేరుతో తల్లీ బిడ్డలకు ఒక ప్రత్యేక కార్యక్రమం ఉందనేదే నేటికీ గిరిజనులకు తెలియని దుస్థితి. గిరిజన ప్రాంతాల ప్రభుత్వ ఆసుపత్రుల డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది ప్రధానంగా ఈ కార్యక్రమం అమలు చేయాల్సి ఉంటుంది. వారు తమ పరిధిలోని 18 సంవత్సరాల లోపు వయసు బాలబాలికలందరికీ ఆరోగ్య సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాల్సి ఉంటుంది. వారానికోసారి వారితో సమావేశం కావాలి. అందుకు ఒక రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసుకుని తదనుగుణంగా డాక్టర్లు, సిబ్బంది కార్యాచరణకు ఉపక్రమించాలి. ఏయే ప్రాంతంలో ఎటువంటి వ్యాధులు ప్రబలడానికి అవకాశాలున్నాయో గుర్తించి, వాటిని నమోదు చేస్తూ, ఆయా ప్రాంతాల్లో ముందుజాగ్రత్తలు తీసుకోవడానికి వీలుగా తరచుగా కార్యక్రమాలు నిర్వహించాలి. కానీ క్షేత్ర స్థాయిలో ఎక్కడా ఈ 6-డి అమలు కావడం లేదు. ఈ కార్యక్రమాలన్నీ కాగితాలకే పరిమితమైపోయాయి. కార్యాచరణైతే లేదని గిరిజన ప్రాంతాల వారు విమర్శిస్తున్నారు.

మళయాళ కవి ౼త సంఘ్ పరివార్ బెదిరింపులు

తిరువనంతపురం : ప్రముఖ మళయాళ కవి కురుపూజ శ్రీకుమార్‌పై బెదిరింపులకు పాల్పడిన ఆరోపణలతో బీజేపీ కార్పొరేటర్ సహా ఏడుగురు సంఘ్ పరివార్ కార్యకర్తలను కొల్లాంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొట్టుకల్‌లోని స్థానిక లైబ్రరీ సోమవారం రాత్రి నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న కవిపై అసభ్య పదజాలాలతో దూషణకు దిగడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. వడయంపడిలో ఓ దళితుడు మృతిచెందగా అతడి అంత్యక్రియలను అడ్డుకున్న అగ్రవర్ణాల వివక్షాపూరిత చర్యపై అక్కడ నిమ్నకులాలవారు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ అంశంపై సంఘ్ పరివార్‌ను విమర్శిస్తూ శ్రీకుమార్ ప్రసంగిస్తుండగా కొంతమంది ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు వేదికవద్ద శ్రీకుమార్‌ను చుట్టుముట్టి అసభ్యపదజాలాలతో దూషిస్తూ.. చేయిచేసుకునే ప్రయత్నంచేశారు. పంచాయతీ అధికారులు, లైబ్రరీ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. ఈ ఘటనపై శ్రీకుమార్ ఫిర్యాదు చేయడంతో వారిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్‌దే పాపం

(మొదటిపేజీ తరువాయి)

పలికాం. వాజ్‌పేయి ప్రభుత్వం దూరదృష్టి కారణంగా మూడు రాష్ట్రాలు విభజించినా ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాలేదు. ఎవరి వాటాలు ఆయా రాష్ట్రాలకు ఇచ్చారు. కానీ ఆంధ్రప్రదేశ్ విషయంలో అలా జరగలేదు. రాజకీయ లబ్ధి కోసం పార్లమెంటు తలుపులు మూసివేసి విభజన బిల్లు ఆమోదింపజేసుకున్నారు. నామమాత్రం ప్రతిపక్షం, ప్రసార మాధ్యమాలపై నియంత్రణతో కాంగ్రెస్ ఇష్టారాజ్యంగా వ్యవహరించింది. తమ నిర్వాకాలు బయటకు రాకుండా కాంగ్రెస్ పార్టీ ఇషానుసారం వ్యవహరించింది. అప్పుడు వారు చేసిన తప్పుల వల్లనే ఇప్పుడు ప్రతిపక్షంలో కూర్చున్నారు. హైదరాబాద్‌లో ఏపి దళిత ముఖ్యమంత్రిని రాజీవ్‌గాంధీ అవమానించారు. నీలం సంజీవరెడ్డి, అంజయ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా అవమానించింది. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ చేసిన రాజకీయ అరాచకాలు అనేకం. అలాంటి వారా ఆ రాష్ట్రం గురించి మాట్లాడేది. కర్ణాటక ఎన్నికలు లేకుంటే ఆంధ్రప్రదేశ్ విభజన గురించి మల్లికార్జున ఖర్గే మాట్లాడేవారా?" అని మోడీ అన్నారు. అంజయ్యను రాజీవ్ గాంధీ అవమానించడంతోనే ఎన్టీఆర్ సినిమాలను వదిలి రాజకీయాల్లోకి వచ్చారని ఎన్టీఆర్ పేరును ప్రస్తావించారు. విభజన హామీలు అమలు చేయాలంటూ చేయండి అంటూ కాంగ్రెస్, సిపిఎం, ఇతర పార్టీల ఎంపీలు నిరసన తెలుపుతుంటే..వాటికి బదులు ఇవ్వకుండా ఎప్పటి లానే కాంగ్రెస్‌పై విమర్శలు మాత్రమే చేశారు.

కొనసాగిన ఆందోళనలు

(మొదటిపేజీ తరువాయి)

టిడిపి ఎంపిలకు ఆందోళన విరమించాలని, చంద్రబాబు నుంచి ఫోన్ వచ్చిందని తెలిపారు. కేంద్ర మంత్రి సుజనా సూచనతో, బిజెపి మంత్రులు ఆదేశాలతో టిడిపి ఎంపిలు వెల్ నుంచి నిష్క్రమించారు. వెల్‌లోనే నిరసన తెలుపుతున్న వైసిపి ఎంపి వైవి సుబ్బారెడ్డిని హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ పిలిపించుకొని మాట్లాడారు. ఆందోళన విరమించాలని కోరారు. దీంతో వారు సభ నుంచి వాకౌట్ చేశారు.అయితే కాంగ్రెస్, సిపిఎం, ఐయుఎంఎల్, ఆరెస్పీ ఎంపిలు వెల్‌లో దూసుకెళ్లి ఆందోళన చేశారు. ఎన్సీపి, ఆప్, ఆర్జేడీ, ఎంఐఎం, ఎస్పీ సభ్యులు తమ స్థానాల్లోనే నిల్చొని నిరసన తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి. ఎందుకు పరిష్కరించలేదు అని ప్రభుత్వాన్ని నిలదీశారు. మోడీ ప్రసంగించినంత సేపు తమ ఆందోళనను కొనసాగించారు. కేరళ, బెంగాలీ, కర్ణాటక ఎంపిలు తమ తమ ప్రాంతీయ భాషల్లో కూడా నినాదాలు వర్షం కురిపించారు. హిందీ రాష్ట్రాల సభ్యులు హిందీలోనూ, మరికొంత మంది సభ్యులు ఇంగ్లీష్‌లోనూ ఇచ్చిన నినాదాలతో సభలో గందరగోళం నెలకొంది. మరోవైపు రాజ్యసభలో కూడా ఆంధ్రప్రదేశ్ ఎంపిల ఆందోళన కొనసాగింది. కాంగ్రెస్, టిడిపి, వైసిపి ఎంపిలు ఆందోళన వ్యక్తం చేశారు. ఉభయ సభల్లో జరిగే ఆందోళనల్లో గాని, పార్లమెంట్ ఆవరణంలోని జరిగిన ఆందోళనలో గాని బిజెపి ఎంపిలు పాల్గొనలేదు. కేంద్ర మంత్రి, టిడిపి ఎంపి అశోక్ గజపతిరాజు బుధవారం కూడా దుమ్మాకొట్టారు.

కెవిపిని బయటకు వెళ్లిపోమన్న వెంకయ్య

రాజ్యసభలో ఏపికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కెవిపి రామచంద్ర రావు ప్లకార్డుతో చైర్మన్ పోడియం వద్ద నిరసన తెలిపారు. దీనిపై స్పందించిన రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడు ఇది సరైన విధానం కాదని, ఈరోజు కెవిపిని అనుమతిస్తే రేపు మరొకరు ఇలా నిరసన చేస్తారన్నారు. ఇలా అయితే సభను సజావుగా నడపలేనని, వాయిదా వేస్తానని వెంకయ్య హెచ్చరించారు. కెవిపిని తన సీట్లో కూర్చునేలా చూడాలని కాంగ్రెస్ పార్టీ ఎంపిలను చైర్మన్ వెంకయ్య కోరారు. నిబంధన 255 కింద ఎంపి కెవిపి తన హాజరును ఉపసంహరించుకొని, సభ నుంచి నిష్క్రమించాలని చైర్మన్ రాజ్యసభ నిబంధనావళిని చదివి వినిపించారు. దీంతో చైర్మన్ ఆదేశానుసారం బయటకు వెళ్లిపోవాల్సి వచ్చింది. ఈ సందర్భంగా కెవిపి మాట్లాడే ప్రయత్నం చేస్తే..వెంకయ్య దాన్ని రికార్డుల్లో చేర్చరాదని, రాజ్యసభ టివి కెమెరాలు ఆపాలని వెంకయ్య సూచించారు.

హోం మంత్రిని కలిసిన వైసిపి ఎంపిలు

కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో వైసిపి ఎంపిలు భేటీ అయ్యారు. ప్రత్యేక హోదాతో పాటు విభజన చట్టం హామీలు అమలు చేయాలని కేంద్ర హోం మంత్రిని కోరారు. ఈ భేటీలో ఎంపిలు వైవి సుబ్బారెడ్డి, విజయసాయి రెడ్డి, వరప్రసాద్, అవినాష్ రెడ్డి, మిథున్ రెడ్డిలు పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఏపి ప్రజల కష్టాలను రాజ్‌నాథ్ సింగ్‌కు వివరించామని వైసిపి ఎంపిలు తెలిపారు. హామీల అమలుపై టిడిపి కేంద్రంపై ఒత్తిడి చేయడం లేదన్నారు.

సిపిఎం తెలంగాణ కార్యదర్శిగా తమ్మినేని

(మొదటిపేజీ తరువాయి)

నర్సింహ్మారెడ్డి, సున్నం రాజయ్య, బి వెంకట్, టి జ్యోతి, జూలకంటి రంగారెడ్డి, పి సుదర్శన్‌రావు, జి రాములు, డిజి నర్సింహారావు

రాష్ట్ర కమిటీ సభ్యులు

ఎం సాయిబాబు, జె వెంకటేష్, పాలడుగు భాస్కర్, ఎస్ రమ, టి సాగర్, పి జంగారెడ్డి, బి హైమావతి, జాన్‌వెస్లీ, కిల్లె గోపాల్, బండారు రవికుమార్, పివి శ్రీనివాస్, ఎం సుబ్బారావు, ఎ నర్సిరెడ్డి, బి బిక్షమయ్య, హిమబిందు, ఆర్ శ్రీరాంనాయక్, ఎంవి రమణ, పి జయలక్ష్మి, ఆర్ వెంకట్రాములు, మల్లు లక్ష్మి, పి ఆశయ్య, పి ప్రభాకర్, రవి, ఎండి అబ్బాస్, పొన్నం వెంకటేశ్వర్లు, నున్నా నాగేశ్వరరావు, బుగ్గవీటి సరళ, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, తుమ్మల వీరారెడ్డి, ఎం సర్వయ్య, ముల్కలపల్లి రాములు, ఎం నాగార్జునరెడ్డి, పారేపల్లి శేఖర్‌రావు, మచ్చ వెంకటేశ్వర్లు, ఎజె రమేష్, కో ఆప్షన్, ఎండి జహంగీర్, కొండమడుగు నర్సింహ, సాదుల శ్రీనివాస్, భూపాల్, కో ఆప్షన్, సారంపల్లి వాసుదేవరెడ్డి, ఆముదాల మల్లారెడ్డి, సూడి కృష్ణారెడ్డి, ఎం శ్రీనివాస్, టి భీంరావు, రత్నమాల, ముకుందరెడ్డి, జి జగదీశ్, టి స్కైలాబ్‌బాబు

ఆహ్వానితులు: కాసాని ఐలయ్య, ఆర్ సుధాభాస్కర్, పి సోమయ్య, నాగటి నారాయణ, ఎండి జబ్బార్, ఎ మల్లేష్, జి మల్లేష్

ప్రత్యేక ఆహ్వానితులు: మల్లు స్వరాజ్యం, సారంపల్లి మల్లారెడ్డి, పి రాజారావు, కంట్రోల్ కమిషన్ ఎస్ వినయకుమార్ (చైర్మెన్), లెల్లెల బాలకృష్ణ, ఎన్ సోమయ్య, మర్లపాటి రేణుక, బి మల్లేష్



వినివలతో కూడిన సమాజానికి కృషి

(మొదటిపేజీ తరువాయి)


కళాశాలలు, ఆస్పత్రులు రానున్నాయని, రాజధానిని ఒక బ్లూ అండ్ గ్రీన్ సిటీగా నిర్మిస్తున్నామని చెప్పారు. మాతా అమృతానంద విద్యాపీఠం అధ్యక్షులు, బోర్డు ఆఫ్ మేనేజ్‌మెంట్ స్వామి అమృతా స్వరూపానందపురి మాట్లాడుతూ అమృత విద్యాపీఠం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో మంత్రులు కామినేని శ్రీనివాస్, గంటా శ్రీనివాసరావు, పి.నారాయణ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ షేక్ జానీమూన్, సిసిఎల్ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, జిల్లా కలెక్టర్ కోన శశిధర్ పాల్గొన్నారు.



ఎన్టీఆర్

మార్చిలో ముహూర్తం

ఏదైనా పాత్ర ఇస్తే దాంట్లో ఉన్నంతలో ఉత్తమంగా మెప్పించడానికి తన వంతు ప్రయత్నం చేస్తుంటాడు ఎన్టీఆర్. తన కాయాన్ని తగ్గించుకోవాలనుకున్నాడు వెంటనే అది 'యమదొంగ'లో చూపించాడు. 'టెంపర్'లో సిక్స్ ప్యాక్‌తో మెరిశాడు. విభిన్నమైన పాత్రలతో 'జై లవకుశ'లోనూ మెప్పించాడు. ఈసారి చేసేది కుటుంబ కథా చిత్రమైనా పాత్రలో కొత్తదనం కోసం ఇప్పటికి నాలుగు నెలలుగా శ్రమిస్తున్నాడు. కొత్త అవతారంలో కనిపించేందుకు ప్రత్యేక ట్రైనర్ వద్ద శిక్షణ తీసుకుంటున్నాడు. ఇదంతా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రం కోసం. మార్చి రెండో వారం నాటికి ఈ సినిమాలో పాత్రకు తగ్గట్టు సిద్ధమైపోతాడు ఎన్టీఆర్. అందుకే ఈ చిత్రం షూటింగ్‌కు మార్చిలో ముహూర్తం ఖరారు చేశారు. ఎన్టీఆర్‌ను కొత్తగెటప్‌లో చూపించడం కోసం హాలీవుడ్ మేకప్ ఆరిస్టు వాన్స్‌హార్ట్‌వెల్‌ను ఈ సినిమాకు పని చేయిస్తున్నారు. అనిరుధ్ రవిచంద్రన్ బాణీలు సమకూరుస్తున్నారు.



రాశీ ఖన్నా

'సైరా'పై మరో ప్రచారం



చిరంజీవి, అమితాబ్ బచ్చన్

చిరంజీవి 'ఖైదీ నంబర్ 150' తర్వాత 'సైరా నరసింహారెడ్డి' చిత్రంలో చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా మొదలైన దగ్గర నుంచి ఏదొక ప్రచారం జరుగుతూనే ఉంది. అది నిజమవుతూనే ఉంది. సంగీత దర్శకుడు రెహమాన్, బాలీవుడ్ సినిమాటోగ్రాఫర్ ఈ సినిమా నుంచి తప్పుకుంటారని మొదట ప్రచారం జరిగింది. అది నిజమైంది. ఇప్పుడు బాలీవుడ్ బిగ్ అమితాబ్ బచ్చన్ కూడా ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకుంటున్నారని ఫిల్మ్‌నగర్ టాక్. ఆయన స్థానంలో మరో నటుడి కోసం చిత్రబృందం అన్వేషిస్తుందని ఈ రూమర్ సారాంశం. ఎప్పుడూ లేనిది ఈ సారి మాత్రం రూమర్‌పై చిత్రబృందం స్పందించింది.'సైరా' టీమ్‌లో ఎలాంటి మార్పులూ లేవని, అమితాబ్ బచ్చన్ టీమ్‌లో ఉన్నారని, ఆయన తప్పుకున్నారన్న వార్తల్లో వాస్తవం లేదని తేల్చింది. డిసెంబర్‌లో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లింది. సంక్రాంతికి తీసుకున్న సుదీర్ఘ సెలవు ఈనెలలో ముగయనుంది. విజువల్ ఎఫెక్ట్స్‌తో కూడిన పార్ట్సను ఇప్పుడు చిత్రీకరించనున్నారు. దాని పని మీద చిరంజీవి చైనా వెళ్లారట. అందుకోసమే గెడ్డాలు, మీసాలు కూడా తీశారు. ఆ విషయం చిరంజీవే గతంలో చెప్పారు కూడా.

నా 'తొలిప్రేమ' 17 ఏళ్లకే

" తొలిప్రేమ'లో మొత్తం మూడు లుక్స్‌లో కనిపిస్తాను. ఒకటి 19 ఏళ్ళ వయసులోనూ, ఇంకొకటి లండన్‌లోనూ, మరొకటి కాలజీ రోజుల్లోను. చాలా అందమైన పాత్ర. నా వాస్తవ జీవితానికి దగ్గరగా ఉంటుంది. అంటే నాకు 17 ఏళ్ళ వయసులో ఒక ప్రేమ కథ ఉండేది. నా సీనియర్ నాకు ప్రపోజ్ చేశాడు. అదే నా తొలిప్రేమ. అందుకే ఈ కథ నాకు బాగా దగ్గరైంది" అని రాశీ ఖన్నా చెప్పింది. వరుణ్ హీరోగా, వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'తొలిప్రేమ'. ఈనెల 10వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా బుధవారం రాశీ ఖన్నా మీడియాతో మాట్లాడింది.

- సినిమా మొత్తం 'తొలిప్రేమ' గురించే. ఈ జనరేషన్‌లో యుక్త వయసులో ఉన్నవారిలో పుట్టే మొదటి ప్రేమ ఎలా ఉంటుంది? వయసు పెరిగి మెచ్యూరిటీ లెవెల్స్ పెరిగే కొద్దీ అది ఎలా మారుతుంటుంది అనేదే ఈ సినిమా కాన్సెప్ట్.
- పవన్ కల్యాణ్ 'తొలిప్రేమ'కు దీనికి పోలికే లేదు. 8 నెలల క్రితం ఆ సినిమా చూశాను. చాలా బాగుంది. కానీ దానికి దీనికి ఎలాంటి పోలిక ఉండదు. రెండూ పూర్తిగా భిన్నంగా ఉంటాయి.
- నా మొదటి సినిమా 'ఊహలు గుసగుసలాడే' తర్వాత నాకు బాగా నచ్చిన లవ్ స్టోరీ ఇదే. నా మనసుకు బాగా దగ్గరైంది. అందుకే చేశాను. టీజర్, ట్రైలర్ అన్నీ బాగున్నాయి. కచ్చితంగా అందరికీ నచ్చుతుంది.
- ప్రీ రిలీజ్ ఈవెంట్లో వచ్చిన రెస్పాన్స్ చాలా సంతోషంగా అనిపించింది. ముఖ్యంగా పవన్ కల్యాణ్ ఫ్యాన్స్‌కు థ్యాంక్స్ చెప్పాలి. 'తొలిప్రేమ' అనే టైటిల్ చూసి సెంటిమెంట్‌గా మాకు చాలా సపోర్ట్ చేశారు.
- వరుణ్ తేజ్ తన గురించి చెప్పుకోవడం లేదు కానీ ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాడు. వయసులో చిన్నగా కనబడటానికి రోజుకి మూడుసార్లు జిమ్‌కు వెళ్ళేవాడు. సరదాగా ఉంటాడు. అతని క్యారెక్టర్ ఈ సినిమాలో చాలా ప్రత్యేకంగా ఉంటుంది.
- నేనూ ఈ సినిమా కోసమే బరువు తగ్గా. సాధారణంగా రోజుకి గంటపాటు వ్యాయామం చేస్తా. కానీ ఈ పాత్ర కోసం ఇంకో అరగంట ఎక్కువ కష్టపడి 5 కిలోల వరకు తగ్గా. చిత్రంలో 19 ఏళ్ల అమ్మాయిగా కనబడాల్సి ఉండటం వలన ఈ ఫిజికల్ మార్పు అవసరం అని అన్నారు.
- దర్శకుడు వెంకీ అట్లూరికిది మొదటి సినిమా. అయినా అనుభవం ఉన్న దర్శకుడిలా చేశాడు. ఎక్కడా పొరపాట్లు జరక్కుండా చూసుకుని చాలా ప్రేమతో సినిమాను తీశాడు. సుమారు రెండేళ్లు అతను ఈ స్క్రిప్ట్ మీద వర్క్ చేశాడు.
- ఇష్టమైన సీన్స్ చాలానే ఉన్నాయి. అన్నిటిలోకి కార్ సీన్ బాగా నచ్చింది. ట్రైలర్లో కూడా కనబడుతుంది. చాలా అందమైన, క్యూట్ సీన్ అది.



పైరసీని నియంత్రించాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా అడ్డుకట్ట వేయలేకపోతున్నాం. సరదా కోసం సినిమాలను పైరసీ చేస్తుండటం వల్ల నిర్మాతలకు కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతుంది" అని దర్శకుడు వినాయక్ అన్నారు. ఆయన తాజాగా తెరకెక్కించిన చిత్రం 'ఇంటిలిజెంట్'. సాయి ధరమ్ తేజ్ హీరో. లావణ్య త్రిపాఠి కథానాయిక. సి. కల్యాణ్ నిర్మించారు. శుక్రవారం ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో బుధవారం వినాయక్ మాట్లాడారు.

నా దగ్గర సమాధానం లేదు

- వి.వి. వినాయక్

చిత్రం ఎలా ఉండబోతోంది?

యాక్షన్‌తో పాటు మంచి హ్యూమర్, ఎమోషన్స్, ఫైట్స్, డాన్స్ అన్నీ ఉంటాయి. 100 శాతం కమర్షియల్ ప్యాకేజ్ అనుకోండి.

సామాజిక అంశాన్ని టచ్ చేశారా?

ఆ మధ్య స్నేక్‌గ్యాంగ్ అనేది వార్తల్లో వచ్చింది. దానికి ప్యారలర్ కథగా ఎంటర్‌టైన్‌మెంట్ జోడించి తీశాం. విశ్వాసానికి మారు పేరుగా హీరో పాత్ర ఉంటుంది. చిన్నప్పటి నుండి తన ఎదుగుదలకు కారణమైన ఒక వ్యక్తికి జరిగిన అన్యాయాన్ని హీరో ఎదిరించి పోరాడుతూ, తన మైండ్ గేమ్‌తోనూ, స్నేహితులతో కలిసి ప్రతినాయకుడిని ఎలా ఎదుర్కొన్నాడు అనేదే సినిమా కథ.

లావణ్య త్రిపాఠి ఎంపిక చేయడానికి కారణం?

తేజుకు పెద్ద హీరోయిన్లను పెట్టే ఉద్దేశం లేదు. తన వయసుకు సరిపోయే హీరోయిన్లనే ఎంపిక చేయాలి. ఆవిధంగా చూస్తే.. లావణ్య కొత్తగా ఉంటుందని ఎంపిక చేశాం.

పాటలు నాలుగే పెట్టారేంటి?

'ఖైదీ నెం. 150'లో అలా పెట్టాననికాదు. సెంటిమెంట్ కూడా కాదు. పాట వచ్చేటప్పుడు కథ బ్రేక్ అవ్వకూడదు. పెడితే బోర్ కొట్టి ప్రేక్షకుడు బయటకు వెళ్ళకూడదు. అందుకే కథ ప్రకారం నాలుగే చాలనుకున్నాం.

'చమక్కు చమక్కు..'పాట రీమిక్స్ ఆలోచన మీదేనా?

'చమక్కు చమక్కు' సాంగ్ .. నాకు ఇష్టమైనది. సి. కల్యాణ్‌కి చెప్పగానే ఆయన ఇళయరాజాకి చెప్పారు. ఆయన వెంటనే తీసుకోమని చెప్పారు.

చాలామంది దర్శకులు వేరే సినిమాల నుంచి కాపీ చేసేస్తారనే విమర్శలు ఎక్కువగా విన్పిస్తుంటాయి? దీనిపై మీరెలా స్పందిస్తారు?

ఇది ఇప్పటిది కాదు.. సినిమా మొదట్లో ఈ అలవాటు ఉంది. ఏదో సినిమాను స్ఫూర్తిగా తీసుకుని చేసినవి చాలానే ఉన్నాయి. అయితే అప్పట్లో సామాజిక మాధ్యమాలు లేవు. అందుకే ప్రేక్షకులకు పెద్దగా తెలిసేదికాదు. తెలుగులో కూడా చాలా వైవిధ్యమైన సినిమాలు వస్తున్నాయి. అర్జున్‌రెడ్డి, పెళ్లిచూపులు..ఇలా భిన్నమైన కథలు వచ్చాయి కదా.

ఎప్పుడూ ఆ రెండు సినిమాలే ఎక్కువగా చెబుతున్నారు?

ఈ విమర్శలు వస్తూనే వుంటాయి

సాయి ధరమ్ తేజ్ ఎలా చేశాడు?

తను కష్టపడే మనస్తత్వం ఉన్న వ్యక్తి. తన శైలిలో చాలా బాగా చేశాడు. నటన చాలా బాగుంటుంది. ముఖ్యంగా డ్యాన్సులు అదిరిపోయేలా చేశాడు. ఒక పాటలో అయితే చిరంజీవి కనిపించేస్తారు.

థమన్ సంగీతం ఎంత హెల్ప్ అవుతుంది?

ఇంతకు ముందు 'నాయక్' సినిమా కోసం థమన్‌తో వర్క్ చేశాను. ఇప్పుడు ఈ సినిమా కోసం చేశాను. ఆయన సంగీతం చాలా బాగుంది. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అయితే ఇంకా మెప్పిస్తుంది. ఉన్న నాలుగు పాటలు సందర్భానుసారంగా వస్తూ మంచి వినోదాన్ని ఇస్తాయి.

బయట కథలే తీసుకుంటున్నారు స్వంత కథలు లేవా?

స్వంత కథ అయితే ఎక్కువ సమయం తీసుకుంటుంది. అందుకే బయట కథలు రెడీ అవ్వగానే చేసేస్తాం. రాఘవేంద్రరావుని కలిసినప్పుడు... బయట కథలు కూడా తీస్తుండాలి. లేకపోతే మన కథలే రీపీట్‌గా వస్తుంటాయి. రొటీన్‌గా అయిపోతాయి. మొనాటనీ వచ్చేస్తుంది అనేవారు. నేను బయట కథలు చేయకపోతే ఫ్యాక్షన్ దర్శకుడిగానే నన్ను చూసేవారు. కృష్ణ చేశాక.. ఎంటర్‌టైన్‌మెంట్ వచ్చింది. ఇలా భిన్నమైన కథలు రచయితల వల్లే వస్తాయి.

ఈ మధ్య మీరు రాజకీయాల్లోకి వస్తున్నారనే వార్తలొచ్చాయి. వాటిపై మీ కామెంట్?

మా ఫ్యామిలీకి రాజకీయ నేపథ్యం ఉంది. ఆ ఉద్దేశంతో అలా రాస్తూంటారు. నేను చదివి ఊరుకుంటాను. కొడాలి నాని ఒక సందర్భంలో సరదాగా అన్న మాట అది. రకరకాల రూపాల్లో బయటికొచ్చింది. నాకైతే ఇప్పుడు రాజకీయాల్లోకి రావాలనే ఉద్దేశం లేదు.

చాలామంది హీరోలకు షూటింగ్ మధ్యలోనే ఆడుతుందో లేదో తెలుస్తుందని చెబుతున్నారు. దర్శకుడిగా మీకెప్పుడూ అలా అనిపించలేదా?

అలా ఉండదు. కథ రెడీ అయ్యాక ఏరోజుకారోజు సీన్ ఎలా చేయాలనే దానిగురించే ఆలోచిస్తాం. ఇది ఆడదు అని ఎవ్వరూ అనుకోరు. ఒకవేళ అలా చెప్పగలిగారంటే వాళ్లు చాలా గొప్పోళ్లు.

ఇప్పటి ఇండస్ట్రీలో హీరో గొప్పా? దర్శకుడు గొప్పా?

అందరికన్నా సినిమా గొప్పది. ఆ సినిమాను ప్రేమించి తీసేవాళ్లే గొప్ప.

ఇప్పటి దర్శకులంతా హీరోల డేట్స్ కోసం చేతులు కట్టుకుని ఎదురుచూస్తుంటారని ప్రముఖ హీరోలు కామెంట్ చేశారు?

నా దగ్గర దానికి ఏ సమాధానం లేదు.

కాంబినేషన్ అనేది ఎంతవరకు సమంజసం?

సినిమా అనేది వ్యాపారం. డబ్బులు పెట్టేవారు దాన్ని మార్కెట్ గురించే ఆలోచించి పెడతారు. అందువల్ల కాంబినేషన్ తప్పనిసరి.

మహేష్‌బాబుతో సినిమా ఎందుకు ఆగిపోయింది?

ఇద్దరం చేయాలనుకున్నాం. దాని కోసం కథ రెడీ చేశాం. అది మహేష్‌కు నచ్చలేదు. సరైన కథ దొరికితే వెంటనే సెట్‌పైకి వెళుతుంది.

పవన్‌కల్యాణ్ సినిమాలు చేయాలని ప్రీరిలీజ్ వేడుకలో మీరు అన్నారు?

కరెక్టే. అది నా గురించి కాదు. అక్కడకు వచ్చిన ఆయన అభిమానుల కేరింతలు, రెస్పాన్స్ చూసి అన్నాను. ఆయన పేరు చెప్పగానే పిచ్చ స్పందన వచ్చింది. అందుకే సినిమాలు చేయాలని సరదాగా అన్న మాటలు.

నేను ఒంటరినే

ప్రియాంక చోప్రా



ప్రియాంక చోప్రా

బాలీవుడ్ నుంచి హాలీవుడ్‌కు ఎదిగిన తార ప్రియాంక చోప్రా. ఒక పక్క క్వాంటికో సిరీస్‌లో మెప్పిస్తూ మరో పక్క ప్రాంతీయ చిత్రాలను నిర్మిస్తుంది. ఇప్పుడు హాలీవుడ్‌లో రెండు ప్రాజెక్టుల్లో బిజీగా ఉంది. ఇటీవలో ఓ ప్రముఖ మ్యాగ్జైన్‌కు ఇంటర్వ్యూ ఇచ్చింది ప్రియాంక. మొదటిసారి తన వ్యక్తిగత విషయాల గురించి మాట్లాడింది. గత ఏడాది వరకూ చాలా రిలేషన్స్‌ను అంకిత భావంతో కొనసాగించాను. కానీ ఏడాది నేను ఒంటరినే. ఒక వేళ నేను ఎవరితోనైనా సంబంధం కొనసాగిస్తే దానికి కట్టుబడే అంకిత భావంతోనే ఉంటాను' అని చెప్పింది ప్రియాంక.

నితిన్ సరసన నందిత





నితిన్ హీరోగా తెరకెక్కుతోన్న సినిమా 'శ్రీనివాస కల్యాణం'. ఈ సినిమాలో నందితా శ్వేత కథానాయికగా ఎంపికైంది. 'ఎక్కడికి పోతావు చిన్నవాడా' తో తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈ కన్నడ బ్యూటీ తొలి సినిమాతోనే మనోళ్ల మనసును దోచుకుంది. ఈ సినిమాకు 'శతమానం భవతి' ఫేం సతీష్ వేగేశ్న దర్శకుడు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ సినిమా త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనుంది.

హోలీకి 'పరి' వచ్చేస్తుంది




దెయ్యం పాత్రలో బాలీవుడ్ హీరోయిన్ అనుష్క శర్మ భయపెట్టడం కొత్తమీ కాదు. గత ఏడాది 'ఫిలౌరీ'లో చేసింది. ఇప్పుడు మరోసారి దెయ్యంగా భయపెట్టబోతుంది. అదీ హోలీకి. ఆ చిత్రమే 'పరి'. ఇందులో నిజంగానే భయపెట్టేటట్టు కనిపిస్తుంది. ఆ విషయం టీజర్ చూస్తే అర్ధమవుతుంది. బుధవారం ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. ఫస్ట్‌లుక్‌తో ఎలా హడలుగొట్టిసిందో ఈ టీజర్‌లోనూ అంతే భయపెట్టేసింది. గొలుసులతో కట్టుకుని మొహమంతా రక్తపు మరకలతో అనుష్క గెటప్ ఒళ్లు గగుర్పొడిచేలా ఉంది. 'ఫిలౌరీ'కి దీనికి తేడా ఒక్కటే అందులో హార్రర్, ఇది హార్రర్‌తో కూడా హాస్యం. ఈ టీజర్‌లో అనుష్క గెటప్ చూస్తే సినిమాపై ఆసక్తిని పెంచేసింది. ఆ సినిమాలో అనుష్కది హాస్యంతో కూడుకున్న పాత్ర. ఇలాంటి గెటప్‌లో ఆమె ఇంతకుముందు ఎప్పుడూ నటించింది లేదు 'ఈ హోలీకి జాగ్రత్తగా ఉండండి. దెయ్యం వచ్చేస్తోంది' అని టీజర్‌లో చూపించారు.

సంగమం

సంస్కృతి, కళలపై రచనలకు ఆహ్వానం!

ఇది కళలు, సంస్కృతి, రంగస్థలం తదితర అంశాలపై ప్రత్యేక పేజీ. మీ ప్రాంత సంస్కృతి, జానపద కళలు, వాటి ప్రత్యేక విశేషాలు; నాటకం, చిత్రకళా ప్రదర్శనలపై మీరు కూడా వ్యాసాలూ, నివేదికలూ రాసి పంపవచ్చు. సాంస్కృతికరంగంలో వస్తున్న మార్పుల మంచిచెడ్డలపై విశ్లేషణాత్మక వ్యాసాలు రాయవచ్చు. మా చిరునామా : సంగమం, ప్రజాశక్తి, ఎంబి విజ్ఞానకేంద్రం, గవర్నరుపేట, విజయవాడ- 2.

సందర్భం



రావి కొండలరావు...

ఆయనో రచయిత. రాసిన కథలూ, నవలలూ, సినిమా నవలలూ, వ్యాసాలూ, నాటికలూ నాటకాలూ.. అన్నీ ఓ జాబితాకు ఎక్కిస్తే వందలకు వందలు దాటుతాయి.

ఆయన సీనియర్ నటుడు. ఇటు రంగస్థలంపైనా, అటు వెండితెరపైనా. ఎన్టీఆర్, ఏఎన్నార్, గుమ్మడి, భానుమతి వంటి ఉద్ధండులతో కలిసి నటించారు. అన్నీ లెక్కేస్తే.. లెక్కకు అందవు. ఏ లెక్కలో చూసినా ఆయన ఒక సెలబ్రిటీ. కానీ, అలాంటి స్టేటస్ ఒకటుందని ఆయన ఎప్పుడూ అనుకోరు. సాదాసీదాగా కనిపిస్తారు. ఆత్మీయులతో కలగలిసి ప్రవహిస్తారు. ఆయన రచనలు విలక్షణంగా ఉంటాయి. సులభంగా, సరళంగా, ఆహ్లాదకరంగా... అచ్చం ఆయనలానే. ప్రస్తుతం హైదరాబాదులో ఉంటున్నారు. ఈ నెల 11న ఆయన జన్మదినం. ఆ సందర్భంగా ఈ కథనం.

కొండమీది రావిచెట్టు

సీనియర్ నటులు రావి కొండలరావు పుట్టినరోజు వస్తోందనుకోగానే ఆయనకేదైనా చిరుకానుకివ్వాలి.. ఏమిస్తే బాగుంటుంది.. అని చాలాసేపు ఆలోచించా. ఎంత చించినా ఆయనకు చాలా సంతోషం కలిగించేదేంటో తోచలేదు. రావిగారెంత నిరాడంబరంగా ఉంటారో ప్రత్యక్షంగా చూస్తున్నా. దేనికీ పొంగిపోని, కుంగిపోని స్థిరచిత్తులు. ఆయనతో పరిచయం గుర్తొచ్చింది. తెరమీద లెక్కలేనన్నిసార్లు చూశాగానీ వ్యక్తిగా తెలీదు. వృత్తిలో భాగంగా ఓసారి ఆయనకు ఫోనుచేసి ఇంటర్వ్యూ కావాలని అడిగితే 'ఇవాళ, రేపు ఉండను.. ఎల్లుండి రండి' అన్నారు. ఆ ఎల్లుండి రానేవచ్చింది. చిరునామా తెలుసుకొని తిన్నగా వెళ్ళి తలుపు తట్టాను. సాదరంగా ఆహ్వానించారు. ఆయన్ని అడిగేందుకు బోల్డన్ని ప్రశ్నలు రాసికెళ్ళాను కానీ, ఒకట్రెండు తప్ప అడిగే అవకాశం రాలేదు. ఆయన తనకు తోచిన రీతిలో చెప్పడం మొదలెట్టారు. ఓ గంటయ్యాక కాఫీ కలిపి తెస్తానని లేచారు. నేను ఉలిక్కిపడి 'మీరు కాఫీ ఇవ్వడమేంటండీ?' అని వారిస్తే 'మంచివారే! మా ఇంట్లో నేనుగాక ఇంకెవరిస్తారు?' అంటూ రెండు నిమిషాల్లో చక్కటి కాఫీ ఇచ్చారు. అంత గొప్పాయన కాఫీ తెచ్చివ్వడమేంటని సిగ్గేసింది. ఆపైన మాటలకందని ఆనందమూ కలిగింది. గంటలో ముగుస్తుంది అనుకున్న ఇంటర్వ్యూ దాదాపు నాలుగ్గంటలకు సాగింది. వచ్చేసేటప్పుడు 'మీ టైమంతా తిన్నాను' అంటే 'అదేం లేదు, మీలాంటి వారితో మాట్లాడ్డం నాకూ ఆనందమే' అన్నారు.



దాగుడు మూతలు సినిమాలో గుమ్మడితో ...

ఆయన ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తుంటారు. గుమ్మడినో, ఆరుద్రనో అనుకరించారనేకంటే వాళ్ళే కళ్ళముందు నిల్చున్నట్టుంటుందంటే బాగుంటుంది. ఎంత బ్రహ్మాండమైన మిమిక్రీ ఆర్టిస్టు?! 'స్సా..య్..లెన్స్..' అంటూ తెలుగు మాస్టారిలో పరకాయ ప్రవేశం చేసి గద్దించారంటే భల్లూకాలైనా కుక్కిన పేనుల్లా మారిపోవాల్సిందే! ఆయన్ని ఇంత దగ్గరగా చూశాక మన సినిమాల్లో ఆయన్ని ఇరవై శాతం కూడా వాడుకోలేదేమో అనిపించింది. కాకపోతే ఈయనకు దక్కిన అవకాశమేమంటే.. కేవీ రెడ్డి, బీయన్ రెడ్డి, ఎన్టీఆర్, ఏఎన్నార్, సావిత్రి, భానుమతి, నాగిరెడ్డి, చక్రపాణి, కొడవటిగంటి, బుచ్చిబాబు, రేలంగి, సూర్యకాంతం, కమలాకర కామేశ్వరరావు, సముద్రాల, పింగళి నాగేంద్ర, బాపు, ముళ్ళపూడి, ఆరుద్ర, శ్రీశ్రీ, ఘంటసాల, పీబీ శ్రీనివాస్ – లాంటి ఎందరెందరో ఉద్ధండులతో కలిసి పనిచేశారు, దగ్గరగా తిరిగారు. ఆ ఆనందాలన్నీ ప్రోది చేసుకుని అద్భుతమైన జీవితాన్ని గడిపారు.

చాలాసార్లు అనిపిస్తుంది, రావిగారు ఇంత ఆలస్యంగా ఎందుకు పరిచయమయ్యారు.. ఎన్నో ఏళ్ళక్రితమే మాట్లాడి ఉండకూడదా అని. పోనీ చెన్నయ్‌దాకా వెళ్ళి పరిచయం చేసుకోలేకపోయినా ఈ ఊళ్ళో స్థిరపడ్డాకైనా వెళ్ళి కలిసుండొచ్చుగా! ఏంటో, నాలో ఇంత వెనకబాటుతనం ఎందుకో? సరే, గతాన్నెటూ మార్చలేను. ఆయన ఇంట్లో ప్రతినెలా జరిగే సా.సం.స. మీటింగులకైనా కచ్చితంగా వెళ్ళాలనుకుంటాగానీ ఒక్కోసారి ఏవో అనుకోని అవాంతరాలొచ్చిపడ్తుంటాయి. ఆ సమావేశాలకు వెళ్తే నన్ను నేను మర్చిపోతాను. అందులో సభ్యులంతా దిట్టలే! ఆ ఆనందాల్లో విహరిస్తోంటే 'రాత్రయిపోయింది, బస్సుల్లో పడి పోవాలి' అని మెదడు హెచ్చరిస్తున్నా మనసు లక్ష్యపెట్టదు. అదో అద్భుత ప్రపంచం. రాయలవారి సభ కూడా అంత నవ్వులజల్లు ఎన్నడూ కురిపించి ఉండదు. అష్టదిగ్గజాల్లో తెనాలి రామలింగడు ఒక్కడే హాస్యం పండించేది. కానీ రావి సమావేశాల్లో అందరూ హాస్యప్రియులే! అందుకే చాప్లిన్ సినిమా చూస్తున్నంత అమోఘంగా ఉంటుంది.

ఎనభైఆరేళ్ళ వయసులో కూడా వృద్ధాప్య ఛాయల్లేకుండా ఆరోగ్యంగా, ఆనందంగా ఉండే రావిని చూస్తే ముచ్చటేస్తుంది. అరవయ్యేళ్ళొచ్చేసరికి ముసలితనం ముంచుకొచ్చిందని సగం కుంగిపోయి ముక్కుతూ మూలుగుతూ ఉండేవాళ్ళు ఎవరైనా సరే.. ఆయన్ని చూస్తే ఎలా ఉండాలో నేర్చుకుంటారు. బండి నెట్టుకురాలేమేమోనని తామే నీరసాలూ నిట్టూర్పులూ ప్రదర్శిస్తే ఇక సుడిగాలి మాదిరిగా ఉండే ఈ తరం పిల్లలు పెద్దల్ని పక్కన పెట్టడంలో ఆశ్చర్యమేముంది? నిజంగా పిల్లల్నీ పెద్దల్నీ ఉత్తేజితుల్ని చేస్తుంది రావిగారి దర్బారు.

అసలిప్పటికీ ఇంత చురుగ్గా, చలాకీగా ఉండడంలో ఈయన ఆరోగ్య రహస్యమేంటా అని ఆలోచిస్తే నాకు తట్టిందొకటే! ఎప్పుడూ ఏదో ఒక పనితో తీరిక లేకుండా ఉండటమని. దాదాపు ముప్పయ్యేళ్ళు జర్నలిస్టుగా పనిచేసినా ఇప్పటికీ పెన్ను పక్కన పడేయలేదు. చక్కగా రాస్తారు. నటిస్తారు, మిమిక్రీ చేస్తారు. మంచి పాటలు వింటారు. మంచి మిత్రులతో చర్చిస్తారు, కబుర్లు చెప్తారు. సభలూ సమావేశాలకు హాజరవుతారు. ఇన్ని మంచి వ్యాపకాలతో ఆనందంగా ఉంటే ఇక చెత్త అనారోగ్యం వచ్చిపడటానికి దానిది గుండే.. చెరువా?! ఇంకా గొప్ప సంగతేమంటే తేలిగ్గా పాడవడానికి లక్ష ఆకర్షణలు, అవకాశాలూ ఉన్న సినీ పరిశ్రమలో ఉండి కూడా ఈయనకు ఒక చెడు అలవాటూ లేదు. ఆఖరికి కాఫీ టీలు కూడా పరిమితి దాటి తాగరు. టీవీ లాంటి కాలయాపన వ్యవహారాలు పెట్టుకోరు. మితంగా తిండి, అవసరమైనంత నిద్ర. ఏ వ్యసనాలూ లేకపోగా ప్రతి నిమిషాన్నీ ఆహ్లాదంగా గడిపే రావి లాంటివాళ్ళు కోటికొక్కరైనా ఉంటారా అనిపిస్తుంది.

రావిగారెప్పుడూ 'గంధపు చెట్లలాంటి పెద్దలతో కలిసి తిరిగినందున నాకూ కాస్త ఆ వాసన సోకిందంతే' అంటారు. అది కేవలం ఆయన నిగర్వం, నిరాడంబరత. నిజానికి ఆయనా ఓ గంధపుచెట్టే! ఆయన్ని చాలాసార్లు కలిసి కాలక్షేపం చేసే అవకాశం నాకు రావడం అదో అదృష్టమే! రావిగారి గురించి ఒక్కమాటలో చెప్పాలంటే – పేరుకి తగ్గట్టుగానే కొండమీది అశ్వత్థవృక్షం. ఆ ఔన్నత్యాన్ని వర్ణించడానికి మాటలు చాలవు.



ఓ అభినందన సభలో సతీమణి రాధాకుమారితో కలిసి...

- వి. నాగరత్న
94903 15051

ఎక్కడికీ నడక?

సంస్కృతి

మొన్న ఉదయం ఓ దినపత్రిక జిల్లా టాబ్లాయిడ్ చూసి– నా కళ్లను నేనే నమ్మలేకపోయాను. ఫస్ట్‌పేజీలో సుజిత నిలువెత్తు ఫొటో! బుట్టబొమ్మలాంటి డ్రెస్‌లో కళకళలాడుతోంది. ఆనందం పట్టలేకపోయాను. ఇంతకీ ఎందుకా అని కింద చూసేసరికి 'నడిచే ఓ అందమా' అని క్యాప్షన్ కనిపించింది. గబగబా వార్త చదివాక అర్థమైంది : సుజిత తమ కాలేజీ యువజనోత్సవాల్లో ఫ్యాషన్ షోలో పాల్గొందని. తను మా అక్క కూతురు. బాగా చదువుతుంది. మరో ఆరు నెలల్లో ఇంజనీరింగ్ అయిపోతుంది.

'పిన్నీ పిన్నీ' అంటూ కొంగు పట్టుకొని వెంట తిరిగిన సుజిత – ఇప్పుడు ఎంత పెద్దదైందీ ...! హఠాత్తుగా ఫొటో చూసినప్పుడు ఎంత ఆనందం కలిగిందో – క్షణం తర్వాత అంతే ఆవేదన నన్ను అల్లుకుంది. సుజిత చాలా సింపుల్‌గా పెరిగింది. అందం, అలంకరణల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ ఉండేది కాదు. మా ఇంట్లో పెంపకమూ అలాగే ఉండేది. అలాంటి అమ్మాయి... ఇలా కనిపించేసరికి మనసు అదోలా అయిపోయింది.

విద్యాలయాల్లో సౌందర్య ప్రదర్శన

ఒక్క సుజితే కాదు; చాలామంది పిల్లలు ఇలా తయారు చేయబడుతున్నారు. ఆధునికత పేరిట అందచందాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇప్పుడు ఇదొక సంస్కృతి అయిపోయింది. మామూలుగా చూస్తే– 'దీన్లో పోయిందేముందిలే... ఏదో సరదా..' అనిపిస్తుంది. కానీ, అది క్రమేణా ఎలాంటి విలువలను పెంపొందిస్తుంది? ఎలాంటి మనస్తత్వాలను రూపొందిస్తుంది? కొన్ని దారుణ పరిణామాలకు, ఇలాంటి సంస్కృతికి ఉన్న సంబంధం ఏమిటి?

జనవరి మొదలు కొని ఏప్రిల్ వరకూ రాష్ట్రంలోని చాలా ఇంజనీరింగ్ కాలేజీలు రకరకాల పేర్లతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తాయి. అద్భుతమైన అలంకరణలూ, ఆకర్షణీయమైన ఏర్పాట్లూ చేస్తాయి. అయితే, ఏ యువజనోత్సవంలోనూ సామాజిక సమస్యలపై డిబేట్స్ ఉండవు.. దేశభక్తిని పెంచే మాటలు ఉండవు. నేటి వాస్తవ పరిస్థితులపై సెమినార్లు ఉండవు. ఉండేవన్నీ ఫ్యాషన్ షోలను తలపించే కార్యక్రమాలే! కొత్త ట్రెండ్సు పేరిట పెడ ధోరణుల ప్రదర్శనలే..! ఈ ఉత్సవాలకు టీవీ యాంకర్లను, వర్ధమాన సినీతారలను రప్పించి, డ్యాన్సులు చేయించడం ఇంజనీరింగ్ కాలేజీల్లో ఒక అలవాటుగా మారిపోయింది. ఎంటర్‌టైన్‌మెంటు పేరిట ఏ వెర్రిమొర్రి వేషాలు వేయించటానికైనా కాలేజీ యాజమాన్యాలు సిద్ధమవుతున్నాయి.

ఏ విలువలకు ఈ ప్రస్థానం?

గతేడాది నవంబర్లో విశాఖపట్నంలో అందాల పోటీలు జరిగాయి. 'లోకల్ టాలెంట్ సెర్చ్' పేరిట దాదాపు నెలపాటు ఈ హంగామా జరిగింది. మహిళా సంఘాలు అభ్యంతరం పెట్టినా, పోలీసులు నిర్వాహకులకు రక్షణగా నిలబడి మరీ పోటీలు సాగేలా చూశారు. ఇలాంటి పోటీల్లో ఒకమ్మాయిని 'నగర సుందరి'గా ప్రకటిస్తారు. మిగిలిన అమ్మాయిలు నిరుత్సాహపడకుండా రకరకాల టైటిళ్లు కట్టబెడతారు. నవ్వుకొకటి, నడుముకొకటి, జుట్టుకొకటి, రంగుకొకటి, కళ్లకొకటి, ముఖానికొకటి.... ఇలా అంగాంగ సౌందర్యానికి గుర్తింపు ట్యాగులు కడతారు. పాల్గొన్న అమ్మాయిలూ తెగ మురిసిపోతారు. ఈ అమ్మాయిలందరూ కార్పొరేట్ కళాశాలల్లో చదువుతున్నవారే కావడం గమనార్హం.

పసిపిల్లల దశ నుంచే ...

చిత్రమేమిటంటే – ఊహ తెలియని చిన్న పిల్లలకు కూడా ఇప్పుడు ఫ్యాషన్ షోలు నిర్వహిస్తున్నారు. ప్రతి ప్రయివేటు స్కూలు వార్షికోత్సవంలోనూ ఈ ధోరణి కనిపిస్తోంది. టీవీల్లో ఇలాంటి పిల్లల షోస్ చూసి, తమ పిల్లలూ అలా కనిపిస్తే బాగుణ్ణు అని చాలామంది తల్లిదండ్రులు మానసికంగా సంసిద్ధమవుతున్నారు. స్కూళ్లల్లో చిన్న పిల్లలచేత క్యాట్ నడకలు నడిపిస్తున్నారు. ఒక అమ్మాయి ఒక అబ్బాయి జంటగా వేదికమీద మెలికలు తిరుగుతూ పెనవేసుకొని నడుస్తుంటే – చప్పట్లు కొడుతున్నారు. పసిపిల్లల చేత కార్పొరేట్ విద్యాలయాలు చేయిస్తున్న ఈ వెకిలి చేష్టలు అధికార యంత్రాంగానికి తెలీవా? స్కూలు యాజమాన్యాలు పిల్లలతో అభ్యంతరకరమైన సినిమా పాటలకు స్టెప్పులేయిస్తుంటే తల్లిదండ్రులు మురిసిపోయి చప్పట్లు కొడుతున్నారు. ఒకప్పుడు స్కూలు వార్షికోత్సవాలు పిల్లల్లోని ప్రతిభను, సృజనాత్మకతనూ వెలికితీసే వేదికలుగా ఉండేవి. అలాగే దేశభక్తి, సామాజిక స్పృహ పెంపొందించే కార్యక్రమాలు ఉండేవి. ఇప్పుడా పరిస్థితి చాలా స్కూళ్లల్లో కనిపించటం లేదు. దాదాపు అన్నిచోట్లా సినిమా పాటలూ, డ్యాన్సులూ తప్పనిసరై కనిపిస్తున్నాయి. మనం ఇప్పుడు ఏ మొక్కను నాటితే రేపు ఆ ఫలాలు వస్తాయి. ఆడపిల్లలపై అత్యాచారాలూ, యాసిడ్ దాడులూ, ప్రేమించలేదని చంపేయడాలూ వంటి సంఘటనలు విష సాంస్కృతిక భీజాల ఫలితాలే! ఈ విషయాన్ని ప్రతి ఒక్కరం గుర్తించాలి. మంచి ఆలోచనలనూ, మంచి నడవడికనూ పెంచే పద్ధతులను ప్రోత్సహించాలి. మనం మన గురించి ఆలోచించటమే కాదు; సమాజపు బాగోగుల గురించీ పట్టించుకోవాలి.

- ఎల్. శాంతి



జానపద గీతాల్లో జన జీవన సౌరభం

ఆదిమ కాలం నుంచి ఆధునిక కాలం వరకూ జీవన విధానాన్ని, క్రమవికాసాన్ని ప్రతిబింబించేది జానపద సాహిత్యం. ప్రకృతి ఒడిలో పుట్టిన జానపదుల మాటలు, పాటలు, వారి స్వచ్ఛమైన మానసిక స్వభావాన్ని, నిర్మలత్వాన్ని, హృదయ భావుకతను తెలియజేస్తాయి.

జనపదం అంటే పల్లెటూరు. జనపదాల్లో నివసించేవారు జానపదులు. సంగీత సాహిత్యాలు సమపాళ్ళల్లో మేళవించిన సంపూర్ణ రూపం జానపద సాహిత్యానిది. అలెన్ డండస్ అన్నట్లు ప్రత్యేకంగా జనపదులంటూ లేరు. పల్లెల్లో నివసించేవారే కాదు, పట్టణాల్లో ఉంటూ కూడా ఆచార వ్యవహారాలు, నమ్మకాలు, అలంకరణలు మొదలైన విషయాల్లో గేయాలు, పొడుపు కథలు, సామెతలు, తిట్లు, ఒట్లు, ఆచార వ్యవహారాలు, దుస్తులు, అలంకరణలు... మొదలైనవన్నీ స్త్రీల జానపద విజ్ఞానంలోనివే. మనదేశంలో జానపదం ప్రత్యేకంగా గుర్తించే విధంగా ఇంకా నిలిచి ఉంది. ఈ కారణంగా జానపదుల కళలు, ఆచారాలు, సంస్కృతి, జానపదుల భాష, జానపదుల విశ్వాసాలు, జానపదుల సాహిత్యం, పండగలు, ఆటలు ఇవన్నీ ఈనాటికీ వేర్వేరుగా గుర్తించి, ప్రదర్శించి పరిరక్షించే పద్ధతులు కొనసాగుతున్నాయి.



ఆదిమ మానవునితో పాటే అతని నడవడికలు, పద్ధతులు, ఆచారాలు, నమ్మకాలు వచ్చాయి. వాటిని గురించి అధ్యయనం ఒక శాస్త్రంగా అభివృద్ధి చెందింది. అదే జానపద విజ్ఞానం. దీనిని ఇంగ్లీష్‌లో Folk-Lore అని అంటారు. ఈ పదాన్ని సృష్టించినవాడు W.J.Thoms. జానపదుల ఆచారాలు, సాంప్రదాయాలు, విశ్వాసాలు, కథలు, గేయాలు, సామెతలు, పొడుపు కథలు మొదలైన విజ్ఞానమే 'జానపద విజ్ఞానం'. ఈ జానపద విజ్ఞానం అత్యంత ప్రాచీనకాలానికి సంబంధించిన సాంప్రదాయక జ్ఞానమని, మరో విధంగా చెప్పాలంటే అది సజీవ శిలాజం (Living fossil) వంటిదని కొందరి అభిప్రాయం. జానపద విజ్ఞానం, జానపద సంస్కృతి, జానపద జీవనం వేరు కాదు. ఆదిమ మానవుని నుంచి, నేటి నాగరిక మానవుని వరకూ ఆయా కాలాల్లో మనిషి తన అభ్యున్నతి కోసం చేసిన కృషి సంస్కృతి. జానపదుల జీవనానికి సంబంధించిన గేయాలు, కథలు, సామెతలు, భాష, నమ్మకాలు, దుస్తులు, ఆటలు, వంట, వైద్యం, కళలు మొదలైనవి జానపద విజ్ఞానంలో భాగాలే!

జానపద సాహిత్యం సృష్టికర్తలు అక్షర జ్ఞానం లేని గ్రామీణులు. వారి శ్రమలో, జీవనంలో భాగంగా ఈ పాటలు పురుడు పోసుకుంటాయి. ఒక తరం నుంచి ఇంకో తరానికి సంక్రమించిన కథలు, గాథలు, గేయాలు మొదలైన వాఙ్మయ రాశియే జానపద విజ్ఞానం. ఇందులో స్త్రీలకు సంబంధించిన విజ్ఞానమంతా స్త్రీల జానపద విజ్ఞానం అవుతుంది. జానపద గేయాలు – సాంఘిక చరిత్ర సంపాదకులు డాక్టర్ బి. రామరాజు, నాయిని కృష్ణకుమారి ప్రకారం జానపద సాహిత్యంలో చిన్నపిల్లలు తల్లి దగ్గర నుంచి ప్రాథమిక జీవన పద్ధతులను నేర్చుకోవడం కనిపిస్తుంది. చెయ్యి విసరటం, దోగాడడం, అంకెలు లెక్కపెట్టడం, పరిగెత్తడం మొదలైన అన్నింటినీ పాటల ద్వారా తల్లి పిల్లలకు విదితమయ్యే పద్ధతిలో



చెబుతుంది. ఆ విధంగా ఆమెయే మొదటి విద్యాగురువు. జానపద మహిళ నిసర్గ కవయిత్రి. నిద్ర లేచింది మొదలు నిద్రపోయేదాకా మేలుకొలుపు పాటలు, రామాయణ, మహాభారత, భాగవతాది కథలు గల పాటలు బిడ్డల అల్లరికి ముచ్చట పడి కృష్ణ లీలలు పాడేది. పెండ్లిళ్లలో ప్రతి సన్నివేశంలో ఒక పాట, వినోదం కల్పించటానికి కొన్ని, బంధువులతో సరసం ఆడేటప్పుడు పాడుకొనే పాటలు, విషాద సమయాల్లో పాడుకొనే పాటలు, మంగళహారతి పాటలు.. ఇలా ఎన్నో ఉన్నాయి. స్త్రీల గేయాల్లో కథారహిత గేయాలు, కథాసహిత గేయాలు అని రెండు రకాలు ఉంటాయి. ఇంకా పాటల్లో జానపదుల జీవితానుభవాలు, కష్టసుఖాలూ ఉంటాయి. వీటి ద్వారా వీరి జీవిత విధానం మనకు వ్యక్తమవుతుంది.

శ్రామిక గేయాల్లో వ్యవసాయ సంబంధ గేయాలు, గృహానికి సంబంధించినవి ఉంటాయి. ముఖ్యంగా వానపాటలు, విత్తనాలు చల్లేటప్పుడు, నాట్లు వేసేటప్పుడు, కలుపు తీసేటప్పుడు, చేను కావలికి, కోతల సమయంలో, దంపుళ్ళు, ఏతాం పాట, రోకలి పాటలు చాలా నిక్షిప్తమై ఉన్నాయి. ఉదాహరణకు: వానలు కురవాలని జానపద స్త్రీలు పాడిన పాట చూడండి.

'వానదేవుడా! వానదేవుడా!
వానల్లు కురిపించు వానదేవుడా !
కప్పతల్లి నీళ్ళాడే వానదేవుడా
కడవనిండ నీళ్ళొచ్చే వానదేవుడా
చెరువులన్ని నిండాలి వానదేవుడా

ఇంకా కోతల సమయంలో కొడవళ్ళు పట్టుకుని, పంటనూర్చే సమయంలో, వ్యవసాయ పనులు చేసే సమయంలో వ్యవసాయ సంబంధమైన గేయాలు పాడుకుంటారు. గృహజీవనానికి సంబంధించి చూస్తే– కవ్వం పాటలు, రోకటి పాటలు, విసుర్రాయి పాటలు, రాట్నం పాటలు ఉంటాయి. పని చేసే సందర్భాల్లో శ్రమ తెలియకుండా ఉల్లాసంగా సాగిపోటానికి ఈ పాటలు దోహదపడతాయి.

'నాచేతి రోకళ్ళు నల్ల రోకల్లు
చేయించు అన్నయ్య చేవ రోకల్లు
వేయించు అన్నయ్య వెండి పొన్నుల్లు'

'దంపు దంపు అని యేరు అది యెంతదంపు
ధాన్యరాసుల మీద చెయ్యేసినట్లు
వంట వంట అనియేరు అదియెంత వంట
వదినతో మరదల్లు వాదాడినట్లు'

'రోకలి చిన్నాది రోలు చిన్నాది
నా తోటి పోటేసే చెలియ చిన్నాది'

అంటూ జానపద స్త్రీలు దంపుళ్ళ సమయంలో పాడుకునేవాళ్లు. ఈ గేయాల ద్వారా మనకు ఎన్నో విషయాలు, ఆచార సాంప్రదాయాలు తెలుస్తున్నాయి. కానీ జానపద గేయాలు చాలావరకూ మరుగున పడిపోతున్నాయి. ఇలాంటి మొదలైన ఎన్నో పాటలేకాక పొడుపు కథలు, సామెతలు, మౌఖిక జానపద విజ్ఞానం.. నిరక్షరాస్యులైన జానపద స్త్రీల దగ్గర సజీవ కొనసాగింపు లేక అదృశ్యమైపోతోంది. నగరీకరణ, ప్రపంచీకరణల పరిణామాలు ఈ స్త్రీల జానపద సాహిత్యానికి నష్టదాయకంగా పరిణమించాయి. ఎంతో విలువైన జానపద మౌఖిక సాహిత్యంపై లోతుగా పరిశోధనలు జరిపి, పుస్తకాల రూపంలో భద్రపరచటం చాలా అవసరం.

- ఎం. రేణుక

ఐసీసీ మహిళాక్రికెట్ ఛాంపియన్‌షిప్

మెరిసిన మంధాన



- వన్డే సిరీస్ భారత్ కైవసం
- దక్షిణాఫ్రికాపై 178 పరుగుల తేడాతో ఘన విజయం

కింబర్లీ : ఐసీసీ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న భారత మహిళాజట్టు రెండో వన్డే మ్యాచ్‌లోనూ గెలుపొందింది. బుధవారం సఫారీజట్టుతో తలపడి 178 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. స్మృతి మంధాన (135) వ్యక్తిగతంగా అత్యధిక పరుగుల రికార్డ్ సాధించింది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్ చేసిన భారతజట్టు నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 302 పరుగుల భారీస్కోర్ చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సఫారీ మహిళలు కేవలం 124 పరుగులకు ఆలౌట్ అయ్యింది. పూనమ్ యాదవ్ 4, గైక్వాడ్, దీప్తి శర్మలకు తలా రెండు వికెట్లు చొప్పున లభించాయి. అంతకుముందు మంధాన కెరీర్‌లో మూడో శతకం సాధించడమే కాకుండా ఈ మ్యాచ్‌ద్వారా అత్యధిక పరుగుల రికార్డ్‌ను నెలకొల్పింది. వేదా కృష్ణమూర్తి, హర్మన్‌ప్రీత్ కౌర్ అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. మూడు వన్డేల సిరీస్‌లో ఈ విజయంతో మహిళాజట్టు 2-0తో వన్డే సిరీస్‌ను కైవసం చేసుకుంది. తొలి వన్డేలోనూ 88 పరుగుల తేడాతో సఫారీజట్టుపై గెలిచింది. 3వ మరియు చివరి వన్డే శనివారం జరగనుంది. అనంతరం ఇరుజట్ల మధ్య ఐదు టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి.



జులన్ గోస్వామి రికార్డ్

మహిళా వన్డే క్రికెట్ చరిత్రలో 200 వికెట్లు సాధించిన తొలి మహిళా క్రికెటర్‌గా జులన్ గోస్వామి రికార్డ్ సృష్టించింది. కుడిచేతివాటం ఫాస్ట్‌బౌలర్ అయిన గోస్వామి 2002లో ఇంగ్లండ్‌తో తొలి వన్డేలో అరంగేట్రం చేసింది. సఫారీ జట్టు బ్యాట్స్‌ఉమన్ లౌరా వాడ్వేర్ట్‌ను ఔట్ చేయడం ద్వారా గోస్వామి ఈ ఫీట్‌ను సాధించింది.

సఫారీలపై సవారీ



- దక్షిణాఫ్రికాపై 124 పరుగుల తేడాతో ఘన విజయం
- 160 పరుగులతో రాణించిన టీమిండియా సారథి

కేప్‌టౌన్ : భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరుగుతున్న మూడో వన్డేలోనూ టీమిండియా విజయం ఘన విజయం సాధించింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్ చేసిన భారతజట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 303 పరుగుల భారీ స్కోర్ సాధించింది. అనంతరం ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సఫారీ జట్టు 40 ఓవర్లలో 179 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో ఆరు వన్డేల సిరీస్‌లో 3-0 ఆధిక్యతలో టీమిండియా నిలిచింది.

టాస్ ఓడి బ్యాటింగ్ దిగిన భారత్‌కు ఆశించిన శుభారంభం దక్కలేదు. ఓపెనర్ రోహిత్ శర్మ మరోమారు విఫలమయ్యాడు. రబాడ వేసిన ఇన్నింగ్స్ ఆరో బంతికే కీపర్ హెన్రిచ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత కోహ్లి సెంచరీతో కదం తొక్కాడు. సఫారీ జట్టుతో జరిగిన మూడో వన్డేలో అజేయంగా 160 సాధించాడు. దీంతో టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 303 పరుగుల భారీ స్కోర్ సాధించింది. కోహ్లికి తోడుగా ఓపెనర్ శిఖర్ ధావన్ 76 పరుగు లతో రాణించాడు. వీరిద్దరి జోడీ 140 పరుగుల భాగస్వామ్యాన్ని నిర్మించింది. రబాడ వేసిన తొలి ఓవర్ చివరి బంతికి ఓపెనర్ రోహిత్ శర్మ డక్కౌట్ అయ్యాడు. దీంతో కోహ్లి-ధావన్‌ల జోడీ జాగ్రత్తగా ఆడుతూ రన్‌రేట్ తగ్గకుండా విలువైన భాగస్వామ్యాన్ని నిర్మించారు. టీమిండియా స్కోర్ 140 పరుగుల వద్ద ధావన్ డుమిని బౌలింగ్‌లో మార్క్రమ్‌కు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. రోహిత్ నిష్క్రమణ అనంతరం శిఖర్ ధావన్ అండతో సారథి చెలరేగి ఆడాడు. ఈ సెంచరీతో వ్యక్తిగతంగా విరాట్ వన్డేల్లో 34వ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ధావన్ ఈ వన్డేలోనూ అర్ధ సెంచరీని సాధించి ఈ సిరీస్‌లో రెండో అర్ధసెంచరీని సాధించాడు. కోహ్లి 159 బంతులను ఎదుర్కొని 12 ఫోర్లు, రెండు సిక్సర్లు సాయంతో 160 పరుగులను నమోదు చేశాడు.

ఈ వన్డే సిరీస్‌కు ముందు దక్షిణాఫ్రికా గడ్డపై కోహ్లి ఒక్క శతకం కూడా సాధించలేదు. ఇప్పుడు ఏకంగా మూడు వన్డేల్లోనే రెండు శతకాలు బాది... అటు సారథిగానూ రికార్డు సాధించాడు. కపిల్ దేవ్ (175-జింబాబ్వేపై 1983లో) తర్వాత విదేశాల్లో అత్యధిక వ్యక్తిగత పరుగులు సాధించిన భారత సారథిగా ఘనతకెక్కాడు. కెరీర్‌లో 34వ శతకాన్ని నమోదుచేసి సారథిగా గంగూలీ 11 శతకాలు చేసిన రికార్డ్‌ను కోహ్లి (12) సెంచరీతో అధిగమించాడు. దక్షిణాఫ్రికాలో అత్యధిక పరుగులు సాధించిన భారత ఆటగాడిగానూ నిలిచాడు. ధోనీ వికెట్ 400 మందిని పెవిలియన్‌కు పంపిన తొలి భారతీయ వికెట్ కీపర్‌గా రికార్డ్ సృష్టించాడు. అందులో 294 క్యాచ్‌లు, 106 స్టంపింగ్స్ ఉన్నాయి.

దక్షిణాఫ్రికా బౌలర్లు డుమిని 2, ఫెహ్లుక్వాయో, లుంగ్డీ, తాహిర్‌లకు తలా ఒక వికెట్ చొప్పున లభించాయి.

భువితో కలిసి వేట

మిడిలార్డర్ విఫలమైనా విరాట్ కోహ్లి పరుగుల వేట ఆపలేదు. భువనేశ్వర్ కుమార్ (16) సహకారంతో రాణించాడు. ఏడో వికెట్‌కు 67 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పింది ఈ జోడీ. అనవసర షాట్లకు ప్రయత్నించక చివరివరకూ క్రీజ్‌లో ఉన్నాడు.



ధోనీ రికార్డ్...

దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మూడో టెస్టులో టీమిండి యా మాజీ సారథి, వికెట్ కీపర్ ఎంఎస్ ధోనీ రికార్డ్ సాధించాడు. వికెట్ కీపర్‌గా 400మందిని ఔట్ చేసిన తొలి భారతీయ క్రికెటర్‌గా ఈ ఫీట్ సాధించాడు. కుల్‌దీప్‌యాదవ్ వేసిన బౌలింగ్ మార్క్రమ్‌ను మెరుపు వేగంతో స్టంపౌట్ చేయడం ద్వారా ఈ ఘనత సాధించాడు. వ్యక్తిగతంగా అవుట్ చేసిన వాటిలో 294 క్యాచ్‌లు, 106 స్టంపింగ్స్ ఉన్నాయి. అంతర్జాతీయ క్రికెట్‌లో 400 వికెట్లు కూల్చిన నాలుగో బ్యాట్స్‌మన్. ధోనీమంటే ముందువరుసలో గిల్‌క్రిస్ట్, కుమార సంగక్కర, మార్క్ బౌచర్‌లు ఉన్నారు.

ఆస్ట్రేలియా విజయం

హోబర్ట్ : ఆస్ట్రేలియా-ఇంగ్లండ్-న్యూజిలాండ్‌ల మధ్య జరిగే ట్రయాంగులర్ టీ20లో ఆస్ట్రేలియా రెండో విజయాన్ని నమోదు చేసుకుంది. బుధవారం ఇంగ్లండ్‌తో తలపడిన ఆసీస్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలిగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేయగా... ఆ లక్ష్యాన్ని ఆసీస్ 18.3 ఓవర్లలో సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ మ్యాక్స్‌వెల్ 58 బంతుల్లో అజేయంగా 103 పరుగులు చేసి గెలిపించాడు.

వరల్డ్ సిరీస్ బాక్సింగ్

నేడు కజకిస్తాన్‌తో ఢీ

న్యూఢిల్లీ : వరల్డ్ సిరీస్ బాక్సింగ్‌లో భాగంగా గురువారం భారత బాక్సర్లు కజకిస్తాన్‌తో తలపడనున్నారు. ప్రపంచ సిరీస్ బాక్సింగ్‌లో భారత టీమ్ తొలిసారి ప్రాతినిధ్యం వహిస్తోంది. తొలి మ్యాచ్‌లో కవిందర్ సింగ్ బిస్త్ కజకిస్తాన్‌కు చెందిన అస్తనా అర్లాన్స్‌తో తలపడతాడు. కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణపతక విజేత, కోచ్ సచిన్ మాట్లాడుతూ తమ బాక్సర్లు అంతర్జాతీయంగా రాణిస్తున్నారని... ఈ పోటీకోసం ఆతృతగా ఎదురు చూస్తున్నారని తెలిపాడు. ఐదుగురు బాక్సర్లతో కూడిన భారతజట్టులో కవిందర్ సింగ్ బిస్త్ (ఫ్లై వెయిట్), అంకుష్ దహియా (లైట్ వెయిట్), దుర్యోధన్ సింగ్ నేగి (వెల్టర్ వెయిట్), బ్రిజేష్ యాదవ్ (లైట్ హెవివెయిట్), ప్రవీణ్ కుమార్ (సూపర్ వెయిట్) క్యాటగిరీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

నేడు ఐస్ క్రికెట్ మ్యాచ్



స్విట్జర్లాండ్ : రెండు టీ10 ఐస్ క్రికెట్ మ్యాచ్‌లో తొలిమ్యాచ్ గురువారం జరగనుంది. భారత్-పాకిస్తాన్ ద్వైపాక్షిక సిరీస్‌లు జరగని కారణంగా ఈ మ్యాచ్‌కు ప్రాధాన్యత సంతరించుకుంది. డైమండ్స్ జట్టుకు వీరేంద్ర సెహ్వాగ్ నాయకత్వం వహిస్తుండగా... రాయల్స్ జట్టుకు షాహిద్ అఫ్రిది కెప్టెన్‌గా ఉన్నాడు. డైమండ్స్ జట్టులో సెహ్వాగ్‌తోపాటు జహీర్‌ఖాన్, మహ్మద్ కైఫ్, అజిత్ అగార్కర్, జోగిందర్ శర్మలు మనదేశం తరపున పాల్గొంటున్నారు. సోనీ టీవీలో మధ్యాహ్నం 3.30 గంటలకు ఈ మ్యాచ్ ప్రసారం కానుండగా... రెండో టీ10 శుక్రవారం జరగనుంది.

కేరళ-బెంగాల్ మ్యాచ్ టై

కలకత్తా : విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా బుధవారం జరిగిన వన్డే మ్యాచ్ టైగా ముగిసింది. మనోజ్ తివారి సారథ్యంలోని బెంగాల్ జట్టు... సచిన్ బేబీ కెప్టెన్సీలోని కేరళతో తలపడి 235 పరుగుల వద్దే మ్యాచ్‌లను ముగించాయి. తొలిగా బ్యాటింగ్ చేసిన కేరళ జట్టు 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 235 పరుగులు చేయగా... లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో బెంగాల్ జట్టు కూడా 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 235 పరుగులు మాత్రమే చేసి టైగా ముగించింది. దీంతో ఇరుజట్లకు రెండేసి పాయింట్లు వచ్చాయి.

ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్

క్వార్టర్స్‌కు భారతజట్టు



అలోర్ సెటార్ (మలేషియా) : శ్రీకాంత్ సారథ్యంలోని పురుషుల బ్యాడ్మింటన్ జట్టు క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌లో భాగంగా బుధవారం మాల్దీవులతో తలపడి 5-0తో గెలుపొందింది. ఇప్పటికే ఫిలిప్పీన్స్‌పై గెలిచిన భారత షట్లర్లు రెండు విజయాలతో గ్రూప్-డి నుండి క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించారు. గ్రూప్ దశలో ఇండోనేషియాతో తలపడాల్సి ఉన్నప్పటికీ ఈ రెండు జట్లు ఇప్పటికే నాకౌట్‌కు చేరడంతో అగ్రస్థానానికై ముఖాముఖి గురువారం తలపడనున్నాయి.

షూటింగ్‌లో రాష్ట్ర పోలీసుల ప్రతిభ

- జాతీయ స్థాయిలో స్వర్ణం, రజతం..
- మరో మూడు కాంస్య పతకాలు
- విజేతలకు డిజిపి అభినందనలు



షూటింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన కృష్ణను అభినందిస్తున్న డిజిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బిఎస్ఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన 11వ ఆలిండియా పోలీస్ షూటింగ్ (స్పోర్ట్స్) ఛాంపియన్ షిప్‌లో ఆంధ్రప్రదేశ్ పోలీసులు ప్రతిభను చాటారు. మధ్యప్రదేశ్ లోని ఇండోర్‌లో జనవరి 29 నుంచి ఫిబ్రవరి 2 వరకు సెంట్రల్ ఆర్మడ్ పోలీస్ ఫోర్స్ (సిపిఎఫ్)ల మధ్య నిర్వహించిన క్రీడా పోటీల్లో ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఒక బంగారు, ఒక రజతంతో పాటు మూడు కాంస్య పతకాలను సాధించారు. మంగళగిరిలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో బుధవారం విజేతలను డిజిపి మాలకొండయ్య అభినందించారు. 50 మీటర్ల ఇండివిడ్యువల్‌లో బంగారు పతకం, 300 మీటర్లు ఇండివిడ్యువల్‌లో రజతం సాధించిన ఆక్టోపస్ కానిస్టేబుల్ ఎమ్ కృష్ణతో పాటు 300 మీటర్ల టీమ్‌లో కాంస్యం సాధించిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ పివి రవీంద్ర, ఆక్టోపస్ కానిస్టేబుల్ వై భరత్‌కుమార్, ఎమ్ కృష్ణలకు శుభాకాంక్షలు తెలిపారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి శాఖాపరంగా అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఎపి బెటాలియన్స్, స్పోర్ట్స్ ఐజి రాజీవ్‌కుమార్ మీనా పతక విజేతలకు తగిన ప్రోత్సాహం అందించమని ఈ సందర్భంగా డిజిపికి సిఫార్సు చేశారు. కార్యక్రమంలో శాంతి భద్రతల అదనపు డిజి హరీష్‌కుమార్ గుప్తా పలువురు అధికారులు పాల్గొన్నారు.

బంద్‌కు మద్దతుగా

నేడు పాదయాత్రకు విరామం

- జగన్ ప్రకటన
- హసనాపురంలో ముస్లింతో ముఖాముఖి
- ఇమామ్‌లకు రూ.10వేలు, మౌజన్‌లకు రూ.5వేలు
- 11వేల కిలోమీటర్లు పాదయాత్ర పూర్తి



హసనాపురంలో బహిరంగసభలో మాట్లాడుతున్న జగన్

ప్రజాశక్తి-ఆత్మకూరు, ఎఎస్‌పేట

వామపక్షాల రాష్ట్ర బంద్‌కు మద్దతుగా వైసిపి అధినేత జగన్ పాదయాత్రకు విరామం ప్రకటించారు. రేపు ఉదయం ఆత్మకూరు నియోజవకర్గంలో బంద్‌లో పాల్గొననున్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు మద్దతుగా రేపు వామపక్షాల బంద్‌కు వైసిపి బంద్ ప్రకటించిన విషయం తెలిసిందే. తిరిగి శనివారం నుంచి యాత్ర ప్రారంభమవుతుంది.శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలిగిరి,ఎఎస్‌పేట మండలాల్లో, సంగం పట్టణంలో జగన్ బుధవారం పర్యటించారు. పాదయాత్రలో భాగంగా ఎఎస్‌పేట మండలం హసనాపురంలో ముస్లింలతో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము అధికారంలోకి రాగానే ముస్లింల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని వైసిపి అధినేత జగన్‌మోహన్ రెడ్డి భరోసా ఇచ్చారు. మసీదుల్లో పనిచేసే ఇమామ్‌లకు రూ.10వేలు, మౌజన్‌లకు రూ.5వేలు వేతనం ఇస్తామని హామీ ఇచ్చారు. దుల్హన్ పథకం కింద ఆడ పిల్లల తల్లిదండ్రులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేస్తామని తెలిపారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని జగన్ తెలిపారు. అదే విధంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ మహిళలకు 45ఏళ్లకే పింఛన్ ఇస్తామన్నారు. గ్రామాల్లోనే సచివాలయాలు ఏర్పాటు చేసి ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్, పెన్షన్లు, రేషన్‌కార్డులు తదితర సమస్యలను 72గంటల్లోగా పరిష్కరించే ఏర్పాటు చేస్తానని ప్రకటించారు.

11వందల కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి

జిల్లాలోని కలిగిరి వద్ద 11వందల కిలోమీటర్ల పాదయాత్రను జగన్ పూర్తి చేశారు. ఇదే జిల్లాలో ఆయన సైదాపురం వద్ద 1000 కిలోమీటర్లు పూర్తి చేసిన విషయం తెలిసిందే.

బాపట్లలో దక్షిణాది విపత్తుల నిర్వహణ కార్యాలయం



గుంటూరు జిల్లా బాపట్లలో హెచ్‌ఆర్‌డి ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - బాపట్ల (గుంటూరు జిల్లా)

దక్షిణాది రాష్ట్రాల జాతీయ విపత్తు నిర్వహణ శిక్షణ, పరిశోధనలు ఇకపై గుంటూరు జిల్లా బాపట్లలో నిర్వహిస్తామని కేంద్ర హోం శాఖ అదనపు కార్యదర్శి బిపిన్ మాలిక్ చెప్పారు. ఈ మేరకు సంస్థ కేంద్ర కార్యాలయాన్ని బాపట్ల మానవ వనరుల అభివృద్ధి సంస్థలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ కేంద్రం శాశ్వత భవనాల ఏర్పాటుకు కృష్ణా జిల్లా గన్నవరం వద్ద పదెకరాలను కేటాయించినా అక్కడ పూర్తి స్థాయిలో వసతుల్లేవని, ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం బాపట్ల మానవ వనరుల అభివృద్ధి సంస్థను ఎంపిక చేసిందని వెల్లడించారు. సంస్థను మరింత విస్తరించేందుకు, అదనపు వసతులు కల్పించేందుకు అన్వేషిస్తున్నామని, శిక్షణ ఇచ్చే దక్షిణాది రాష్ట్రాల విపత్తు నిర్వహణ సంస్థల అధికారులకు వసతి సౌకర్యాల కోసం ఏర్పాట్లపై కసరత్తు చేస్తున్నామని చెప్పారు. ఇక్కడ కార్యక్రమాల పర్యవేక్షణకు జాయింట్ అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారి ట్రైనింగ్ కో-ఆర్డినేటర్‌గా ఉంటారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ జనరల్ చక్రపాణి, జాతీయ శిక్షణ కో-ఆర్డినేటర్ అనిల్ షెకావత్, బాపట్ల తహశీల్దార్ వల్లయ్య పాల్గొన్నారు.

చీరలిస్తామని మోసం చేశారు

సిఎం సభకు వచ్చిన మహిళల ఆగ్రహం



గుంటూరు జిల్లా చీరాల వద్ద మహిళలను అదుపు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ (గుంటూరు)

అమృతా విశ్వవిద్యాలయ పీఠం శంకుస్థాపనలో భాగంగా సిఎం సభకు మహిళలను భారీగా తరలించారు. వచ్చినవారందరికీ చీరలిస్తామని చెప్పి జిల్లాలోని వివిధ మండలాల నుండి పిలిపించారు. రాజధాని ప్రాంతంలో అయితే ఏకంగా దండోరా వేశారు. దీంతో మహిళలు తెల్లవారుజాము నుంచే ఇళ్ళలో పనులు చూసుకొని సుదూర ప్రాంతాల నుండి ఆర్‌టిసి బస్సుల్లో భారీగా తరలివచ్చారు. వీరికి కనీసం తాగునీటి సదుపాయం కూడా కల్పించలేదు. సిఎం సభ అయిన వెంటనే భోజనం, చీరలు ఇస్తా'మని మైకులో ఒకటికి నాలుగుసార్లు ప్రకటించారు. అయితే సిఎం వెళ్లిపోయాక ఎవరూ పట్టించుకోకపోవడంతో మహిళలంతా డ్వాక్రా యానిమేటర్లను నిలదీశారు. వారు సైతం నాయకులకు ఫోన్‌లు చేసినా స్పందించలేదు. ఇదిలా ఉండగా మహిళలను వేల సంఖ్యలో తరలించి ఐదారు వందల చీరలే తెచ్చారు. వీటిని పంపిణీ చేస్తే తొక్కిసలాట జరుగుతుందని పోలీసులు వాటిని వేరే ప్రదేశానికి తరలించారు. దీనిపై మహిళలు ఆందోళనకు దిగే ప్రయత్నం చేయగా రంగప్రవేశం చేసిన పోలీసులు అందర్నీ పక్కకు నెట్టివేశారు. చివరికి కొద్దిమంది పార్టీ కార్యకర్తలకు చీరలు అందించారు.

దుర్గగుడిలో ఈ గవర్నెన్స్

- పాలకవర్గం సమావేశంలో నాలుగు తీర్మానాలు ఆమోదం

ప్రజాశక్తి -ఇంద్రకీలాద్రి(విజయవాడ)

దుర్గగుడిలో ఈ గవర్నెన్స్ అమలు చేసేందుకు పాలకవర్గ సభ్యులు ఆమోదం తెలిపారు. విజయవాడ జమ్మిదొడ్డి కార్యాలయంలో బుధవారం జరిగిన దుర్గగుడి పాలకవర్గం సమావేశంలో పలు అంశాలను ఆమోదించారు. దేవస్థానం వైదిక కమిటీ సలహా మేరకు స్వామి వారి ఆలయానికి కళ్యాణ కార్యక్రమం, ఆర్జిత సేవలకు ప్రదేశం మార్పులు తదితర వాటికి ఆమోదం లభించింది. అన్నప్రాసన, అక్షరాభ్యాసం, నామకరణ వంటి కార్యక్రమాలను అన్నదానం పాత క్యూ కాంప్లెక్స్ ప్రాంతంలో జరిపేలా ఆమోదించారు. సమావేశం అనంతరం ఆలయ ఈవో ఎం.పద్మ విలేకరులతో మాట్లాడుతూ టికెట్ల ధర తగ్గింపు అంశం పరిశీలనలో ఉందన్నారు. పాలకవర్గ సమావేశంలో ఏడు అంశాలకు నాలుగింటిని ఆమోదించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గౌరంగబాబు, సభ్యులు బడేటి ధర్మారావు, పద్మాశేఖర్‌రావు, కోడేల సూర్యలతాదేవి, సాంబ సుశీలాదేవి, బీరక ప్రసాద్, ఇట్టా పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68